Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ చతుర్దశి ఉ. 8.29 వరకు, అనంతరం పూర్ణిమ; నక్షత్రం: మఖ రా.11.58 వరకు, అనంతరం పుబ్బ; అమృతకాలం: రా.9.45 నుండి 11.15 వరకు; వర్జ్యం: మ.12.38 నుండి 2.15 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;

సంపుటి:56 • సంచిక:319 • గురువారం 1 మార్చి 2018 • హైదరాబాద్ • పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి
శివైక్యం

శంకరాచార్య పరంపరలో 69వ వారైన జయేంద్ర సరస్వతి బుధవారం ఉదయం శివసాయుజ్యాన్ని పొందారు. మూడు దశాబ్దాల క్రితం శరణాగత రక్షక ఆపద్బాంధవ అంటూ సకల మానవాళికీ దివ్య మంత్రాన్ని ఉపదేశించారు. నాలుగు మెతుకులు తినే ముందు పరిసరాల్లోని ప్రాణుల క్షుద్బాధను తీర్చాలనేది ఆయన పాటించిన సూత్రం. తన 19వ ఏట అంటే 1954లో కంచి పరమాచార్యకు వారసుడుగా ఎంపికయ్యారు. కంచి పరమాచార్య సేవలో జయేంద్ర నడుస్తూ.. అద్వైతంతో పాటూ లౌకికమైన అంశాలపైనా దృష్టి సారించారు. ఆయన సారథ్యంలోనే కంచి ట్రస్టు ఆపన్నులకు అండగా నిలిచింది. శైవ వైష్ణవ భేదం ఉండనే కూడదనేది ఆయన ఆకాంక్ష. శిష్యులకూ, తనను కలిసిన ప్రవచనకర్తలకూ ఈ తత్వాన్ని భక్తులకు బోధించాలని ప్రబోధించేవారు.

- కంచిలోని శంకర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్నుమూత
- నేటి ఉదయం మహాసమాధి
- ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, చంద్రబాబు సంతాపం
- చిన్నస్వామి విజయేంద్ర సరస్వతికి కొత్త బాధ్యతలు

కొత్త పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి



వివరాలు 2లో...



కంచిమఠంలో జయేంద్ర సరస్వతి పార్థివ దేహం

ఎమ్మెల్యేలు.. ఎంపీలకు
స్పెషల్ కోర్టు

- క్రిమినల్ కేసుల సత్వర విచారణకు సెషన్స్ జడ్జి స్థాయి న్యాయాధికారితో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు నోటిఫికేషన్
- రాష్ట్రంలో క్రిమినల్ కేసులు ఎక్కడ నమోదైనా ఈ కోర్టులోనే విచారణ
- ఇప్పటికే నమోదైన కేసులు దీనికి బదలాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎంపికైన ఎమ్మెల్యేలు, ఎంపీలపై దాఖలయ్యే క్రిమినల్ కేసుల (ట్రయల్) విచారణకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోని సాహస కార్యానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఎన్నో విప్లవాత్మక పథకాలతో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న సీఎం కె చంద్రశేఖరరావు మరో అడుగు ముందుకు వేశారు. ఎవరు కూడా ఊహించని విధంగా ఎమ్మెల్యేలు, ఎంపీలపై దాఖలయ్యే క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అధికార పార్టీ కావచ్చు.. ప్రతిపక్ష పార్టీ కావచ్చు.., ఎవరైనా సరే , వారిపై క్రిమినల్ కేసులు నమోదైతే విచారణ జరిపి ⇨ 3వ పేజీలో...

ఒక స్వప్నం నిజమైతే
అది నువ్వే
ఒక దర్పం నడిచొస్తే
అది నువ్వే
ఒక అందం విరులైతే
అది నువ్వే
ఒక మేఘం వర్షిస్తే
అది నువ్వే నువ్వే
ఒక గాథే గాయం చేస్తే
అది నువ్వే
ఒక బాధే మెలిపెడితే
అది నువ్వే నువ్వే
శతకోటి గుండెలు
ఘోషిస్తే అది మేమే!

❖ ❖ ❖

- ఆరాధ్య దేవతకు అశ్రు నివాళి
- జనసంద్రమైన ముంబై
- మల్లెపూల వాహనంలో అంతిమయాత్ర
- తరలొచ్చిన తారాలోకం
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- తలకొరివి పెట్టిన బోనీ

అతిలోక సుందరి అనంత లోకాలకు!



వివరాలు 10లో...

బుధవారం ముంబై నగర వీధుల గుండా అశేష జనవాహిని మధ్య శ్రీదేవి అంతిమయాత్ర

మానవా.. ఇక సెలవ్!

ప్రశాంత వదనం..నిద్ర లోగిళ్లలో నయనద్వయం.ఆమెకిష్టమైన అరుణ వర్ణపు పట్టుచీరె..అత్యంత ప్రియమైన లక్ష్మీదేవి సహిత ఏడు వారాల నగలు....చెరగని అందానికి అదనపు హంగులు..ఆకర్షణీయమైన మేకప్..నుదుట కాసంత బొట్టు..అచేతనావస్థలో ఆహ్లాదంగా నిద్రిస్తున్నట్టున్న అతిలోక సుందరి! నిండైన జాతీయ పతాకంలో ఒద్దికగా ఒదిగిపోయిన పార్థివదేహం.. మల్లెపూలాలంకృత పూలపడవలాంటి ఎత్తయిన భారీ వాహనంలో.. రెండు గంటలకు పైగా అంతిమయాత్ర! ముంబయ్ నగర వీధులు మూగబోయిన వేళ..యావత్ దేశం నివ్వెరపోయి వీక్షించిన వైనం! అందాల తార ఆకాశపు తారల్లో లీనమై.. కనుమరుగై.. భారతీయ సినీ చరిత్రలో ఓ చెరగని అధ్యాయంగా మిగిలింది!!





చిదంబరం తనయుడు
కార్తీ అరెస్ట్

- చెన్నై ఎయిర్‌పోర్టులో అదుపులోకి
- ఒకరోజు పోలీస్ కస్టడీకి

వివరాలు 6లో...

ఈసారి అధికారం మాదే
ఇక్కడ కాంగ్రెస్ అక్కడ రాహుల్



- రాకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి

9 లో

పొత్తులు ఉంటాయ్

- బీజేపీ తెగదెంపులు చేసుకున్నట్టే
- కాంగ్రెస్, తెరాసల్లో ఒకదానితో పొత్తుకు సంకేతాలు
- పార్టీని బతికిస్తా
- కార్యకర్తలను కాపాడుకుంటా
- తెదేపా తెలంగాణ విస్తృత స్థాయి సమావేశంలో చంద్రబాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో ఏదేనీ ఒక రాజకీయ పార్టీతో పొత్తు ఉంటుందని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తెదేపాతో పొత్తు లేదంటూ భాజపా ఇప్పటికే రెండుసార్లు ప్రకటించినందున ఆ పార్టీతో తమకు సంబంధం ఉండదని తేల్చిచెప్పారు. తెలుగుదేశంపార్టీ తెలంగాణ విస్తృతస్థాయి సమావేశం బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో ⇨ 9వ పేజీలో...



బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో తెలుగుదేశం తెలంగాణ పొలిట్‌బ్యూరో సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు

ఔరా..!



పుంజుకున్న వృద్ధిరేటు

- జీడీపీ 7.2 శాతానికి పెరుగుదల
- చైనాను మించిపోయిన భారత్

6 లో

నేను బిజీ

- నాకు బోలెడు బిజినెస్‌లు
- భారత్ రాలేను
- విచారణకు సహకరించలేను
- సీబీఐ ఈమెయిల్‌కు నీరవ్ సమాధానం





మంటల్లో బెంజ్

- ఓఆర్ఆర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- మంటలు అంటుకుని కారు దహనం
- భీమవరం వ్యక్తి మృతి

8 లో

ఎంపీల అలవెన్స్‌ల పెంపు

- నియోజకవర్గ భత్యం రూ.45 వేల నుంచి 70 వేలకు పెంపు
- మనుషుల రవాణా నిరోధక బిల్లుకు కేబినెట్ పచ్చజెండా
- మహిళలను, చిన్నారులను రవాణా చేస్తే జీవిత ఖైదు

11 లో

సాగర్ డ్యాంపై మళ్లీ జలరగడ



తెలుగు రాష్ట్రాల నీటి అధికారుల మధ్య వాగ్వాదం

- నాగార్జున సాగర్ డ్యాంపై ఎస్‌పీఎఫ్ భారీ బందోబస్తు
- టీఆర్ఎస్ నాయకుల ధర్నా

3 లో

కంచి కామకోటి పీఠం తమిళనాడులోని కాంచీపురంలో ఉంది. హిందూ సన్యాసి సంస్థ. దీని అధిపతిని శంకరా చర్యగా పిలుస్తారు. క్రీస్తు పూర్వం 482వ సంవత్సరంలో ఆది శంకరాచార్య ఈ మఠాన్ని స్థాపించారు. ఈ సంస్థ కింద పాఠశాలలు, నేత్ర వైద్యాలయాలు, ఆస్పత్రులు నడుస్తున్నాయి. దక్షిణ భారత దేశంలో మఠా నికి లక్షల సంఖ్యలో అభిమానులున్నారు. ఏటా లక్షలలో భక్తులు మఠాన్ని సందర్శిస్తారు.

స్వామి అదృశ్యమైన మూడు రోజులు...

19 ఏళ్ళ వయసులో చంద్రశేఖర సరస్వతి వారసుడిగా జయేంద్ర సరస్వతిని ఎంపికచేశారు. 1987లో ఆయన మఠం నుంచి ఉన్నట్లుండి అదృశ్యమై పోయారు. పవిత్రమైన జంధ్యాన్నీ, మత విశ్వాసాలకు సంబంధించిన వస్తువులనూ తన వసతి గృహంలోనే ఉంచి వెళ్ళిపోయారు. మూడు రోజుల అనంతరం ఆయనను కర్ణాటకలోని తలకావేరి ప్రాంతంలో కనుగొన్నారు. ఆ సమయంలో జయేంద్ర సరస్వతి వారసుడుగా ఎంపికైన విజయేంద్ర సరస్వతి మఠం బాధ్యతలను నిర్వర్తించారు. నిత్యానుష్టానాలు, తదితర కార్యక్రమాలను ఆయన చేపట్టారు.



కంచిపీఠం

జయేంద్ర సరస్వతి తాను మఠం నుంచి వెళ్ళిపోవడానికి దారితీసిన పరిస్థితులేమిటో వెల్లడించలేదు. 1994లో జయేంద్ర సరస్వతి పీఠం బాధ్యతలను చేపట్టారు.

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం



- కంచిలోని శంకర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్నుమూత
- నేటి ఉదయం మహాసమాధి
- ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, చంద్రబాబు సంతాపం
- చిన్నస్వామి విజయేంద్ర సరస్వతికి కొత్త బాధ్యతలు

కాంచీపురం: కంచి కామకోటి 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి(82) శివైక్యం చెందారు. కొంతకాలంగా ఆయన శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి జయేంద్ర సరస్వతికి ఒక్కసారిగా శ్వాస సమస్యలు తలెత్తడంతో శిష్యులు కంచి మఠానికి చెందిన ఆస్పత్రికి తరలించారు.

వైద్యులు ఆయనకు మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో కంచిలోని ఏబీసీడీ ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. జయేంద్ర సరస్వతి స్వామి భౌతిక కాయాన్ని ఆసుపత్రి నుంచి కంచి మఠానికి తీసుకుని వచ్చారు. అనంతరం ఆయన పార్థివదేహానికి శాంతి పూజ తదితర శాస్త్రోక్తమైన పూజలు నిర్వహించి ప్రజల సందర్శనార్థం ఉంచే ఏర్పాట్లు చేశారు.

గురువారం ఉదయం 8 గంటలకు జయేంద్ర సరస్వతి మహాసమాధి కానున్నారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి బృందావనం పక్కనే మహాస మాధికి ఆయన శిష్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన మరణ వార్త తెలియగానే కాంచీపురం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి భక్తులు కడసారి దర్శనానికి పెద్ద ఎత్తున మఠానికి తరలి వచ్చారు. అభినవ శంకరు లుగా ప్రసిద్ధి గాంచిన జయేం ద్ర సరస్వతి 1935, జులై 18న తమిళనా డులోని మన్నార్‌గుడి సమీపంలోని ఇరుల్‌నిక్కి గ్రామంలో జన్మిం చారు. అసలు పేరు సుబ్రహ్మణ్య మహా దేవ అయ్యర్. చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామి అనంతరం 1954, మార్చి 24న కంచి పీఠానికి 69వ పీఠాధిపతిగా నియమితుల య్యారు. అనంతరం ఆయన పేరును జయేంద్ర సరస్వతిగా మార్చుకున్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో జయేంద్ర సరస్వతి వారిది ఓ స్వర్ణ యుగంగా కీర్తిగడించింది. జయేంద్ర సరస్వతి శివైక్యంతో ఏర్పడిన ఖాళీని చిన్న స్వామి విజయేంద్ర సరస్వతి భర్తీ చేస్తారు. మఠం నిబంధ నల ప్రకారం ఆయనను 70వ శంకరా చార్యునిగా వ్యవహరిస్తారు.



సామాజికసేవకు విశేష కృషి

చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అడుగు జాడల్లో నడి చేందుకు 19వ ఏట సన్యాస ఆశ్రమం స్వీకరిం చిన జయేం ద్ర సరస్వతి సమాజ అభ్యున్నతి కార్యక్రమాలు నిర్వహిం చాలని గట్టిగా విశ్వసించేవారు. ఆల యాలతో పాటు విద్యాలయాలు, వైద్య శాలలు అవసరమని భావిం చారు. దీంతో పాఠశాలల నుంచి వర్శిటీ వరకూ విద్యాభి వృద్ధిలోనూ భాగస్వాములయ్యారు.

నిరుపేదల కోసం పలు చోట్ల వైద్యశాలలను నెలకొల్పారు. వయో వృద్ధుల కోసం వృద్ధాశ్రమాలు, గోవుల రక్షణకు గోశాలలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం సైతం అందించారు.

జయేంద్ర సర్వస్వతి స్వామి వారు తన సందేశాల ద్వారా ప్రజల్లో చైతన్య కాంతులు నింపారు. జయేంద్ర సరస్వతి నేతృత్వంలో కంచి పీఠం అనేక సామాజిక కార్యక్రమాలను చేపడుతోంది. ఆయన ఆధ్వర్యంలో కంచి పీఠం మరింతగా వృద్ధి చెందింది. మఠం ఆధ్వర్యంలో చెన్నైలోని శంకర నేత్రాలయ, అసోం లోని గౌహతి వద్ద శంకర దేవ నేత్రాలయ వంటివి స్థాపించారు. అనేక పాఠశాలలు, పిల్లల ఆసుపత్రి, హిందూ మిషన్ ఆసుపత్రి వంటివి సైతం కంచి పీఠం నిర్వహిస్తోంది.

కంచి పీఠాధిపతుల జాబితా

1) ఆది శంకర భాగవత్పద	(క్రీ.పూ. 482-477)
2) సూరేశ్వర చార్య	(క్రీ.పూ. 477-407)
3) సర్వజ్ఞాత్మన్	(క్రీ.పూ. 407-367)
4) సత్యబోధేంద్ర సరస్వతి	(క్రీ.పూ. 367- 268)
5) జ్ఞానానేంద్ర సరస్వతి	(క్రీ.పూ. 268-205)
6) సుద్ధనందేంద్ర సరస్వతి	(క్రీ.పూ. 205-124)
7) ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి	(క్రీ.పూ. 124- 55)
8) కైవల్యానంద యోగేంద్ర సరస్వతి	(క్రీ.పూ. 55-28 క్రీ.శ)
9) శంకరేంద్ర సరస్వతి	(క్రీ.శ.28- 69)
10) సురేశ్వర సరస్వతి	(క్రీ.శ. 69- 127)
11) శివానంద చిద్‌జ్ఞానేంద్ర సరస్వతి	(127-172)
12) చంద్రశేఖర సరస్వతి	(172-235)
13) సచ్చిదానందేంద్ర సరస్వతి	(235-272)
14) విద్యాజ్ఞానేంద్ర సరస్వతి	(272-315)
15) గంగాధరేంద్ర సరస్వతి	(317-329)
16) ఉజ్వల శంకరేంద్ర సరస్వతి	(329-367)
17) సదాశివ సరస్వతి	(367-375)
18) శంకరానంద సరస్వతి	(375-385)
19) మార్తాండ విద్యాజ్ఞానేంద్ర సరస్వతి	(385-398)
20) ముక శంకరేంద్ర సరస్వతి	(398-437)
21) చంద్రశేఖరేంద్ర సరస్వతి	(437-447)
22) బోధేంద్ర సరస్వతి	(447-481)
23) సచ్చిసుఖేంద్ర సరస్వతి	(481-512)
24) చిత్‌సుఖేంద్ర సరస్వతి	(512-517)
25) సచ్చిదానంద జ్ఞానేంద్ర సరస్వతి	(527-548)
26) ప్రజ్ఞ జ్ఞానేంద్ర సరస్వతి	(548-565)
27) చిద్విలాసేంద్ర సరస్వతి	(565-577)
28) మహదేవేంద్ర సరస్వతి	(577-601)
29) పూర్ణభోదేంద్ర సరస్వతి	(601-618)
30) భోదేంద్ర సరస్వతి	(618-655)
31) బ్రహ్మానంద జ్ఞానేంద్ర సరస్వతి	(655-668)
32) చిదానంద జ్ఞానేంద్ర సరస్వతి	(668-672)
33) సచ్చిదానంద సరస్వతి	(672-692)
34) చంద్రశేఖరేంద్ర సరస్వతి -3	(692-710)
35) చిత్ సుఖేంద్ర సరస్వతి	(710-737)
36) చిత్ సుఖానందేంద్ర సరస్వతి	(737-758)
37) విద్యా జ్ఞానేంద్ర సరస్వతి -3	(758-788)
38) అభినవ శంకరేంద్ర సరస్వతి	(788-840)
39) సత్ చిద్విలాసేంద్ర సరస్వతి	(840-873)
40) మహదేవేంద్ర సరస్వతి -2	(873-915)
41) గంగాధరేంద్ర సరస్వతి	(915-950)
42) బ్రహ్మానంద జ్ఞానేంద్ర సరస్వతి	(950-978)
43) ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి	(978-1014)
44) పూర్ణభోదేంద్ర సరస్వతి -2	(1014-1040)
45) పరమశివేంద్ర సరస్వతి -1	(1040-1061)
46) సంద్రానంద్ర భోదేంద్ర సరస్వతి	(1061-1098)
47) చంద్రశేఖరేంద్ర సరస్వతి -4	(1098-1166)
48) అద్వైతానంద భోదేంద్ర సరస్వతి	(1166-1200)
49) మహదేవేంద్ర సరస్వతి - 3	(1200-1247)
50) చంద్ర చూడేంద్ర సరస్వతి -1	(1247-1297)
51) విద్యతీర్థేంద్ర సరస్వతి	(1297-1385)
52) శంకరానందేంద్ర సరస్వతి	(1385-1417)
53) పూర్ణానంద సదాశివేంద్ర సరస్వతి	(1417-1498)
54) వ్యాసాచల సదాశివేంద్ర సరస్వతి	(1498-1507)
55) చంద్రచూడేంద్ర సరస్వతి - 2	(1507-1524)
56) సర్వజన సదాశివ భోదేంద్ర సరస్వతి	(1524-1539)
57) పరమశివేంద్ర సరస్వతి - 2	(1539-1586)
58) ఆత్మభోదేంద్ర సరస్వతి	(1586-1638)
59) భోదేంద్ర సరస్వతి	(1638-1692)
60) అద్వైతాత్మ ప్రకాశేంద్ర సరస్వతి	(1692-1704)
61) మహాదేవంద్ర సరస్వతి-4	(1704-1746)
62) చంద్రశేఖరేంద్ర సరస్వతి - 5	(1746- 1783)
63) మహదేవేంద్ర సరస్వతి - 5	(1783-1813)
64) చంద్రశేఖరేంద్ర సరస్వతి -6	(1813-1851)
65) సుదర్శన మహదేవేంద్ర సరస్వతి	(1851-1891)
66) చంద్రశేఖరేంద్ర సరస్వతి -7	(1891-1907)
67) మహదేవేంద్ర సరస్వతి -5	(1907-6 రోజులు)
68) చంద్రశేఖరేంద్ర సరస్వతి	(1907- 1994)
69) జయేంద్ర సరస్వతి	(1994- 2018)
70) శంకర విజయేంద్ర సరస్వతి	(28 ఫిబ్రవరి 2018 నుంచి...)



కొత్త పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి



కాంచీపురంలోని శ్రీకంచిపీటం 70వ పీఠాధిపతిగా శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామిగల్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. విజయేంద్ర సరస్వతి 1969 మార్చి 13న జన్మించారు. ఈయన అసలు పేరు శంకర నారాయణన్. ఆరవ తరగతి సాధారణ పాఠశాల విద్యను అభ్యసించారు. మరోవైపు సాయంత్రం వేళల్లో వేద వేద విద్యను కూడా అభ్యసించారు. ఆయన తండ్రి పేరు క్రిష్ణమూర్తి శాస్త్రి. ఈయన వేదశాస్త్రంలో స్కాలర్. ఉత్తర తమిళనాడులోని పోలూర్ వేద పాఠశాలలో రుగ్వేదం బోధించేవారు. విజయేంద్ర సరస్వతి తన 14వ యేట (1983) సన్యాసం స్వీకరించారు. జయేంద్ర సరస్వతి తదుపరి పీఠాధిపతిగా శంకరనారాయణన్‌ను ప్రకటించారు. అదే సమయంలో ఆయన పేరును శంకర విజయేంద్ర సరస్వతిగా మార్చారు. కంచిపీఠం 69వ మఠాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించిన శ్రీ జయేంద్ర సరస్వతి స్వామిజీ శివైక్యం చెందడంతో 2018 ఫిబ్రవరి 28నుంచి విజయేంద్ర సరస్వతి మఠాధిపతిగా కొనసాగుతారు.

♦జయేంద్ర సరస్వతి వారు మఠాన్ని వీడివెళ్లిన సమయంలో, అంటే 1987లో చంద్రశేఖరేంద్ర సరస్వతి వారు జయేంద్ర సరస్వతిని కంచి పీఠానికి 70వ ఆధ్యాత్మిక గురువుగా ప్రకటించడం జరిగింది. కొద్ది రోజుల తర్వాత జయేంద్ర సరస్వతి తిరిగి వచ్చారు. దీంతో మఠంలో ఒకేసారి ముగ్గురు పీఠాధిపతులు ఉన్నట్లు అయింది.

♦ వేద సంప్రదాయాన్ని పరిరక్షిస్తూనే, వేద భావజాలాన్ని యువతలో పెంపొందించే కార్యక్రమాలను విజయేంద్ర సరస్వతి పర్యవేక్షిస్తున్నారు. ♦ లోకధర్మ ఫౌండేషన్ స్థాపనలో విజయేంద్ర స్వామి ప్రధాన పాత్ర పోషించారు. దీనిద్వారా దేశంలోని హిందూ ఆలయాల నిర్వహణకు వలంటీర్లను ఏర్పాటు చేసేవారు. ♦ శంకరరామన్ హత్య కేసులో జయేంద్ర సరస్వతితోపాటు ఈయన కూడా జనవరి 2005లో అరెస్టయ్యారు. నెలరోజుల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు.

జయేంద్ర సరస్వతి జీవిత విశేషాలు

♦ తమిళనాడులోని తంజావూరు జిల్లాలో ఉన్న ఇరుల్నీకి గ్రామంలో సుబ్రమణియం మహదేవ అయ్యర్ 1935 జూలై 18న జన్మించారు. 1954లో ఆయన జయేంద్ర సరస్వతిగా మారారు.

♦ అప్పటి నుంచి మఠానికి నాయకత్వం వహిస్తున్నారు. 19 ఏళ్లవయ సులోనే పీఠాధిపతి బాధ్యతలు చేపట్టారు. జయేంద్ర సరస్వతి 69వ శంకరాచార్యుడు.

♦ 1987లో జయేంద్ర సరస్వతి వారు ఉన్నఫలాన అదృశ్యమయ్యారు. తనకు సంబంధించిన అన్ని జ్ఞాపకాలను వీడి వెళ్లిపోయారు. చివరకు మూడు రోజుల తర్వాత ఆయన జాడను కర్నాటకలో గుర్తించారు. అలా అదృశ్యం కావడానికి గల కారణమేమిటో నేటికీ తెలియరాలేదు.

♦ ఆధ్యాత్మికసేవా కార్యక్రమాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను కంచి పీఠంవిస్తృతంగా చేపట్టింది. ఆసుపత్రులు, విద్యా సంస్థలను నెలకొల్పింది. మెడికల్ కాలేజీ కూడా వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉన్నది.



♦ అయోధ్య వివాదం పరిష్కారానికి కూడా జయేంద్ర సరస్వతుల వారు ప్రయత్నించారు.

♦ 2004లో కాంచీపురం ఆలయ ఉద్యోగి శంకరరామన్ హత్య కేసులో జయేంద్ర సరస్వతి నిందితునిగా అభియోగాలు ఎదుర్కొన్నారు.

♦ మొత్తం 22మందిపై అభియోగాలు మోపారు. 2013లో వాటిని న్యాయస్థానం కొట్టేసి, జయేంద్ర సరస్వతిని కేసు నుంచి విముక్తుణ్ణి చేసింది.

ప్రముఖుల సంతాపం

జయేంద్ర సరస్వతి మృతికి ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలుపుతూ జయేంద్ర సరస్వతి స్వామిని తాను కలిసినప్పటి ఒక ఫోటోను కూడా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'కంచి కామకోటి పీఠం జగద్గురు పూజశ్రీ జయేద్ర సరస్వతి శంకరాచార్య మృతి తీవ్ర ఆవేదనను కలిగించింది. సమున్నత ఆశయాలు, విశిష్ట సేవల ద్వారా ఆయన లక్షలాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అని ఆ ట్వీట్‌లో మోడీ పేర్కొన్నారు.

-ప్రధానమంత్రి నరేంద్రమోడీ

కంచి పీఠాతిపతిగా జయేంద్ర సరస్వతి మానవీయ విలువలను పెంపొందించారని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంతాప సందేశంలో పేర్కొన్నారు.

-ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

జగద్గురు, పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి మరణం తనను కలచివేసిందని, తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులను సంపాదించుకున్నారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు సంతాప సందేశంలో పేర్కొన్నారు.

-కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

- భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా సైతం సంతాపం తెలిపారు. శ్రీ జయేంద్ర సరస్వతి ఆధ్మాత్మికవేత్తగా సమాజం, మానవాళి ఉద్ధరణకు విశేష సేవలందించారని, ఆయనకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుయా యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. స్వామీజీ ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. జయేంద్ర సరస్వతి స్వామీజీతో దిగిన ఫోటోను కూడా అమిత్‌షా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

-బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా



అయోధ్య సమస్యకు సున్నితమైన పరిష్కారం కోసం విశేష కృషిచేసిన మహనీయుడని కీర్తించారు. ఈ క్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలతో ఆయన చర్చలు జరిపారని, ఆయన కృషి ఫలితంగా హిందూ-ముస్లింల మధ్య పరస్పర విశ్వాసం ఏర్పడిందన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. **- ఎల్‌కే అద్వానీ**

గవర్నర్ నరసింహన్, తెలుగు సీఎంల నివాళులు

కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి మృతిపట్ల ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆధ్యాత్మిక గురువుగా దేశంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన మృతి దేశానికి తీరని లోటని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, దేశాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. సమ సమాజ స్థాపనకు, శాంతికి జయేంద్ర సరస్వతి చేసిన కృషి, ఆధ్యాత్మిక భోదనలు, ధార్మికసేవలు ఎన్నటికీ మరిచిపోలేనివని కేసీఆర్ తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు దేవాదాయశాఖ అధికారులు కంచికి బయలుదేరి వెళ్ళారు.

శంకరరామన్ హత్యకేసు



2004లో ఒక ఆలయ మేనేజర్ శంకర రామన్ హత్య కేసులో జయేంద్ర సరస్వతిని నిందితుడిగా చేర్చారు. 2000 సంవత్సరంలో స్వామి చైనా దేశ యాత్రకు వెళ్ళాలని సంకల్పించారు. దీనికి శంకరరామన్ అభ్యంతరపెట్టారు. కోర్టు జోక్యం చేసుకుని ఆయన పర్యటనను ఆపాలని పిటిషన్ వేశారు. సముద్రాన్ని దాటితే ఒక హిందువు తన మతాన్ని కోల్పోతాడనీ, కంచి పీఠం అధిపతిగా జయేంద్ర సరస్వతికి ఈ విషయం బాగా తెలిసే ఉంటుందనీ ఆయన వాదించారు. ఈ క్రమంలో జయేంద్ర సరస్వతి తన విదేశీ పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. కొంత కాలం తరవాత, మఠంలోకి రాకుండా శంకర రామన్‌ను నిషేధించారు. తరవాత, శంకర రామన్ జయేంద్ర సరస్వతికి బహిరంగ లేఖలను రాశారు. ఆయన హెచ్చరించడం, మఠంలో ఆయన స్థానాన్ని కించపరిచేలా మాట్లాడడం, పీఠాధిపతిగా తలగించాలని కోర్టుకు వెడతానని శంకరరామన్ ఆ లేఖలలో హెచ్చరించారు. 2004 సెప్టెంబర్ 3న శంకరరామన్‌పై 5 వ్యక్తులు దేవ రాజస్వామి ఆలయంలో దాడి చేసి, కత్తులతో పొడిచి చంపారు. ఈ కేసులో జయేంద్ర, విజ యేంద్ర సరస్వతితో పాటు 22మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో ఒకరైన కత్తివరన్ తర్వాతి కాలంలో హత్యకు గుర య్యాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన కాంచీ పురం ఎస్పీ 1873 పేజీలతో చార్జిషీటును న్యాయస్థానానికి సమర్పించారు.2004 నవంబర్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్‌లో చాతుర్మాస్య దీక్షలో ఉండగా జయేంద్ర సరస్వతిని ఓ అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేసి, చెన్నైకి తరలించారు. కొన్నాళ్ళ తరవాత అంటే 10 జనవరి 2005న సుప్రీం కోర్టు వీరికి బెయిలు మం జూరు చేసింది. సుదీర్ఘ కాలం న్యాయ పోరా టం తరవాత జయేంద్ర సరస్వతిని, ఇతరులనూ నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. కేసు విచారణలో భాగంగా 2009-12 మధ్యకాలంలో 189 మందిని విచారించారు.

కంచిస్వామికి స్ఫూర్తి

నడిచే దేవుడు పరమాచార్య!



కంచి పరమాచార్య చంద్రశేఖరసరస్వతి మహాస్వామి శిష్యునిగా,ఆయన తర్వాత ఆ మఠాధిపత్యాన్ని చేపట్టి దాదాపు ఇరవై ఐదేళ్ళపాటు సమర్థవంతంగా నిర్వహించిన జయేంద్రసరస్వతిలో సేవానురక్తిని రగిలింపజేసిన వారు పరమాచార్యులే.ఈ విషయాన్ని పెక్కు సందర్భాల్లో జయేంద్ర సరస్వతి బహిరంగంగా ప్రకటించి మహాస్వామి పట్ల తన భక్తి ప్రపత్తులను వెల్లడించారు. పరమాచార్యగా ప్రసిద్ధులైన చంద్రశేఖర సరస్వతి మహాస్వామి వారి గురించి ఐదు దశాబ్దాల క్రితం ఆంధ్రప్రభ దినపత్రికలో నడిచే దేవుడనే శీర్షికన వ్యాసాలు ప్రచురితం అయ్యేవి.ఆనాటి సంపాదకులు నీలంరాజు వెంకటశేషయ్య పరమాచార్యులవారి భక్తులు. భద్రాచల రామదాసు భక్తులు కూడా ఆంధ్రప్రభలో పరమాచార్య గురించిన వ్యాసాలు ఆధ్యాత్మిక చింతనా పరులను ఎంతో ఆకర్షి చేవి. ముఖ్యంగా,లౌకిక భావ స్ఫూర్తిని ప్రజల్లో వ్యాపింపజేయడానికి అవి ఎంతో తోడ్పడేవి,అద్వైత సిద్ధాంతాన్ని మించిన లౌకికవాదం లేదని పరమాచార్యుల వారు ఉగ్గడించారు. ప్రతి మనిషిలో దేవుణ్ణి చూడటమే అద్వైత సిద్ధాంత పరమార్థం. కుల,మతాలకు అతీతంగా ఆలోచనా విధానాన్ని ప్రజల్లో వ్యాపింపజేయడానికి ఆయన ఎంతో కృషి చేశారు.ఇందుకు ఉదాహరణగా, కంచిలో కామకోటి మఠానికి సమీపంలో ఒక మసీదునుంచి అల్లాహో అక్బర్ అని తెల్లవారక ముందే నమాజు వినిపించేది. దాని వల్ల నిద్రాభంగం కలుగుతోందని కొంతమంది భక్తులు పరమాచార్య వద్దకు వచ్చి ఫిర్యాదు చేశారట.దాంతో ఆయన వారిని అనునయిస్తూ అది మన మేలుకేనని ఎందుకు అనుకోరు అని ఎదురు ప్రశ్న వేశారట. తెల్లవారక ముందే నిద్ర లేచి స్నానసంధ్యలు ముగించడం హిందూ సంప్రదాయం. ముస్లిం సోదరులు మనలను మేల్కొలుపుతున్నారని ఎందుకనుకోరు?అని పరమాచార్యులు వారు ప్రశ్నించే సరికి భక్తులు నోట మాట రాక మిన్నకుండి పోయారట। మసీదు, మందిరం పక్క పక్కన ఉన్నా ఎటువంటి ఇబ్బంది లేదన్న లౌకిక భావ సందేశాన్ని ఈ రూపేణా పరమాచార్యులవారు ఆనాడే అందించారు. పరమాచార్య సందేశాలన్నీ ఆధునిక జీవన విధానానికి ఉపయోగపడేవే. నడిచే దేవుని పేరిట ఆంధ్రప్రభలో ప్రచురితమైన వ్యాసాలన్నీ పరమాచార్యుల వారు వేర్వేరు సందర్భాల్లో అందించిన సందేశాల సారాంశాలే. పరమాచార్య పర్యటన కార్యక్రమాల కోసం ఆరోజుల్లో ఆయన భక్తులు ఆంధ్రప్రభ దినపత్రిక పుటలను ఆమూలాగ్రంగా పరిశీలించేవారు. పరమాచా ర్య ఎక్కువగా ధ్యాన ముద్రలో ఉండేవారు.అయినప్పటికీ, ఆయన ప్రవచనాల్లో సామాజిక శ్రేయస్సు ప్రధాన ఇతివృత్తంగా ఉండేది. మహాస్వామి వారి ప్రసంగాలూ,ఆయన గురించిన వ్యాసాలూ అన్ని మతాలవారినీ ఆకర్షించేవి. తాను పర్యటించిన ప్రతి గ్రామం,పట్టణం,నగరాల్లో గోపూజలను నిర్వహించేవారు.గోవును ప్రత్యక్ష దైవంగా కొలిచేవారు. వేదాధ్యయనం, గోసేవలతోనే పాడిపంటలు వృద్ధి చెందుతాయని పరమాచార్య తన ప్రవచనాల్లో ప్రబోధించేవారు. పరులకు ధర్మాలు బోధించేవారు శీలవర్తనులై, ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలనీ,అలాంటి వారి మాలనే ప్రజలు గౌరవిస్తారని పరమాచార్య ప్రబోధించారు. ఆయన ప్రవచనాల సంగ్రహమే ఆంధ్రప్రభలో ఆనాడు ప్రచురితమైన నడిచే దేవుడు వ్యాసాలు. ఆ మహాస్వామి అపురూపమైన ప్రసంగాలను అక్షరబద్ధం చేసిన తెలుగువారికి అందించడమే కాకుండా,భద్రాచలంలో పర్ణశాల నిర్మాణానికి విరాళాలను సేకరించి పంపిన నీలంరాజువెంకటశేషయ్యను అప్పట్లో ఆధ్యాత్మిక వేత్తలు ఘనంగా సత్కరించారు. పరమాచార్యుల వారిపై వ్యాసపరంపరకు నడిచే దేవుడు అనే మకుటాన్ని పెట్టింది కూడా శేషయ్యగారే.

ఇంటింటికీ మెరుగైన పౌర సేవలు

- టీ-ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా గ్రామస్థాయికి ఇంటర్నెట్ సేవల విస్తరణ
- పరిపాలన సరళతరం.. సేవలు సులభతరం:మంత్రి కేటీఆర్
- టీ-యాప్ ఫోలియో మొబైల్ యాప్ ఆవిష్కరణ
- ప్రస్తుతం 150, త్వరలో 600 సేవలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటింటికీ ఇంటర్నెట్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమంతో మెరుగైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. అందులో భాగంగానే టి-ఫైబర్ నెట్ విస్తరణకు చర్యలు వేగవంతం చేశామన్నారు. పరిపాలన విధానాలను సరళతరం చేసి ఆన్‌లైన్ సేవలు సులభతరంగా పొందేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. వచ్చే రెండేళ్ళ లోనే ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యం నెరవేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో రూపొందించిన 'టి-యాప్ ఫోలియో' మొబైల్ యాప్‌ను బుధవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సేవలను వెబ్‌సైట్ల ద్వారా, మొబైల్ యాప్ల ద్వారా విస్తరిస్తే పారదర్శకమైన వ్యవస్థ ఆవిష్కృతమవుతుందని అన్నారు. అదే సమయంలో అత్యవసర సేవలు పొందడం ఎంతో సులభమవుతుందని, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అందించే పౌర సేవలను పొందాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంటర్నెట్, కంప్యూటర్ అత్యంత ప్రధానమైందని పేర్కొన్నారు. ఇదివరకు కూడా ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాలకు వెళ్ళాల్సి వచ్చేదన్నారు.

తెలంగాణ ప్రభుత్వంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రతి మారుమూల గ్రామానికి సైతం విస్తరిస్తోందని, ఫలితంగా ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా సేవలను అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాల మెట్టు ఎక్కకుండానే అన్ని సేవలు ఇంటింటికి ఇంటర్నెట్ ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. అందుకు టి-యాప్ ఫోలియో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ



రంగంలో 150 సేవలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంచామన్నారు. త్వరలోనే 600 పౌర సేవలను ఈ యాప్ ద్వారా అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేటీఆర్ వెల్లడించారు.

ప్రస్తుతం టి-యాప్ ఫోలియోలో ప్రజలకు పలు సేవలు లభిస్తున్నాయి. ఈ యాప్‌లో పౌరులు తమ పోస్ట్‌పెయిడ్, ల్యాండ్ లైన్, ఇంటర్నెట్, డేటాకార్డు కనెక్షన్లకు బిల్లు చెల్లింపులు చేయవచ్చు. డిటీహెచ్, మొబైల్ రీచార్జీలు చేసుకోవచ్చు. అలాగే భూమికి సంబంధించిన పహాణీ, మ్యుటేషన్, పట్టాదార్ పాస్‌బుక్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, జన్మ, మరణ ధృవీకరణపత్రాలు, నివాస ధృవీకరణపత్రం, ఓబీసీ, ఫ్యామిలీ మెంబర్‌షిప్ ధృవీకరణ పత్రాలను పొందవచ్చని మంత్రి చెప్పారు.

టి-యాప్ ఫోలియోలో పౌరులు జీహెచ్‌ఎంసి ఆస్తిపన్ను చెల్లింపు చేయవచ్చు. భద్రాచలం, యాదగిరిగుట్ట, వేములవాడ తదితర దేవస్థానాల్లో సేవా టిక్కెట్లు, రూమ్‌లను బుక్ చేసుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్, టెస్ట్‌స్లాట్ బుకింగ్, పరీక్ష ఫీజు చెల్లింపు, లైసెన్స్ రెన్యువల్, బ్యాడ్జ్, లెర్నర్స్ వంటి ఆర్టీఏ సేవలను పొందవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ, పర్యాటక, హైదరాబాద్ మెట్రో సమాచారం, మెట్రో మార్గాలు, ఛార్జీల వివరాలు, సమీపంలో ఉండే మీసేవ కేంద్రాలు, వైఫై హాట్‌స్పాట్, రేషన్ షాపులు, వ్యవసాయ సమాచారాన్ని ఈ యాప్‌లో తెలుసుకోవచ్చు. అలాగే ఆర్టీసీ బస్ రూట్లు తెలుసుకోవచ్చు. ఐసిఐసిఐ బ్యాంకుకు చెందిన బ్యాంకింగ్ సేవలను పొందవచ్చు.

ఈ యాప్‌లో సెట్టింగ్స్‌లో ఎమర్జెన్సీ సమయాల్లో కాంటాక్టు చేయాల్సిన ఫోన్ నంబర్లను కూడా ఇచ్చారు. అయితే యాప్‌లో ట్రాఫిక్ చలాన్ సేవకు బదులుగా ఆ సేవకు చెందిన డెస్క్‌టాప్ సైట్ ఓపెన్ అవుతున్నది. ఇలా సైట్ కాకుండా ఈ సేవను కూడా యాప్ రూపంలో అందిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక టి-వ్యాలెట్ సేవ కూడా ఆ యాప్‌కు రీడైరెక్ట్ అవుతోంది. ఇలా కాకుండా టి-వాలెట్ సేవలను కూడా ఇదే యాప్‌లో అందిస్తే మరింత ఉపయోగంగా ఉంటుంది. కాగా త్వరలో మరిన్ని సేవలను ఈ యాప్‌లో పౌరులకు అందుబాటులోకి తేనున్నారు.

టి-యాప్ ఫోలియో వినియోగం ఇలా..

టి-యాప్ ఫోలియో ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫాంపై లభిస్తున్నది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఇక ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాక ముందుగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ లేదా ఫేస్‌బుక్, జీ-మెయిల్‌లతో కూడా ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. దీంతో యూజర్ ఫోన్‌కు ఓ ఎంపిన్ ఓటీపీ రూపంలో వస్తుంది. దాన్ని యాప్‌లో ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. అనంతరం యాప్‌లో లభించే పలు సేవలను యూజర్లు పొందవచ్చు.



శుద్ధ జలాశయాన్ని ప్రారంభించిన మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి

సురక్షిత తాగునీరు లక్ష్యం

నూతనకల్, ప్రభన్యూస్: తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందుతుందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిలు బుధవారం మిషన్ భగీరథలో భాగంగా చిల్పకుంట్ల గ్రామంలో ఎన్‌ఆర్‌డిడబ్ల్యూపీ మిషన్ భగీరథ పథకం ద్వారా రూ. 143 కోట్లతో నిర్మించిన శుద్ధ జలాశయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శుద్ధ జలాశయాన్ని పరిశీలించి మంచినీటి సరఫరా చేస్తున్న విధానంపై రూపొందించిన డాక్టుమెంటరీని పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముందుగా మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.

శాసన సభ్యులు గాదరి కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ బూర నర్సయ్య గౌడ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ బాలు నాయక్, కలెక్టర్ సురేంద్రమోహన్, శాసన సభ్యులు వేముల వీరేశం, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ళ శేఖర్‌రెడ్డి, మాజీ శాసన సభ్యులు నోముల నర్సింహ్మయ్య, ఎంపీపీ కాసోజు సుమలతమధనచారి, జడ్పీటీసీ సభ్యులు గుగులోతు నర్సింగ్ నాయక్, చీఫ్ ఇంజనీర్లు సురేందర్‌రెడ్డి, విజయప్రకాష్, ఎస్‌ఈ మధుబాబు, శ్రీకాంత్, ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మోహన్‌రావు, తహసీల్దార్ అరుణజ్యోతి, ఎంపీడీవో ఫషియోద్దీన్, సర్పంచ్, ఉప సర్పంచ్ పులసరి లక్ష్మి, తోట్ల ప్రభాకర్ గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు తోట్ల పద్మఅచ్చయ్యగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్, సీఎం హోలీ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హోలీ పండగ సందర్భంగా గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, సీఎంకేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబం రంగుల ప్రపంచంలో తేలియాడాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రంగులు ఆనందోత్సాహాలకు సంకేతమని, పిల్లలు, పెద్దలు తేడాలేకుండా సంతోషంగా పండగ జరుపుకోవాలని కోరారు.



రాజ్‌భవన్‌లో పదవీ విరమణ పొందిన ఉద్యోగిని సన్మానించిన నరసింహన్

పదవీ విరమణ మరువలేని అనుభూతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీవితంలో అత్యధిక కాలం ప్రభుత్వరంగంలో సేవలందించి పదవీ విరమణ పొందే రోజు ఏ ఉద్యోగికైనా మరిచిపోలేని అనుభూతి మిగుల్చుతుందని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. అనేక మంది ప్రముఖులకు తన చేతి వంటల రుచి చూపించి మెప్పు పొందిన బట్లర్ మునికృష్ణ పదవీ విరమణ సందర్భంగా బుధవారం నరసింహన్ దంపతులు బుధవారం రాజ్‌భవన్‌లో ఆయన్ను సన్మానించారు. ఈ సందరన్బంగా మాట్లాడుతూ, గత 37 సంవత్సరాలుగా ఆరుగురు గవర్నర్‌లకు సేవలం దించడం, అందరి ఆదరాభిమానాలు చూరగొనడం అరుదైన విషయమని అన్నారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి హరిప్రీత్ సింగ్, సంయుక్త కార్యదర్శి అర్జున్‌రావు, ఉప కార్యదర్శి కృష్ణ మీడియా కార్యదర్శి గౌరీశంకర్‌లతో పాటు రాజ్‌భవన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31 దాకా ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్వీకరణ గడువుని మరో నెల పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్చి 31దాకా దరఖాస్తులు స్వీకరి స్తామని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సి పల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు ఇతర పట్టణ మున్సిపాలిటీలకు ఈ వెసులుబాటు వర్తిస్తోంది. పెండింగ్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు అనూహ్య స్పందన రావడం, భారీగా వస్తున్న దరఖాస్తు లకు సమయం చాలకపోవడంతో గడువును పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఎమ్మెల్యేలు.. ఎంపీలకు స్పెషల్ కోర్టు



(మొదటిపేజీ తరువాయి)

సత్వరం ఉత్తర్వులు వెలువరించేందుకు గానూ ప్రత్యేక కోర్టులు ఏర్పాటుకు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి హైకోర్టుతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆమోదాన్ని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదయ్యే కేసులు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండడం, కొన్ని కేసులైతే కోర్టుల్లో నంబరింగ్ కాకుండా విచారణ జాప్యం అవుతుండడంతో కోర్టుల్లో ఏళ్ల తరబడి పేరుకు పోతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వేతర సంస్థలు, సామాజిక సంస్థలు, ప్రగతి శీల శక్తులు కూడా ప్రజాప్రతినిధులపై విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు అవసరాన్ని డిమాండ్ చేశాయి. అధికారాలతో కూడిన లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాయి. సర్వోన్నత న్యాయస్థానం కూడా ఒక కేసులో ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటుపై తీర్పును వెలువరించింది. కేంద్రం కూడా స్పందించింది. రాష్ట్రా లకు లేఖలు రాసింది. ఏడాది క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమలు చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేస్తూ ఉమ్మడి హైకోర్టుకు లేఖ రాసింది. హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ఎమ్మెల్యేలు,ఎంపీలపై నమోదయ్యే క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఈ మేరకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు న్యాయశాఖ కార్యదర్శి వి నిరంజన్ రావు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సెషన్స్ జడ్జి స్థాయి న్యాయాధికారి ఈ ప్రత్యేక కోర్టులో ఎమ్మెల్యేలు, ఎంపీలపై దాఖలయ్యే క్రిమినల్ కేసులను విచారిస్తారు. అశ్వినీకుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుకు సంబంధించి 2017 డిసెంబర్ 14 న ఇచ్చిన తీర్పుతో పాటు కేంద్ర లా అండ్ జస్టిస్ శాఖ కార్యదర్శి లేఖ, రాష్ట్ర హైకోర్టుతో సంప్రదింపుల తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సంబంధించి సిబ్బంది, ఇతర ఖర్చులపై రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తుందని ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ఎక్కడైనా ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదయ్యే క్రిమినల్ కేసులు విచారణకు ప్రత్యేక కోర్టుకు పరిధిని నిర్ణయించారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటుపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రా నికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఇప్పటికే నమోదైన కేసులను ప్రత్యేక కోర్టుకు బదలీ చేస్తారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటుతో విచారణ వేగవంతంగా జరిగి కేసుల పరిష్కారం సత్వరం జరిగే అవకాశం ఉంది.

ఎవరెవరిపై....ఎక్కడెక్కడ...కేసులున్నాయి....

ఆరా తీస్తున్న పోలీస్ శాఖ

రాష్ట్రంలోని ఏఏ ఎమ్మెల్యే,ఎంపీలపై కేసులు నమోదయ్యాయి...ఎక్కడెక్కడ నమోదయ్యాయనే విషయమై పోలీస్ శాఖ ఆరా తీస్తోంది. ప్రభుత్వం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్న తర్వాత కేసుల విషయమై పోలీస్ ఉన్నతాధికారులు వివరాలు పంపించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా వివరాలు పంపాలని జిల్లా ఎస్పీలను ఆదేశాలు జారీ అయ్యాయి.

ఉగాదికి ఎమ్మెల్యేల కార్యాలయాల ప్రారంభం

తీవ్రవాద ప్రాంతాల అభివృద్ధికి రూ.136.47 కోట్లు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎమ్మెల్యేల కార్యాలయాలు, వసతి గృహాల ప్రారంభోత్సవాలు ఉగాది పండుగకు జరిగేలా నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోరహదారులు, భవనాల ప్రగతిపై బుధవారం ఎర్రమంజిల్‌లోని ఇంజినీర్ఇన్ చీఫ్ కార్యాలయంలో మంత్రి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఇంజినీర్ఇన్ చీఫ్‌లు నిరంజన్ రావు, గణపతిరెడ్డితో పాటు జిల్లా ఎస్ఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకంలో భాగంగా కేంద్రం తన వాటాగా రూ.547 కోట్లు కేటాయించగా, తొలి విడతగా కేంద్ర వాటాగా రూ.136. 47 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కేంద్రం కేటాయించిన నిధులతో 452 కిలోమీటర్ల పొడవు గల 20 రహదారులు, 18 వంతెనలను చేపడుతున్నట్లు చెప్పారు. కుమ్రం భీం, అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబా బాద్ నియోజకవర్గాల్లో ఈ పనులను చేపడుతున్నట్లు తుమ్మల పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యేల బహుళ అంతస్తుల గృహ సముదాయాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో జాప్యాన్ని సహించే ప్రసక్తిలేదని తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

'ఎక్సలెన్సీ' దరఖాస్తు గడువు పొడిగింపు

ఆంధ్రప్రభ, హైదరాబాద్ : తెలంగాణ ఎక్సలెన్సీ పురస్కారాల దరఖాస్తులకు గడువును పెంచుతూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 3వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తుల గడువును పొడిగిస్తున్నట్లుగా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. సివిల్ సర్వీసుల అధికారులు తమ బాధ్యతల నిర్వహణలో విభిన్న రంగాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఏటా ఈ అవార్డులను అందజేస్తోంది. అవార్డులకు టెక్సా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ అవార్డులను మూడు రంగాల్లో ఇవ్వనున్నారు. సాధారణ, నవకల్పనలు, ప్రాధాన్యతా పథకాలను ఇందుకు నిర్దేశించారు. ఈ క్రమంలో శిశు విద్య, పౌష్టికాహారం, పాలనలో సాంకేతికత, కేసీఆర్ కిట్స్, భూ రికార్డుల ఆధునీకరణ, సాలిడ్ వేస్ట్ డిస్పోజల్, గొర్రెల పంపిణీ వంటి వాటిని ఇందుకు కేటాయించారు.

'పరిశోధనలకు ప్రోత్సాహం'

హైదరాబాద్,ఆంధ్రప్రభ: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనల కోసం విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించనున్నట్లు అటవీ పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. బుధవారం బిర్లా సైన్స్ సెంటర్‌లో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో పరిశోధనలు దేశానికి ఎంతో అవసరమని మంత్రి తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులను ప్రోత్సహించాలని నిర్ణయించినట్టు మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులు చేసే పరిశోధనల్లో 8 ఉత్తమ పరిశోధనలను ఎంపిక చేయనున్నట్టు మంత్రి తెలిపారు. వాటిలో 4 గణితం, మరో 4 సైన్స్ పరిశోధనలు ఉంటాయన్నారు. ఒక్కో పరిశోధనకు రూ. 25వేల నగదు బహుమతులను ఇవ్వనున్నట్టు చెప్పారు. విద్యార్థులు పరిశోధనల్లో రాణించి శాస్త్రవేత్త సర్ సీవి రామన్ లాగా ఎదగాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు



టిఆర్ఎస్ నాయకుల ధర్నా

టీఆర్ఎస్ నిరసన..

ఏపి నీటి పారుదలశాఖ అధికారులు నీటి లెక్కలు పూర్తయినా కూడా తమకు నీటిని విడుదల చేయాలంటూ తెలంగాణ నీటి పారుదల అధికారులతో గొడవకు దిగడంతో బుధవారం వారు తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రం విడిపోయాక కూడా నీటి గొడవ సద్దుమణగలేదని తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమేష్‌జీ, సుదీర్, వీరయ్య, బ్రహ్మారెడ్డి, చాంద్‌పాష, మన్సూర్, శాంతికుమారి తదితరులు ఉన్నారు.

సాగర్ డ్యాంపై మళ్లీ జలరగడ

- తెలుగు రాష్ట్రాల నీటి అధికారుల మధ్య వాగ్వాదం
- నాగార్జున సాగర్ డ్యాంపై ఎస్‌పీఎఫ్ భారీ బందోబస్తు
- టీఆర్ఎస్ నాయకుల ధర్నా

నాగార్జునసాగర్, ప్రభన్యూస్ : నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం కంట్రోల్ రూం వద్ద నీటి విడుదల విషయమై... ఏపీ అధికారులు తెలంగాణ నీటి అధికారులతో వాగ్వాదానికి దిగారు. బుధవారం కుడి కాల్వకు విడుదలవుతున్న నీటిని నిలిపివేయడంతో రగడ మొదలైంది. గత అక్టోబర్ నుంచి వరుసగా నాలుగు నెలలపాటు ఏపీకి 60 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా రివర్‌బోర్డు ఆదేశాల మేరకు తెలంగాణ నీటిపారుదల అధికారులు నీటి విడుదల కొనసాగించారు. కాగా బుధవారం 62.5 టీఎంసీల నీటిని విడుదలైనట్లు తెలంగాణ నీటిపారుదల అధికారులు లెక్కలు చూపుతున్నారు. కాగా ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు తమకు రావల్సిన వాటాలో 0.23టీఎంసీల నీరు రావాలని, అది పూర్తి కాకుండానే నీటి విడుదల నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని బుధవారం ఉదయం నుంచి ఏపికి చెందిన నీటిపారుదల ఇంజనీర్లు డిఈ వెంకటేశ్వర్‌రావు, ఈఈ సత్యనారాయణ, తెలంగాణ నీటి పారుదలశాఖ ఈఈ వెంకట్‌రెడ్డి, డిఈ విజయ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో తెలంగాణకు చెందిన ఈఈ వెంకట్‌రెడ్డి, తమకు కృష్ణారివర్‌బోర్డు ఉత్తర్వుల ప్రకారం 60 టీఎంసీల నీటిని ఏపికి విడుదల చేయాలని ఉందని, అందుకు గాను ఇప్పుడు 62.5టీఎంసీల నీరు విడుదలైనట్లు రికార్డులో ఉందని దాని నిమిత్తం నీటి విడుదల నిలిపివేసినట్లు తెలిపారు. అందుకు గాను ఏపి ఇరిగేషన్‌శాఖ అధికారులు అలా కాదు మాకు రావల్సిన నీటిలో 0.23టీఎంసీల నీరు ఇంకా మిగిలి ఉందని అది వదిలేదాక ఊరుకోమని తెలంగాణ ఇంజనీర్లతో గొడవకు దిగారు. సాయంత్రం 7గంటల వరకు చర్చ జరుగుతూనే ఉంది. అయితే తెలంగాణ నీటి పారుదలశాఖ అధికారులు సాగర్ సిఈ సునీల్‌కు ఫోన్‌చేసి విషయం తెలపగా ఆయన ఏపి అధికారులతో మాట్లాడారు. తమకు రావల్సిన వాటా పూర్తి అయ్యిందని దాంతో నీటిని నిలిపివేశామని ఏపి నీటిపారుదల అధికారులతో తెలిపారు. ఏవైనా ఉంటే కృష్ణారివర్‌బోర్డు ఉత్తర్వులు ఉంటే అప్పుడు నీటిని విడుదల చేస్తామని మాకు ఉత్తర్వులు లేకుండా నీటిని విడుదల చేయడం తగదని తెలిపారు. అలాగే ఎడమ కాల్వకు రబీ సీజన్‌కు గాను 50టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 35టీఎంసీలు విడుదల చేశామని సీఈ తెలిపారు.

ఎస్‌పిఎఫ్ భారీ బందోబస్తు..

నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంపై బుధవారం ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖ అధికారులు వాగ్వాదానికి దిగడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాగర్ ఎస్‌పిఎఫ్ ఆర్ఐ అప్పాజి ఆధ్వర్యంలో డ్యాంపై ఎస్‌పిఎఫ్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి గొడవలు కాని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారు డ్యాంపై భద్రత నిర్వహించారు.

బోర్డు ఆదేశాల మేరకే నీటి విడుదలకు బ్రేక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణాజలాల వాడకానికి సంబంధించి కెఆర్ఎంబి లెక్కతేల్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి కేటాయింపులు, వాడకం వివరాలు వివరిస్తూ కెఆర్ఎంబి సభ్యకార్యదర్శి పరమేష్ మంగళవారం లేఖ రాశారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటికోటాను పూర్తిగా వినియోగించుకుందని.. బోర్డు తెలిపింది. నాగార్జున సాగర్‌లో 21.461, శ్రీశైలంలో 14.71టిఎంసిలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. గతంలో కుదుర్చుకున్న అంగీకారం ప్రకారం ఎపి ఇప్పటికే తనకు కేటాయించిన నీటికన్నా 2.32 టిఎంసిలు అధికంగా వాడుకుందని, తక్షణమే నీటివిడుదల నిలిపివేయాలని బోర్డు సూచించింది. రెండు రాష్ట్రాలు కూర్చుని చర్చించుకున్నాక.. తర్వాత కేటాయింపులు నిర్ణయి ద్దామని, ప్రస్తుతం ఉన్న నీటిని ఆగస్టువరకు తాగునీటి అవస రాలకు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

హంద్రీనీవాలో దోపిడీ..

ఓవైపు కెఆర్ఎంబి ఆదేశాలు తమకు సంబంధం లేదంటూ వాదనకు దిగిన ఎపి అధికారులు హంద్రీనీవాలో నాలుగుమోటార్లు నడుపుతూనే ఉన్నారని, పోతిరెడ్డిపాడుకు కూడా అక్రమంగా నీరు తీసుకెళ్తున్నదని తెలంగాణ అధికారులు ఆరోపిస్తున్నారు.

FORM IV
(See Rule 8)

1. Place of Publication	:	Hyderabad, Vijayawada, Guntur, Rajahmundry, Visakhapatnam, Tirupati, Karimnagar, Kurnool, Suryapet, Anantapur, Nellore, Nizamabad
2. Periodicity of its publication	:	Daily
3. Printer's Name	:	MOOTHA GOUTAM
Whether Citizen of India:		Yes
(If foreigner, state the country of origin)	:	-
Address	:	8-2-293/82/A/75, Plot No.75, Road No. 9, Jubilee Hills, Hyderabad- 500 033.
4. Publisher's Name	:	MOOTHA GOUTAM
Whether Citizen of India:		Yes
Address	:	8-2-293/82/A/75, Plot No.75, Road No. 9, Jubilee Hills, Hyderabad- 500 033.
5. Editor	:	Y S R SARMA
Whether Citizen of India:		Yes
(If foreigner, state the country of origin)	:	-
Address	:	8-2-293/82/A/75, Plot No.75, Road No. 9, Jubilee Hills, Hyderabad- 500 033.
6. Name & Address of individuals who own the newspaper and partners or Shareholders holding morethan one percent of the total capital	:	Andhra Prabha Publications Limited, M.Gopala Krishna, M.V.Sasidhar, M.Naveen Krishna, M.Goutam, M.Sunitha Devi, EMGEEK Logistics Pvt.Ltd., Cosy World Resorts Ltd.,

I, Mootha Goutam hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
MOOTHA GOUTAM
Publisher

March 1st 2018

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 1 మార్చి 2018

కార్తీ అరెస్టు ప్రతీకారమేనా?

మాజీ కేంద్ర మంత్రి,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తీని పదకొండేళ్ళ క్రితం నాటి ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐ ఆర్థిక నేరాల నిరోధక విభాగం అధికారులు అరెస్టు చేయడం రాజకీయవర్గాల్లో ప్రకంపనాలను సృష్టించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు బురిడీ కొట్టించిన నీరవ్ మోడీ కేసుపై చాలా రోజులకు పెదవి విప్పిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆర్థికనేరాలకు పాల్పడిన వారు ఎంతవారైనా కఠిన చర్యలకు వెనకాడబోమంటూ హెచ్చరించడంతో నీరవ్‌ని అరెస్టు చేస్తారేమోనని అంతా అనుకున్నారు. పాత కేసులో కార్తీని ఇప్పుడు అరెస్టు చేయడం ఆశ్చర్యం కలిగించింది. కార్తీ తండ్రి చిదంబరం యూపీఏ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించినప్పుడు పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ద్వారా ఐదు కోట్ల రూపాయిల పరిమితికి అనుమతి పొంది 350 కోట్ల మేరకు మనీ ల్యాండరింగ్‌కి పాల్పడ్డారన్నది కార్తీపై సీబీఐ అభియోగం. ఈ కేసుకు సంబంధించి కార్తీ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్ భాస్కర్ రామన్‌ని ఇప్పటికే అరెస్టు చేసి ఢిల్లీ కోర్టులో హాజరు పర్చగా, 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ కోర్టు విధించింది. ఆయన బెయిల్ కోసం పెట్టుకున్న పిటిషన్‌ని రేపు ఢిల్లీ హైకోర్టు విచారించనుంది. ఆర్థిక నేరాల కేసులు పరిష్కారమయ్యేసరికి ఏళ్ళూ,పూళ్ళూ పడుతుండటం వల్లనే నేరస్థులు కోర్టుల ద్వారా బెయిల్ సంపాదించుకుని ఆధారాలను మాయం చేస్తున్నారన్న ఆరోపణల్లో అసత్యం లేకపోవచ్చు. కార్తీ లండన్ పర్యటనలో ఐఎన్ఎక్స్ మాక్స్ కేసు ఆధారాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. కేంద్ర దర్యాప్తు సంస్థను రాజకీయ ప్రత్యర్థులపై యూపీఏ ప్రభుత్వం పురికొల్పుతోందంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపించిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను చేస్తున్నదీ అదేనన్న అపవాదును ఎదుర్కొంటోంది. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలను పక్కన పెట్టి, కార్తీ కేసు గురించి పరిశీలిస్తే, ఆయనపై అభియోగాలు ఏనాడో నమోదు అయ్యాయి. లండన్ నుంచి తిరిగి రాగానే, ఇంటికి కూడా వెళ్ళనివ్వకుండానే చెన్నై విమానాశ్రయంలో సీబీఐ అధికారులు అరెస్టు చేయడం వెనుక రాజకీయ ఒత్తిడులు ఉన్నాయన్న ఆరోపణ నిరాధారం కాదేమో! కార్తీ తల్లితండ్రులు ఇద్దరూ పేరొందిన న్యాయవాదులు. తండ్రి చిదంబరం పూర్వపు ప్రభుత్వంలో ఆర్థిక, హోం శాఖలను నిర్వహించిన సీనియర్ నాయకుడు. కార్తీకి ఇంతవరకూ వెసులు బాటు కల్పిస్తూ వచ్చిన సీబీఐ ఇప్పుడే ఎందుకింత అత్యవసరంగా ఆయనను అరెస్టు చేయాల్సి వచ్చిందని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు విచారణకు ఆయన సహకరించడం లేదనీ, అందుకే, కేసు దర్యాప్తు పూర్తికావడం లేదని సీబీఐ అధికారులు పేర్కొంటున్నారు. పాత కేసుల విషయంలో ఇంత శ్రద్ధ చూపుతున్న సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) వంటి దర్యాప్తు సంస్థలు తాజాగా వెలుగు చూసిన కుంభకోణాల దర్యాప్తు వేగాన్ని ఎందుకు పెంచడం లేదన్న సందేహాలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో యూపీఏ ప్రభుత్వం గతంలో అనుసరించిన మార్గాన్నే ఇప్పుడు ఎన్‌డిఏ అనుసరిస్తోంది. చిదంబరం గతంలో హోం మంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లో సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో ప్రస్తుత బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాని అరెస్టు చేసి జైల్లో ఉంచినందుకు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంటున్నారన్నది కార్తీ మద్దతుదారుల ఆరోపణ. ఆర్థిక నేరాలను అరికట్టేందుకు, ఇలాంటి కేసుల విచారణ సత్వరమే ముగించేందుకూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరిస్తే అనుమానాలకు ఆస్కారం ఉండదు. సీబీఐ తననూ, తన కుటుంబాన్నీ బద్నామ్ చేస్తోందంటూ మాజీ మంత్రి చిదంబరం కొద్ది రోజుల క్రితం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన హక్కులకు భంగం కలిగిస్తోందంటూ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆ పిటిషన్‌ని కోర్టు విచారణకు స్వీకరించింది. ఇంతలోనే కార్తీని అరెస్టు చేయడం వల్ల కాంగ్రెస్ నాయకులు దీనిని రాజకీయ కక్షగానే భావిస్తున్నారు. నీరవ్ మోడీ, కొఠారీ, ద్వారకానాథ్ సేథ్ వంటి తాజా ఆర్థిక నిందితులపై విచారణ విషయంలో ఈడీ కానీ, సీబీఐ కానీ ఇంతే వేగంతో పని చేయకపోవడం వల్లనే ఆరోపణలు వస్తున్నాయి. దేశంలో ప్రధాన కుంభకోణాలన్నీ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనే చోటు చేసుకున్నాయన్న వాస్తవాన్ని ఎవరూ కాదనరు. తాజా కుంభకోణాల నుంచి జనం దృష్టిని మళ్ళించడానికే పాత కుంభకోణాలను ప్రభుత్వం పదే పదే గుర్తు చేస్తోందన్న అభిప్రాయం బలపడుతోంది. నల్లకుబేరులపైనా, ఆర్థిక నేరస్థులపైనా ఉక్కుపాదాన్ని మోపేందుకు ప్రధాని మోడీకి ఇప్పుడు అడ్డంకులేమీ లేవు, యూపీఏ హయాంలో మాదిరి సంకీర్ణ కూటమి భాగస్వాముల నుంచి ఒత్తిడులు ఏమీ లేవు. ఒక వేళ ఉన్నా మోడీని అడ్డుకునే వారు ఎవరూ లేరు. కుంభకోణాలపైనా, ఆర్థిక నేరాలపైనా రాజకీయాలకు అతీతంగా, నిష్పాక్షికమైన దర్యాప్తు జరిగి నిందితులెవరో నిగ్గు తేల్చాలనే ప్రజలు కోరుకుంటున్నారు.

మాధవ సేవకు నిర్వచనం కంచి స్వామి!

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి పుట్టింది తమిళనాడులోని తంజావూరు జిల్లాలో అయినా, తెలుగువారికి అత్యంత గౌరవభాజనుడు. తెలుగు రాష్ట్రాల్లో ఊరూరా తిరిగి తమ పీఠం నిర్వహించే కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించేవారు. కంచి పరమాచార్యను నడిచే దేవునిగా పరిగణించి ఆయన ఎక్కడికి వెళ్ళినా పాదపూజలు నిర్వహించేవారు. ఆయనతో పాటు తెలుగునాట అన్ని పట్టణాలు, గ్రామాల్లో పర్యటించడం ద్వారా జయేంద్ర సరస్వతి తెలుగువారికి పరమపూజ్యుడయ్యారు. కంచి పీఠాన్ని ప్రజలకు చేరువగా తీసుకుని వెళ్ళడంలో ఆయన కృషి అమోఘం. జయేంద్ర సరస్వతి ఎక్కడికి వెళ్ళినా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే వారు. కంచి పీఠం ఆధ్వర్యంలో అంతకుముందే సామాజిక, విద్యా వికాస కార్యక్రమాలు ప్రాచుర్యం పొందినా, వాటిని మరింతగా ద్విగుణీకృతం చేయడంలో జయేంద్ర సరస్వతి పాత్ర ఎన్నదగింది. ఆయన పీఠాధిపత్యంలో తెలుగు రాష్ట్రాల్లో అనేక దేవాలయాలు కంచి పీఠం పాలనలోకి వచ్చాయి. ఆలనా,పాలనా లేని అనేక దేవాలయాల జీర్ణోద్ధరణకు ఆయన ఉమ్మడి రాష్ట్రంలోనూ, తర్వాతా ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళ్ళి సహాయం అందేట్టు చేశారు. జయేంద్ర సరస్వతి ఆది శంకరుల అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేసినప్పటికీ, శివాయ, విష్ణురూపాయ అనే సంధ్యావందన శ్లోకాన్ని తుచ తప్పకుండా అమలు చేశారు. ఆయన విభూది ధారణ చేసినప్పటికీ, ఆయన నోట ఎప్పుడూ నారాయణ మంత్రం వినిపించేది. కంచి కామాక్షి అమ్మవారి ఆలయాలు తెలుగునాట వెలిసేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. తంజావూరు జిల్లాలోని ఇరుల్ నీకీ అనే గ్రామంలో జన్మించిన ఆయన 18వ ఏటనే సన్యాసాశ్రమం స్వీకరించి ఉత్తర మఠాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. పరమాచార్యగా ప్రసిద్ధులైన చంద్రశేఖర సరస్వతి హయాంలో పెద్దస్వామి పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేవారు. జయేంద్ర సరస్వతి కంచిపీఠానికి చెందిన సేవా కార్యక్రమాలను పర్యవేక్షించేవారు. కంచి పీఠం ఊరూరా నేత్ర చికిత్సా శిబిరాలను నిర్వహించడంలలో ఆయన పాత్ర ఎంతో ఉంది. శంకర్ నేత్రాలయ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. సంస్కృతాంధ్ర భాషల బోధనకే కాకుండా, ఆయన టైపురైటింగ్, కంప్యూటర్ ట్రయినింగ్ వంటి సంస్థలను కంచి పీఠం ద్వారా ఏర్పాటు చేయించారు. సమాజ సేవలో కంచిపీఠం ముందంజ వేయడానికి ఆయన ఎన్నో చర్యలు తీసుకున్నారు. అన్నింటికీ మించి ఆయన హిందూ ధర్మ ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కంచి పీఠం ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షణ సభలు ఎన్నో జరిగాయి. కామకోటి పీఠం కార్యక్రమాలు కేవలం తెలుగు రాష్ట్రాలకే కాకుండా, దక్షిణాదిన ముఖ్యంగా, తమిళనాడు, కర్నాటకలలో విస్తృతంగా సాగడానికి ఆయన ప్రధానంగా కృషి చేశారు. ఉత్తరాదిన తరచు రుషీకేశ్, కేదార్‌నాథ్ వంటి పుణ్య క్షేత్రాలు సందర్శించేవారు.

అయోధ్య కోసం కృషి: అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అయోధ్యలో రామాలయం నిర్మాణ వివాద పరిష్కారానికి ఇరువర్గాలతో చర్చించిన హైందవ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి. ఆయన నిర్వహించిన చర్చల్లో పలువురు ముస్లిం తెగల నాయకులు కూడా పాల్గొని తమ



ప్రతిపాదనలను అందజేశారు. అద్వైత ధర్మ ప్రచారకుడైన జయేంద్ర సరస్వతి తనకు శివకేశవ భేదం లేదని నిరూపించుకున్నారనడానికి ఇది చక్కని ఉదాహరణ. బడుగువర్గాలు నిర్వహించే కాలనీల్లో ఆలయాల నిర్మాణం కోసం ఆయన ఎంతో కృషి చేశారు. హైందవ ధర్మం అనేది ఒక జీవన విధానమని చాటి చెప్పిన వారిలో ఆయన అగ్రగణ్యులు. విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన తన ఆశీస్సులను అందజేయడమే కాకుండా, అనేక సభలూ, సమావేశాల్లో పాల్గొన్నారు. భారత దేశ ప్రతిష్ఠను నిలిపేది హిందూ ధర్మమేనని ఆయన త్రికరణ శుద్ధిగా నమ్మి, దాని ప్రచారానికి అవిరళ కృషి చేశారు. ధర్మ ప్రచారానికి సేవా ధర్మాన్ని జోడించాలని ఆయన తరచూ అనేవారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ఆయన ఆచరణలో చూపారు. నిరుపేదలను మహాత్మాగాంధీ దరిద్ర నారాయణులనేవారు. అదే మాదిరిగా జయేంద్ర సరస్వతి ప్రతి మనిషిలో నారాయణుని చూడాలనీ, మనుషుల మధ్య వివక్షపనికి రాదని విస్తృతంగా ప్రచారం చేశారు.

ఆయన బోధలూ, కార్యక్రమాలు సంఘ పరివార్‌కి పోలి ఉండటం వల్ల ఆయన సంఘ పరివార్ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పటికీ, ఆయన లెక్కచేయలేదు. హిందూ ధర్మం సనాతనమైనదనీ, కొత్తగా ఎవరో ప్రచారం చేస్తే ఆచరణలోకి వచ్చింది కాదని ఆయన అనే వారు.మన పూర్వీకుల కాలం నుంచి అనుసరిస్తున్న సంప్రదాయాలు, నియమాలు హిందూ ధర్మంలో భాగమనీ, ఈ దేశంలో పుట్టిన వారందరూ విధిగా ఆచరించవల్సిన ధర్మమని ఆయన అనేవారు. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తిని మనసా, వాచా, కర్మణా అమలులో పెట్టిన జయేంద్ర సరస్వతి ఒక దశలో కామకోటి పీఠాన్ని వదిలి వెళ్ళిపోయారనే వార్తలు వచ్చాయి. దానికి ఆయన సమాధానమిస్తూ, సామాన్యుల హృదయాల్లోకి దైవాన్ని ప్రవేశింపజేసే కృషిలో భాగంగానే తాను కొంత కాలం పాటు పీఠానికి దూరంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. తనపై ఎన్ని వదంతులు వచ్చినా, ఎన్ని ఆరోపణలు వచ్చినా ఆయన లెక్క చేయలేదు. తాను అనుకున్న కార్యక్రమాలనూ, ధర్మాన్ని ఆయన ఆచరించి చూపారు. అందుకే, కంచి పీఠాన్ని ప్రజలకు చేరువగా తీసుకుని వెళ్ళిన స్వామిగా ఆయన గణుతికెక్కారు.

కంచి పీఠం 69వ పీఠాధిపతిగా ఆయన అందించిన సేవలు అజరామరమైనవి. కంచిలో అన్ని మతాల వారూ, అన్ని విశ్వాసాల వారూ సహజీవనం సాగించడానికి పరమాచార్య వారు బాట వేస్తే,దానిని మరింత అభివృద్ధి పరచిన స్వామిగా జయేంద్రులు ప్రసిద్ధులు. హిందూ ధర్మానికి కట్టుబడిన ఒక పీఠాధిపతి అయోధ్య సమస్యపై నిర్వహించిన చర్చలకు ముస్లిం మత పెద్దలు హాజరు కావడం గొప్ప విశేషమే. జయేంద్ర సరస్వతి లౌకిక భావస్ఫూర్తి కారణంగానే అది సాధ్యమైంది. కంచి పీఠంఆధ్వర్యంలో ఆయన నిర్వహించిన నేత్ర చికిత్సా శిబిరాల్లో అన్ని మతాల వారూ చికిత్సలు పొందారు. మానవుణ్ణి మహనీయునిగా చేయడమే మతం పరమార్థమని చాటి చెప్పిన జయేంద్ర సరస్వతి హిందూ ధర్మ ప్రచారకులందరికీ దిక్సూచి వంటి వారు.

-ఎ.పి. స్వామి

స్వామి మార్గదర్శనానికి వెళ్ళారు

పారిజాతం అనగానే స్వర్గలోక పుష్పమనీ, పరమపవిత్రమనీ, మల్లెపూవంటే పరమ సుగంధ భరితమనీ ఎవరికీ ఎలా ప్రత్యేకించి చెప్పనవసరం లేదో, అలా కంచికామకోటి పీఠం గురించి ఎవరికీ చెప్పనవసరం లేదు. అనాది నుండీ శిష్టతకీ సంప్రదాయ పరిరక్షణకీ భాగవతులకీ భగవంతునికీ అనుసంధాన విధానానికీ అలౌకికమంత్ర ఉపన్యాస విధానానికీ పెట్టింది పేరూ - వెళ్లూనుకున్న వేరూ కంచి కామకోటి పీఠం.

నడిచే దైవమైన శ్రీశ్రీశ్రీ పరమపూజ శ్రీమచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వాముల వారి చేత ఎంపిక కాబడడమంటే అది అసామాన్య విశేషం. అలా నిర్ణయింపబడిన శ్రీశ్రీశ్రీ జయేంద్ర స్వాములవారిని గూర్చి ప్రత్యక్ష పరిచయంలోని ఒక ట్రెండు అంశాలని మనవి చేస్తాను.

ఒకసారి శ్రీశ్రీశ్రీ జయేంద్ర స్వాములవారు నాతో మాట్లాడుతూ- ఎందుకో చెప్పలేనంత ఆందోళనగా ఉంది. శైవ వైష్ణవ భేదం ఉండనే కూడదంటూ నుదుటిమీద తీర్యక్పుండ్రం (అడ్డనామాలు) నోట నారాయణ నామం చేత శారదామాత పూజ శాక్తేయం గానూ చేస్తున్న శైవుల్లో పెద్దలకే వైష్ణవుల్లో పెద్దలకీ రాని లేని అంతరం వీరి - వారి భక్తుల్లో కొంత కన్పిస్తూ చెప్పలేని బాధగా ఉంది. మీ ప్రవచనాల్లో వివరంగా చెప్తూ ఉండండి - ఇవీ వారి మాటలు. కొద్దిగా దృష్టి పరికించి చూస్తే నిజమేననిపించి ఆ ధోరణికి తగినట్లు మాట్లాడుతూ నా కృతజ్ఞతలని సమర్పించుకున్నాను - వారి మాటని శిరసా వహించగలిగానని. మరోసారి గుంటూరులో దేవాలయ ప్రతిష్ఠకి వచ్చినపుడు - ప్రమాణాల్లేని ప్రసంగాలతో కొందరు భక్తుల్ని అయోమయానికి గురిచేస్తూ సంప్రదాయం నుండి పారిపోయేలా చేస్తున్నారు.

ఈ భక్తులు కూడా సులభంగా మోక్షం లభించే విధంగా ఏది సరైన మార్గమంటూ దోవలు వెదుక్కుంటున్నారు. ప్రామాణికంగా ఉండేలా ఆయా ప్రవచనకర్తలకి చెప్పేమార్గం ఏదీ లేదా? అన్నారు. అది తమ ప్రసంగాల వల్లే సాధ్యమనగానే ఆ రోజున అదే విషయం గురించి మాట్లాడారు.

ఇంకొకసారి కంభంపాటి వారు స్వామిని స్వాగతించినపుడు ఏ ప్రశ్ననైనా అడగండి అన్నారు. దండ కమండలాలని విడిచి తాము వెళ్లిపోవడం... అని ఆనగానే ఆయనే దీర్ఘాలోచనలోకి వెళ్లి - పెద్దస్వాములవారిది దైవాలోచన. దైవం ద్వారా మానవసేవ జరుగుతుందనేది.

కొద్ది లౌకికుణ్ణి కాబట్టి మానవసేవ ద్వారా దైవాన్ని ఇక్కడి జనహృదయాల్లోకి ప్రవేశింపచేయాలనేది నా ఆలోచన. అందుకే కృష్ణానదీ తటానికి సమస్యకి సమాధానం కోసం తపస్సుకి వెళ్తే ఎవరెవరో ఏమేమో రాశారు- అని చిరునవ్వు నవ్వారు.

మరొకప్పుడు తిరుపతి సభలో తమకి తామే మాట్లాడుతూ - పెద్దస్వాముల వారికి మానసిక క్షోభ కలిగిందిగా! పర్యవసానం కారాగారం. ఆ మేజిస్ట్రేటుకి మ॥ 12 లోగా తీర్పునియ్యండి - మంచి కాలం అని కోరితే నామీద ఈశ్వరానుగ్రహం లేదు కాబోలు. మ.12 తర్వాతే తీర్పునిస్తూ కారాగారం అన్నారు.

ఇదంతా ఈశ్వరేచ్ఛ. ఈశ్వర విలాసం - ఈశ్వరకృప. అని ఆనందంగా నవ్వారు.

దుఃఖేష్వనుద్విగ్న మనాః
సుఖేషు విగతస్పృహః!

అన్నట్లు కారాగారంలో ఉండే సమయంలో కూడా దుఃఖం లేదు సరికదా శివార్చనని మానలేదు.

పెద్ద స్వామివారు ప్రశంసించిన సందర్భంలో అహంకరించనూలేదు. ఇలా సుఖదుఃఖాల్లో సమానస్థితిలో ఉన్న శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వాములవారు శివైక్యాన్ని చెందారంటే తెలియని వారు అయ్యో అనుకుంటున్నారు. వేదాంతులూ దేశికులూ... మనని సరైన తోవని నడిపించడానికి ఈ లోకం సరికాదు. ఆ లోకం నుండి మార్గదర్శనం చేయ వెళ్లారని భావిస్తున్నారు.

నారాయణ! నారాయణ!



డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

రుణ ఎగవేతలకు పరిష్కారమేదీ...

ఒకప్పుడు ధనికులకే పరిమితమైన బ్యాంకులు, జాతీయాకరణ అనంతరం అందరికీ చేరువైనప్పటికీ నేటికీ అనేకమందికి దూరంగానే ఉన్నాయి. అందరికీ బ్యాంక్ సదుపాయం కల్పించి ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సహాయం, ప్రభుత్వ సబ్సిడీలు నేరుగా లబ్ధిదారులకు చేరాలన్నా, ప్రతివ్యక్తి జరిపే లావాదేవీలు, క్రయవిక్రయాలు, ఆస్తిపాస్తులపై అంచనాకు రావాలన్నా (ఆదాయపన్ను విధింపుకై) తప్పనిసరిగా బ్యాంక్ ఖాతా అవసరం. దీనిని గమనించిన కేంద్రం ప్రతీ ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలని "జన్ ధన్ యోజన పథకం" ద్వారా కోట్ల కొద్దీ కొత్త ఖాతాలను సైతం ప్రారంభింపజేసింది. అందులో చాలావరకు క్రియాశీల రహితంగా ఉండటమన్నది సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితిని కళ్లకు కడుతోంది. మరొకవైపు సామాన్య ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, సులభ విధానం, రక్షణ ఉంటుందని బ్యాంకులవైపు మరలుతుండగా, మధ్యతరగతి వర్గం సైతం ఆర్థిక లావాదేవీలు, ఏటీఎం సదుపాయానికి అలవాటుపడడం, పెరిగిన ఆన్లైన్ లావాదేవీలు, తప్పనిసరి బ్యాంకు ఖాతా చెల్లింపులతో ఈ మధ్య కాలంలో అందరికీ బ్యాంక్‌లతో వ్యవహారం విపరీతంగా పెరిగిపోయింది. అదే సమయంలో బ్యాంకులు పెరుగుతున్న ఖాతాదారుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని పనిభారం పెరిగిందన్న సాకులతో కనీస నిల్వల పేరిట, అంతర్ శాఖ లావాదేవీలపై నియంత్రణ, రుసుం వసూలు, లావాదేవీల్లో సబ్దతపై, ఖాతా నిర్వహణ వ్యయం రూపేణాతో పాటు ఇతర వివిధ సాకులతో ఖాతాదారులకు బ్యాంకులు చుక్కలు చూపెడుతున్నాయి. మన దేశంలో అతిపెద్ద జాతీయ బ్యాంకు అయిన ఎస్.బీ.ఐ ఒక్కటే కనీస నిల్వ లేని ఖాతాలపై చర్యగా సుమారు 1700 కోట్ల రూపాయల మేర వసూలు చేసిందంటే సామాన్య ఖాతాదారుల జేబులో సొమ్ము ఎలా మాయమవుతున్నదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సామాన్యుడి ముక్కుపిండి వసూలు చేస్తున్న ఇవే బ్యాంకులు వారికి రుణాలు కావాలంటే అస్సలు నమ్మవు. వేల కోట్లు నట్టేట ముంచే వారిని నమ్మి డబ్బులు ఇచ్చి వారి దివాళానంతరం సామాన్యులపై చార్జీలు మేసి వసూలు చేసి నష్టం పూడ్చుకోవాలనుకోవడం, లేకపోతే ప్రభుత్వాన్ని మూలధనం రూపేణా సాయం అడగటం లాంటివి తిరిగి సామాన్యుల నెత్తిపై పన్నుల పెంపు ద్వారా ప్రభుత్వం పిడుగు పడేయడం రివాజుగా మారింది. ఒకవైపు విజయ్ మాల్యా అంశం మరుగున పడకముందే తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ వ్యవహారం తెరమీదకొచ్చింది. ఒకవైపు కుంభకోణాలు, మరొకవైపు నిరర్థక ఆస్తుల చిట్టా పెరిగిపోవడం, ఉద్దేశపూర్వక ఎగవేతలు, బ్యాంకుల్లో అవకతవకలు భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నది. "కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా" వ్యవహరిస్తున్న బ్యాంకుల తీరు దారుణం. అందరికీ బ్యాంకు సౌకర్యం చేరువచేసి, లీకేజీలు తగ్గేలా, ఆదాయ పన్ను రాబడి పెంచేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి పెద్దలకు రాజమార్గాన దోచిపెడుతూ, పేదలను దొడ్డిదారిన దోచుకుంటూ, వ్యవస్థను భ్రష్టు పట్టించే వారికే రాచమర్యాదలు చేసే బ్యాంకుల వ్యవహారశైలి ఇకనైనా మార్చుకోవాలి. ఒక సాధారణ రైతు, విద్యార్థి మరియు స్వయం ఉపాధి కాంక్షించే వారెవరైనా బ్యాంకు నుంచి ఆర్థిక సహాయం పొందాలంటే సకల కారణాలు, నియమనిబంధనలు చూపుతూ వారిని ఆ విషయమే మరిచిపోయేలా చేయగల బ్యాంకులను అదే ఎగవేతదారులు మాత్రం నిమిషాలలో నమ్మించి, గంటల్లో కాగితపు పనులు పూర్తిచేసేలా ఒత్తిడి తెచ్చి, రోజుల్లోనే లోన్లు మంజూరు చేయించుకోగలగటం మన వ్యవస్థలోని లోపాన్ని ఎత్తి చూపుతున్నది. ప్రభుత్వాలు రైతులకు రుణాలు, సబ్సిడీ, వడ్డీ మాఫీ వంటివి చేసినా సహకరించని బ్యాంకింగ్ వ్యవస్థ వీరికేమో మొత్తం పద్దులనే రద్దు చేయటం (వసూలు కాని మొండిబకాయి పద్దుకింద)శోచనీయం. ఇప్పటికైనా బ్యాంకులు తమ వైఖరిని మార్చుకోవడమే కాక పేదవారి కాసింత పొదుపును ఎలా దోచుకోవాలో ఆలోచనలు మాని, బడా నాయకుల, పారిశ్రామికవేత్తల రుణాల ఎగవేతలకు పరిష్కార మార్గాలు కనుగొనాలి. కేంద్ర ప్రభుత్వం సైతం ఎగవేతదారులను కట్టడి చేసేందుకు కఠిన చట్టం రూపకల్పనకై తక్షణం పూనుకోవాలి. వారి ఆస్తిపాస్తులను తక్షణమే జప్తు చేసుకునేలా చట్టాన్ని రూపొందించాలి. ప్రస్తుత చట్టాలలోని లొసుగులను వాడుకొని వారు చేస్తున్న అక్రమ వ్యవహారాలకు ఇకనైనా ముగింపు పలక్కపోతే సామాన్యులు బ్యాంకులపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. అది మన దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టదాయకం.

-వినోద్‌కుమార్ సుద్దాల

రైతుల పొట్ట కొడుతున్న దళారులు!

ప్రైవేట్ మార్కెట్‌లు రైతులకు గిట్టుబాటు ధరల భరోసా ఇస్తాయని ఆశించడం అత్యాశే. 94 శాతం పంటల క్రయ విక్రయాలు ప్రైవేటు మార్కెట్‌ల ద్వారానే జరిగే బీహార్‌లో రైతులకు న్యాయమైన ధరలు లభించడం లేదంటున్నారు. దేశంలో ప్రస్తుతం 7,320 మండీలు ఉన్నా అవి పండ్లు, కూరగాయల వ్యాపార అవసరాలను తీర్చలేకపోతున్నాయి. దేశమంతటా 45,000 నియంత్రిత మార్కెట్లను ఏర్పరిస్తే కానీ రైతులు, వినియోగదారులకు లబ్ధి చేకూరదు. మార్కెటింగ్ కమిటీ పదవులను నిర్వహించే రాజకీయ నాయకులు పాలక పార్టీకే తప్ప రైతులకు విధేయులుగా ఉండరు. రైతు ప్రయోజనాలకు కాకుండా బహుళజాతి కంపెనీల లాభాలకు పెద్దపీట వేయడానికే ఏపీఎంసీ చట్టాన్ని సవరిస్తున్నారు. ఒకే మార్కెట్ ఒకే ధర సూత్రం కంపెనీలకు తప్ప రైతులకు లాభించదు, చివరకు వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తుంది. నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ల సంస్కరణకు పూనుకోవడం ప్రశంసనీయం. వ్యవసాయ సరకులకు ఉమ్మడి జాతీయ విపణిని సృష్టించడానికి వివిధ మార్గాల్లో ప్రయత్నించాలని మోడీ ప్రభుత్వం నిశ్చయించింది. తదనుగుణంగా ఎలక్ట్రానిక్ జాతీయ వ్యవసాయ విపణి వేదిక (ఇనామ్)ను ఏర్పరచడంతో పాటు సరికొత్త వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎమ్‌సీ) నమూనా చట్టాన్ని సిఫార్సు చేసింది. ఈ రెండు చర్యలు పూర్తిస్థాయిలో అమలైతే వ్యవసాయ సరకులను నిరాటంకంగా నిక్షేపంగా అమ్ముకోవడానికి, కొనడానికి అనువుగా ఓ జాతీయ విపణి ఏర్పడుతుంది. ఈ విపణిలో వ్యాపారులు ముఠాకట్టి ధరలను తగ్గించేయడం కుదరదు. ఉత్పత్తిదారులు, వినియోగదారులకు లబ్ధి చేకూర్చడం జాతీయ వ్యవసాయ విపణి ముఖ్యలక్ష్యం. ప్రస్తుతం ఉత్పత్తిదారులకు, వినియోగదారుడికి మధ్య ఆరుగురి నుంచి ఎనిమిదిమంది వరకు దళారులు ఉంటున్నట్లు 2011 నాటి అధ్యయనం తేల్చింది.. ఇనామ్‌తోపాటు కేంద్రం రాష్ట్రాలకోసం సరికొత్త ఏపీఎంసీ నమూనా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం యావత్ రాష్ట్రాన్ని ఒకే మార్కెట్‌గా పరిగణిస్తోంది. ప్రైవేట్ మండీలు, రైతులే నిర్వహించుకునే మార్కెట్లు, నేరుగా రైతుల నుంచే పంటలు కొనడానికి, అమ్మడానికి వ్యాపారులకు లైసెన్సులు మంజూరు చేయడం, భారీ కొనుగోళ్ళకు తాత్కాలిక లైసెన్సులు జారీ వంటి ప్రతిపాదనలు ఈ చట్టంలో ఉన్నాయి. కేంద్రం రూపొందించిన ఏపీఎంసీ చట్టం, 2003 చట్టానికి సవరించిన రూపం ఈ సవరణలు లైసెన్సుల జారీ, వ్యాపార నియంత్రణకు సంబంధించి ఏపీఎమ్‌సీలకు ఉన్న విస్తృతాధికారాలకు కత్తెర వేస్తున్నాయి.

దేశంలోని ఏపీఎమ్‌సీలో సరైన గిడ్డంగులు కానీ, గ్రేడింగ్, విలువ అంచనా వసతులు కానీలేవు. రైతులకు వ్యాపార నైపుణ్యాలు ఉండవు కాబట్టి వారు డెరివేటివ్ క్రయ విక్రయ కేంద్రాల్లో స్వయంగా లావాదేవీలు జరపలేరు. లాభాపేక్ష లేకుండా పనిచేసిన వ్యక్తులు, సంస్థలు కానీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు కానీ ఈ విషయంలో



రైతులకు చేయూతనివ్వాలి. లేదంటే మార్కెట్ మాయాజాలానికి వ్యవసాయదారుడు బలవడం ఖాయం. . రైతులు తమ ఉత్పత్తి ధర హెచ్చుతగ్గులను అంచనా వేసి నష్టాన్ని తగ్గించుకోవడానికి, లాభాన్ని పెంచుకోవడానికి వీలు కల్పించేదే డెరివేటివ్ విపణి. వారికి ఈ వెసులుబాటును కల్పించడంతోపాటు గిట్టుబాటు ధర లభించేట్లు చూడటానికి ఈ కమిటీ తగు సిఫార్సులు చేస్తుంది. రైతుకు నష్టభయం తగ్గించి గరిష్ఠ ప్రయోజనం కల్గించాలంటే కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. ఇనామ్ కింద లావాదేవీలు జరిగినట్లయితే రైతు తన పంటను ఇ వేలం పద్ధతిలో అత్యధిక ధర ఇవ్వజూపిన వ్యాపారికి విక్రయించి అదేరోజు తన బ్యాంకు ఖాతాలో డబ్బు కళ్ళజూస్తాడు. లేదా సమీపంలోని సాధికార గిడ్డంగిలో తన సరకును నిల్వచేసి రశీదు పొందుతారు. దీని ఆధారంగా స్థానిక బ్యాంకు నుంచి అడ్వాన్స్ పొందవచ్చు. సొమ్ము చేతికొచ్చాక గిడ్డంగి ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఇనామ్ పద్ధతిలో పంటను కొనే వ్యాపారులు కొన్న రోజే రైతు ఖాతాలో డబ్బు జమ చేయాలనే నిబంధన ఉన్నా, అది అమలు కావడంలేదు. ఇనామ్ పథకం కింద ప్రతి మండీకి రూ.75 లక్షల గ్రాంటు లభిస్తుంది. అందులో రూ.30 లక్షలను డిజిటల్ లావాదేవీల నిర్వహణ ఏర్పాట్లకు వెచ్చించాలి. మిగిలిన మొత్తంలో వ్యర్థాల శుద్ధి కేంద్ర నిర్మాణానికి, ఇతర వసతుల మెరుగుదలకు ఖర్చు చేయాలి. అయితే ఈ కేంద్ర గ్రాంటు పొందదలచిన ఏపీఎమ్‌సీ కొన్ని మౌలిక నిబంధనలను పాటించాలి. అవి అందరూ వ్యాపారులకు ఉమ్మడి వాణిజ్య లైసెన్సు అందించడం, వ్యవసాయ సరకులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ఇ వేలం వేదికను ఏర్పరచడం, మార్కెట్ రుసుములను ఒకేచోట విధించి వసూలు చేయడం. ఆంధ్రప్రదేశ్‌లో ఇంతవరకు 22 ఏపీఎమ్‌సీ లను మాత్రమే ఇనామ్ పద్ధతిలోకి మార్చారు. ఈ మార్కెట్లలో కూడా కేంద్రం విధించిన మూడు నిబంధనలను పాటించడం లేదు. వ్యాపారులకు ఉమ్మడి లైసెన్సు ఇవ్వడంలేదు. ఇనామ్ పద్ధతికి మారే అన్ని మండీలు, ఏపీఎమ్‌సీలు క్రమంగా తమదైన లావాదేవీలకు స్వస్తి చెప్పాలని కేంద్రం ఉద్దేశం. దాదాపు ఏడాది క్రితం రంగప్రవేశం చేసిన ఇనామ్ కింద 16 రాష్ట్రాలు ఎలక్ట్రానిక్ లావాదేవీలను ప్రవేశపెట్టాయి. 13 రాష్ట్రాలు కేంద్ర గ్రాంటు పొందడానికి నెరవేర్చాల్సిన మూడు నిబంధనలను సవరించాయి. ముమ్ముందు అన్ని మండీలను ఎలక్ట్రానిక్ వేదిక మీదకు తీసుకురావాలని కేంద్రం ఉద్దేశిస్తున్నా, అది ఇంతవరకు నెరవేరలేదు. ఇనామ్ వ్యవస్థ అనేక ప్రాంతాల్లో క్రియాశీలకమైనప్పటికీ సంబంధిత మండీలు జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిల్లో అనుసంధానం కాలేదు. వ్యాపారులకు పలు ప్రాంతాల్లో లావాదేవీల లైసెన్సులు ఇవ్వకపోవడం, నిబంధనలను పాక్షికంగా మాత్రమే పాటించడం ఈ దుస్థితికి కారణాలు. ప్రస్తుతానికి కొన్ని మండీలలో మాత్రమే వ్యవసాయ సరకుల లావాదేవీలు డిజిటల్ రూపంలో జరుగుతున్నాయి.

-కీర్తి నాగరాజు, 9652404611

నిత్య చరిత!

నాల్గు పీటల కంచి నున్నట్టి వెలుగు
మూలమౌ వెల్గులో కూడి చాల వెలుగ
దార్శనిక దృష్టితో జూడ తగునె వగవ?!
ఆత్మదర్శన ధ్యాన మహాత్ముడతడు

నిజమె ఆవాణి యాధ్యాత్మ నిష్ఠ తనువు
జనుల కర్పించె వాక్సుధా సకల దీప
మార్గముల నెన్నె చూపె ప్రామాణికముగ
శాస్త్ర విజ్ఞాన తార్కిక సాధనముల

కంచిని పెద్ద సామిగ వికాసము చెందిన జ్ఞానకాంతి తా
త్రెంచుకొనెన్ ప్రయాణమయి దేనికొ బంధము కూర్చుకోగనా
శించి చనెన్ మరల సిద్ధమగున్ మరి ఒక్కస్వామి జ
న్మించును జ్ఞాన చక్రము పునీతపు మార్గము నందు నేగుగా?

గౌడపాదును సిద్ధాంతి గౌరవమున
సూత్ర గీతార్థభాష్యపు శోధకుండ
విముశంకరాద్వైత సాత్త్విక మహర్షి
నీకు జేజేలు వేవేలు నిత్య చరిత!

(జయేంద్ర సరస్వతికి నివాళి)
-సన్నిధానం నరసింహ శర్మ
9292055531

మంచి మాట

ఎవరి ధర్మాన్ని వారు ఆచరిస్తే,
కష్టాలొచ్చినా భయపడాల్సిన
అవసరం లేదు.

- జయేంద్ర సరస్వతి స్వామి



కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కమాండ్ కంట్రోల్‌తో
అక్రమాలకు చెక్

● సివిల్ సప్లయిలో పారదర్శకత: మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభ న్యూస్ : గత ప్రభుత్వాల హయాంలో సివిల్ సప్లయి అంటే ఒక పెద్ద అవినీతి మయంగా ఉండేదని, నేడు తెలంగాణ ప్రభుత్వంలో సివిల్ సప్లయిలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా నిలిచిందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో పౌర సరఫరాల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సివిల్ సప్లయి కమిషనర్ సి.వి.ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈటల రాజేందర్, కమిషనర్ సి.వి. ఆనంద్ అవినీతికి తావు లేకుండా సివిల్ సప్లయిని తీర్చిదిద్దారన్నారు. నేడు తెలంగాణ సివిల్ సప్లయి సాఫ్ట్‌వేర్‌ను దేశంలోనే పలు రాష్ట్రాల్లో అమలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు మొదలుకొని పేదలకు బియ్యం అందించే వరకు ఎక్కడ అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో 5300కేంద్రాల ద్వారా 15లక్షల రైతుల నుండి 72వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 11వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లల్లో ఎలాంటి అక్రమాలు జరుగకుండా ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేసి 12గంటల నుండి 72గంటల లోపు రైతులకు చెల్లింపులు చేసి దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వాలు సిల్లింగ్‌తో కూడిని ఒక్కరికి నాలుగు కిలోల పంజాబ్‌కు చెందిన తుట్టల బియ్యాన్ని ఇవ్వడంతో పేదలు తినలేకపోయారన్నారు. నేడు తెలంగాణ ప్రభుత్వం సిల్లింగ్ లేకుండా ప్రతి ఒక్కరికి 6కిలోల బియ్యం ఏ జిల్లాలో పండినవి అక్కడే ఇవ్వడంతో పేదలు కడుపునిండా భోజనం చేస్తున్నారన్నారు. రూ.300 కోట్లు ఖర్చు పెట్టి హాస్టల్, పాఠశాలలో పాత సన్న బియ్యంతో విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వం రచ్చబండ, జన్మభూమి కార్యక్రమం పెట్టి తూతుమంత్రంగా పెన్షన్‌లు అందించి గొప్పలు చెప్పుకునే వారని, నేడు ప్రతి సంవత్సరం అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు, పెన్షన్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీ గోదాంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా సివిల్ సప్లయి జేసీ కార్యాలయానికి, కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేయడంతో పక్కదారి పట్టదన్నారు. రాష్ట్రంలో సివిల్ సప్లయి వాహనాలకు జీ ట్యాగ్ ద్వారా వాహనాలు ఎంపిక చేసిన రోడ్లలో తప్ప ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లయితే వెంటనే జిల్లా సివిల్ సప్లయి కార్యాలయం, కమిషనర్ కార్యాలయం, జేసీ కార్యాలయాలకు సైరన్ రావడం వలన ఎలాంటి తప్పిదం జరుగకుండా సక్రమంగా రేషన్‌షాపులకు చేరుతాయన్నారు. రేషన్‌షాపుల్లో ఒక గ్రాం తేడా లేకుండా ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా నిజమైన లబ్దిదారులకు సరుకులు అందుతాయని, బియ్యం తీసుకున్న వెంటనే ఫోన్‌కు పూర్తి వివరాలతో ఎస్‌ఎంఎస్ వస్తుందన్నారు. ఈ నూతన పద్ధతుల ద్వారా రాష్ట్రానికి రూ.500కోట్ల ఆదాయం పెరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ఈ విధానాన్ని 9 రాష్ట్రాలకు చెందిన సివిల్ సప్లయి కమిషనర్‌లు పరిశీలనలు చేసి వారి వారి రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రాజమణి, జేసీ పద్మాకర్ పాల్గొన్నారు.

మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు
ప్రభుత్వం అండ: స్వామిగౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండటంతో పాటు వారి సంక్షేమానికి భరోసా కల్పిస్తున్నదని శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని జర్నలిస్టులే రెండు అడుగులు ముందుండి నడిపించారని గుర్తు చేశారు. బుధవారం తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో మీడియా అకాడమి చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం నిధి నుంచి 74 మంది లబ్దిదారులకు గాను రూ. 65 లక్షల 50 వేలకు సంబంధిచిన చెక్కులను చైర్మన్ స్వామిగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వానికి తీసుకెళ్లతారన్నారు. చిన్న పత్రికల మనుగడకు తెలంగాణ మీడియా కమిటి కృషి చేయాలని ఆయన సూచించారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన భద్రత, జీతాల చెల్లింపులతో పాటు వివిధ అంశాలపై మీడియా అకాడమి యజమాన్యాలతో చర్చించాలని రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు సూచించారు. జర్నలిస్టులకు పెన్షన్ పథకం అవసరమని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం నిధికి తెలంగాణ ప్రభుత్వం రూ. 100 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని కర్నాటక మీడియా కమిటి చైర్మన్ సిద్ధరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, పాలక మండలి సభ్యులు కె. శ్రీనివాస్, కె. శ్రీనివాస్‌రెడ్డి, గౌరి శంకర్, స్టీవెన్‌సన్, అంజయ్య, సత్తిరెడ్డి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌కోసం ఆందోళన

● స్పీకర్ కాన్వాయ్‌ని అడ్డుకున్న లబ్ధిదారులు



గణపురం, ప్రభ న్యూస్ : పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు బుధవారం వరంగల్ జిల్లా గణపురంలో రోడెక్కి ఆందోళన చేశారు. మూడు నెలలుగా తమకు డబ్బులు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా పోస్టాఫీస్ చుట్టూ తిరిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదని రోడ్డుపై బైఠాయించారు. ఇరువైపుల వాహనాల నిలిచిపోవడంతో ఏఎస్సైలు షాఖాన్, యాకూబ్‌అలీ ఆందోళన కారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింప జేశారు. అదే సమయంలో శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి కాన్వాయి గణపురం మీదుగా వెళ్తున్న సమయంలో సుమారు 450 మంది లబ్దిదారులు స్పీకర్ కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. తమకు గత మూడు నెలలుగా పింఛన్ డబ్బులు రావడం లేదంటూ స్పీకర్‌కు విన్నవించారు. ఆయన వాహనం దిగి పోస్టాఫీస్‌లోకి వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు. డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ చేసి రేపటి లోగా పింఛన్ దారులకు డబ్బు చెల్లించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు పోస్టల్ సిబ్బంది తమపట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని, పుస్తకాలను విసిరివేస్తున్నారని, అనరాని మాటలు అంటున్నారని గోడు వెళ్ళబోసుకున్నారు. తమ పనులు ఒదులుకుని రోజుల తరబడి పోస్టాఫీస్ వద్దే ఉండాల్సివస్తుందని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పీకర్ స్పందించి 24 గంటలలోగా పింఛన్లు పంపిణీ ప్రారంభి స్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ - ఖమ్మం జిల్లా
ఫారం-సి
నోటిఫికేషన్

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013), సెక్షన్ 11(1) మరియు 10ఎ మినహాయింపు అనుసరించి)
(రూల్ 6/12 చూడుము)

కలెక్టర్ ఫైల్ నెం. జి1/870/2018 తేది : 28-02-2018
ఆర్‌డిఓ/ ఎల్‌ఎఓ కెఎంఎం ఫైల్ నెం. సి1/237/2018 తేది : 27-02-2018

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్టపరచిన ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలములోని కూసుమంచి గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము **ఎ.40.23 3/4 గుం.** భూమిని 365బిబి సూర్యాపేట నుండి ఖమ్మం వరకు నాలుగు వరుసల జాతీయ రహదారుల విస్తరణ కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయిఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలములోని కూసుమంచి గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము **ఎ.40.23 3/4 గుం.** గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, ఫారం-సి నోటిఫికేషన్ జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము : కూసుమంచి మండలం : కూసుమంచి జిల్లా : ఖమ్మం

వరుస సంఖ్య	సర్వే నెంబర్	టైటిల్ రకం	భూమి రకం	భూ సేకరణ చేయు విస్తీర్ణం	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశంపై ఉన్న చెట్లు/ కట్టడములు/ ఇతరములు
1	296	పట్టా	మెట్ట	0.35 1/2	జర్పుల నాగేశ్వరావు తండ్రి హేమ్లు	తూ: 295 ప:360 ఉ: 297 ద: 360	వేపచెట్లు: 03 బావి సుబాబ్లు చెట్లు: 09 బోరు
2	296	పట్టా	మెట్ట	0.35	జర్పుల రాము తండ్రి లింగ్యా	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	పైపులు: 20 బోరు: 02 వేపచెట్లు: 01
3	296	పట్టా	మెట్ట	0.10	జర్పుల లక్ష్మణ్ తండ్రి కమలాకర్	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	పైపులు : 30 తుమ్మ చెట్లు:01 వేప చెట్లు: 02
4	296	పట్టా	మెట్ట	0.25 1/2	జర్పుల ప్రసాద్ తండ్రి కమలాకర్	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	బావి: 01 తుమ్మ చెట్లు: 04 వేపచెట్లు: 09 డ్రిప్ కలిగినవి పైపులు, నర్సరీ: ఇరువై వేలు
5	296	పట్టా	మెట్ట	0.06 1/4	వడిత్యా సక్కి భర్త మంగ్యా	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	వేపచెట్లు: 03
6	296	పట్టా	మెట్ట	0.20	జర్పుల సూర్య తండ్రి సేవ్య	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	పైపులు: 20 బోరు: 01
7	296	పట్టా	మెట్ట	0.02	తేజావత్ నారాయణ తండ్రి భద్య	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	లేవు
8	296	పట్టా	మెట్ట	0.02	వడిత్యా మంగ్యా తండ్రి బిచ్చు	తూ: 295 ప: 360 ఉ: 297 ద: 360	లేవు
9	360	పట్టా	మెట్ట	0.26	హలవాత్ రాములు తండ్రి రాము	తూ: 296 ప: 361 ఉ: 304 ద: 361	పైపులు: 20
10	360	పట్టా	మెట్ట	0.25	హలవాత్ భగవాన్ తండ్రి రామోజీ	తూ: 296 ప: 361 ఉ: 304 ద: 361	డ్రిప్ కలిగినవి పైపులు: 60 వేపచెట్లు:03
11	360	పట్టా	మెట్ట	0.16 1/2	హలవాత్ బోజ్యా తండ్రి రామోజీ	తూ: 296 ప: 361 ఉ: 304 ద: 361	పైపులు: 100 బావి
12	360 361	పట్టా	మెట్ట	0.08 0.07 3/4 0.15 3/4	హలవాత్ నాగేశ్వరావు తండ్రి బోజ్యా	తూ: 296 ప: 361 ఉ: 304 ద: 361	లేవు
13	360	పట్టా	మెట్ట	0.04 1/4	బానోత్ రాములు తండ్రి వెంకట్రాం	తూ: 296 ప: 361 ఉ: 304 ద: 361	పైపులు : 70
14	361	పట్టా	మెట్ట	0.05 1/2	బానోత్ గోపా తండ్రి రాములు	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	పైపులు: 80
15	361	పట్టా	మెట్ట	0.00 1/4	హలవాత్ బద్దు తండ్రి సామ్లు	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	లేవు
16	361	పట్టా	మెట్ట	0.35 1/4	బానోత్ వాల్య తండ్రి తులిశ్య	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	పైపులు: 20
17	361	పట్టా	మెట్ట	1.01 1/4	హలవాత్ సుగుణ భర్త హచ్చు	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	పైపులు: 30 బావిలో బోరు వేప: 10 తుమ్మ: 01
18	361 359	పట్టా	మెట్ట	0.01 1/4 0.12 1/2 0.13 3/4	హలవాత్ జగ్గు తండ్రి జమ్లు	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	వేప: 03 సంద్ర: 01 బావి: 01
19	361	పట్టా	మెట్ట	0.29 3/4	బానోత్ మోహన్ తండ్రి పర్వ్య	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	బోరు: 01 పైపులు: 20
20	361 359	పట్టా	మెట్ట	0.00 1/4 0.05 0.05 1/4	బానోత్ పూల్ సింగ్ తండ్రి పర్వ్య	తూ: 360 ప: 359 ఉ: 360 ద: 363	పైపులు : 30 వేపచెట్లు: 10
21	295	పట్టా	మెట్ట	0.11 1/4	బానోత్ భీముడు తండ్రి రాములు	తూ: 294 ప: 296 ఉ: 298 ద: 360	పైపులు : 60 పైపులతో కూడిన డ్రిప్స్ :01
22	366 357 358	పట్టా	మెట్ట	0.31 0.16 0.05 1.12	హలవాత్ సైదా తండ్రి జత్రు	తూ: 359 ప: 376 ఉ: 356 ద: 365	వేపచెట్లు: 20
23	358	పట్టా	మెట్ట	0.26 1/4	హలవాత్ గాంధీ తండ్రి చత్రు	తూ: 359 ప: 357 ఉ: 305 ద: 365	వేపచెట్లు: 02
24	358 359	పట్టా	మెట్ట	0.07 1/2 1.33 1/4 2.00 3/4	బానోత్ వరుణ్ గాంధీ తండ్రి లక్ష్మ నాయక్ మరియు బానోత్ రాహుల్ నాయక్ తండ్రి వెంకన్న నాయక్	తూ: 360 ప: 357 ఉ: 305 ద: 364	వేప : 15 తుమ్మ : 01
25	359	పట్టా	మెట్ట	0.19	బానోత్ భారతి భర్త భీముడు	తూ: 361 ప: 358 ఉ: 305 ద: 364	లేవు
26	359	పట్టా	మెట్ట	0.12 1/2	బానోత్ హర్జ్య తండ్రి రాము	తూ: 361 ప: 358 ఉ: 305 ద: 364	లేవు
27	359	పట్టా	మెట్ట	0.06	హలవాత్ అచ్చమ్మ భర్త దుదియా	తూ: 361 ప: 358 ఉ: 305 ద: 364	వేపచెట్లు: 05 పైపులు: 20
28	380	పట్టా	మెట్ట	1.02	అర్వపల్లి రాము తండ్రి శంబయ్య	తూ: 378 ప: 382 ఉ: 347 ద: 384	లేవు
29	380	పట్టా	మెట్ట	0.20 1/2	అర్వపల్లి మొగలయ్య తండ్రి సైదులు	తూ: 378 ప: 382 ఉ: 347 ద: 384	లేవు
30	378	పట్టా	మెట్ట	3.01 1/2	అర్వపల్లి నాగేశ్వరావు తండ్రి రాములు	తూ: 376 ప: 380 ఉ: 377 ద: 379	తాటి చెట్లు: 20 వేప చెట్లు: 10
31	378	పట్టా	మెట్ట	0.09 1/2	వడిత్యా మంగమ్మ భర్త బాలాజీ	తూ: 376 ప: 380 ఉ: 377 ద: 379	మామిడి చెట్టు -01 వేపచెట్లు: 05 తాటి చెట్లు: 10
32	378	పట్టా	మెట్ట	0.05 1/4	వడిత్యా సీతారాములు తండ్రి రెడ్డ్యి	తూ: 376 ప: 380 ఉ: 377 ద: 379	మామిడి చెట్టు -01 పైపులు : 70 డ్రిప్స్ : 12 వేపచెట్లు: 06 గుడి, బోరు: 01
33	378 376	పట్టా	మెట్ట	0.29 0.07 1/2 0.36 1/2	వడిత్యా లక్ పతి తండ్రి సక్రు	తూ: 375 ప: 380 ఉ: 357 ద: 379	వేపచెట్లు: 02 తాటి చెట్లు: 02 టేకు చెట్లు: 01 పైపులు: 100 బావి : 01
34	378	పట్టా	మెట్ట	0.01 1/2	ఉడుగు వెంకన్న తండ్రి చంద్రయ్య	తూ: 376 ప: 380 ఉ: 377 ద: 379	లేవు
35	376	పట్టా	మెట్ట	1.05 1/2	వడిత్యా పంతులు తండ్రి సక్రు	తూ: 375 ప: 378 ఉ: 357 ద: 378	గుడి వేపచెట్లు: 02 గిన్నె చెట్టు: 01 పైపులు: 100 బావి: 01
36	376	పట్టా	మెట్ట	0.17	వడిత్యా భద్రు తండ్రి పకీరా	తూ: 375 ప: 378 ఉ: 357 ద: 378	గుడి
37	375	పట్టా	మెట్ట	0.33 1/2	వడిత్యా వీర్యా తండ్రి పకీరా	తూ: 357 ప: 376 ఉ: 357 ద: 448	బోర్లు: 04 వేపచెట్లు: 14 పైపులు: 200
38	358	పట్టా	మెట్ట	0.06	హలవాత్ సామ్య తండ్రి కోట్య	తూ: 359 ప: 357 ఉ: 305 ద: 365	లేవు
39	382 381	పట్టా	మెట్ట	0.09 1/2 0.18 1/4 0.27 3/4	అర్వపల్లి రామకృష్ణ తండ్రి శంబయ్య	తూ: 380 ప: 397 ఉ: 346 ద: 383	పైపులు : 30
40	381	పట్టా	మెట్ట	1.29	మామిళ్ళ ఏకారెడ్డి తండ్రి రామి రెడ్డి	తూ: 380 ప: 397 ఉ: 346 ద: 382	లేవు
41	381	పట్టా	మెట్ట	0.06	బెల్లంకొండ రాములమ్మ భర్త వెంకన్న	తూ: 380 ప: 397 ఉ: 346 ద: 382	లేవు
42	382	పట్టా	మెట్ట	1.06	అర్వపల్లి నర్సయ్య తండ్రి వెంకటనర్సయ్య	తూ: 380 ప: 397 ఉ: 381 ద: 383	లేవు
43	397 397 394 488	పట్టా	మెట్ట	0.13 1/4 0.17 1/4 0.05 1/2 0.07 1/2 1.03 1/2	బానోత్ రామచంద్ తండ్రి వెంక్యా	తూ: 382 ప: 400 ఉ: 449 ద: 399	గుబ్బ చెట్లు- 02 , టేకు చెట్లు - 05 వేపచెట్టు- 01 పైపులు- 120 బోరు- 01 గుడి
44	397	పట్టా	మెట్ట	0.23	బానోత్ కోట్యా తండ్రి జేత్య	తూ: 382 ప: 398 ఉ: 448 ద: 396	వేపచెట్లు - 03 బోరు-01 గుడి
45	398	పట్టా	మెట్ట	0.04 1/4	బానోత్ సీత్య తండ్రి జేత్య	తూ: 397 ప: 400 ఉ: 397 ద: 399	బోరు - 01
46	398	పట్టా	మెట్ట	0.09	బానోత్ వీరూ తండ్రి దీప్లా	తూ: 397 ప: 400 ఉ: 397 ద: 399	లేవు
47	398 448	పట్టా	మెట్ట	0.07 1/2 0.04 1/4 0.11 3/4	బానోత్ పీర్య తండ్రి దీప్లా	తూ: 397 ప: 400 ఉ: 397 ద: 399	టేకు చెట్టు-01 కుంకుడు చెట్టు-01 సీతాఫలం చెట్లు-05 తాటి చెట్లు -10 వేపచెట్లు -05
48	448	పట్టా	మెట్ట	0.01 1/4	వడిత్య శంకర్ తండ్రి భిక్షం	తూ: 397 ప: 400 ఉ: 397 ద: 399	పైపులు - 10
49	448 400 401	పట్టా	మెట్ట	0.08 1/2 0.08 0.15 0.31 1/2	వడిత్య తారాచంద్ తండ్రి సుక్య	తూ: 398 ప: 402 ఉ: 449 ద: 399	టేకు చెట్లు-10 కుంకుడు చెట్టు -01 వేపచెట్లు-05 బోరు - 03 పైపులు - 250
50	400	పట్టా	మెట్ట	0.14 1/2	వడిత్య మంగమ్మ భర్త కిషన్	తూ: 399 ప: 403 ఉ: 401 ద: 399	వేపచెట్లు -03
51	402	పట్టా	మెట్ట	0.32	బానోత్ రమేష్ తండ్రి మత్రు	తూ: 400 ప: 404 ఉ: 401 ద: 403	వేపచెట్లు -05 1 బావి
52	402 403	పట్టా	మెట్ట	0.18 1/4 0.05 3/4 0.24	బానోత్ కిషన్ రావు తండ్రి మత్రు	తూ: 400 ప: 404 ఉ: 401 ద: 404	వేపచెట్లు -05
53	403	పట్టా	మెట్ట	0.03	బానోత్ రామ్ తండ్రి బిక్షం	తూ: 400 ప: 404 ఉ: 402 ద: 404	1 బావి బోరు - 01 వేప చెట్లు -03 పైపులు-10
54	403 404 416 417	పట్టా	మెట్ట	0.07 1/4 0.18 1/2 0.05 1/4 0.00 1/4 0.31 1/4	బానోత్ శ్రీను తండ్రి మల్సుర్	తూ: 400 ప: 418 ఉ: 447 ద: 405	1 బోరు పైపులు - 160
55	404	పట్టా	మెట్ట	1.02 1/2	బానోత్ హేమ్లు తండ్రి మంగ్యా	తూ: 403 ప: 416 ఉ: 447 ద: 405	పైపులు-150
56	404	పట్టా	మెట్ట	0.07	బానోత్ వెంకట్రాం తండ్రి బిక్షం	తూ: 403 ప: 416 ఉ: 447 ద: 405	పైపులు - 20
57	404	పట్టా	మెట్ట	0.08	బానోత్ బాష్యా తండ్రి మంగ్యా	తూ: 403 ప: 416 ఉ: 447 ద: 405	లేవు
58	404 405	పట్టా	మెట్ట	0.19 0.00 1/4 0.19 1/4	బానోత్ మల్సుర్ తండ్రి బిక్షం	తూ: 403 ప: 416 ఉ: 447 ద: 414	వేపచెట్లు -05
59	404	పట్టా	మెట్ట	0.11 3/4	బానోత్ పిర్యా నాయక్ తండ్రి నాన్య	తూ: 403 ప: 416 ఉ: 447 ద: 405	తాటి చెట్లు 03 వేపచెట్లు -08
60	404	పట్టా	మెట్ట	0.04 1/2	బానోత్ రుప్లా తండ్రి మంగ్యా	తూ: 403 ప: 416 ఉ: 447 ద: 405	వేపచెట్లు -03
61	421/అ	పట్టా	మెట్ట	0.02	బానోత్ లక్మా తండ్రి హర్జ్య	తూ: 420 ప: 422 ఉ: 430 ద: 420	పైపులు - 05
62	421/అ 420	పట్టా	మెట్ట	0.06 0.12 1/2 0.18 1/2	బానోత్ శ్రీను తండ్రి తవుర్యా	తూ: 418 ప: 422 ఉ: 430 ద: 419	పైపులు -10 వేపచెట్లు -05 తుమ్మ-01
63	420 419 418	పట్టా		0.17 1/2 0.04 0.17 1/4 0.38 3/4	బానోత్ సేవ్యా తండ్రి అమృ	తూ: 417 ప: 422 ఉ: 416 ద: 415	బావి-1 తాటి-02 వేప-08
64	420	పట్టా		0.31 1/2	బానోత్ తులిశ్య తండ్రి అమృ	తూ: 418 ప: 421 ఉ: 421 ద: 419	బావి -01 గుబ్బ-01 తాటి-03 వేప-03
65	420	పట్టా		0.09 1/2	బానోత్ హర్జ్య తండ్రి తవుర్యా	తూ: 418 ప: 421 ఉ: 421 ద: 419	వేపచెట్లు - 02 గుడి
66	420	పట్టా		0.13 1/2	హలవాత్ మౌనిక భర్త సైదా	తూ: 418 ప: 421 ఉ: 421 ద: 419	1 బోరు పైపులు - 35
67	420	పట్టా		0.06	బానోత్ భాష్యా తండ్రి తవుర్యా	తూ: 418 ప: 421 ఉ: 421 ద: 419	పైపులు -10 వేపచెట్లు -02
68	420	పట్టా		0.06 3/4	బానోత్ పచ్య తండ్రి తవుర్యా	తూ: 418 ప: 421 ఉ: 421 ద: 419	1 బోరు పైపులు - 10
69	419 418	పట్టా		0.07 0.05	బానోత్ సక్రు తండ్రి కావిల్య	తూ: 417 ప: 422 ఉ: 416 ద: 415	లేవు
70	419 418	పట్టా		0.01 0.05 1/4 0.06 1/4	బానోత్ హుస్సేన్ తండ్రి చంద్రు	తూ: 417 ప: 422 ఉ: 416 ద: 415	1 బోరు పైపులు- 10
71	419 418	పట్టా		0.00 1/4 0.08 0.08 1/4	బానోత్ లాలు తండ్రి మాత్రు	తూ: 417 ప: 422 ఉ: 416 ద: 415	లేవు
72	418 417 416 416	పట్టా		0.10 0.02 1/2 0.01 3/4 0.10 0.24 1/4	బానోత్ బాలాజీ తండ్రి బాబ్లు	తూ: 404 ప: 420 ఉ: 446 ద: 419	లేవు
73	418	పట్టా		0.00 1/2	బానోత్ రాములు తండ్రి హర్యా	తూ: 416 ప: 420 ఉ: 416 ద: 419	లేవు
74	418 417 416 416	పట్టా		0.20 1/2 0.04 1/4 0.03 0.07 3/4 0.35 1/2	బానోత్ వీరన్న తండ్రి బాబ్లు	తూ: 404 ప: 420 ఉ: 446 ద: 419	లేవు
75	418	పట్టా		0.12 3/4	బానోత్ మంగిలాల్ తండ్రి మాత్రు	తూ: 416 ప: 420 ఉ: 416 ద: 419	లేవు
76	417 416	పట్టా		0.06 1/2 0.14 1/4 0.20 3/4	వడిత్యా ధర్మ తండ్రి మంగ్త	తూ: 404 ప: 420 ఉ: 446 ద: 419	లేవు
77	416	పట్టా		0.04 3/4	బానోత్ వీరన్న తండ్రి హచ్చా	తూ: 404 ప: 420 ఉ: 446 ద: 419	లేవు
	మొత్తం			**40.23 3/4**			

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013), సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, ఖమ్మం మరియు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మం వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, ఖమ్మం వారు, భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి ఖమ్మం వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ -12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, ఖమ్మం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు/అమ్మకాలు/తాకట్లకు మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ - (15) ప్రకారం, జిల్లా కలెక్టర్, ఖమ్మం/ భూసేకరణ అధికారి& రెవిన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మం గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవల్సియున్నది.


సం/-	**సం/-**	**సం/-**
భూసేకరణ అధికారి / రెవిన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మం	**జాయింట్ కలెక్టర్, ఖమ్మం జిల్లా**	**కలెక్టర్, ఖమ్మం జిల్లా**

Andhraprabha business 2018
బిజినెస్

మౌలిక వృద్ధి రేటు 6.7 శాతం

న్యూఢిల్లీ : వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకట నలో జనవరి నెలలో ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధిరేటు 6.7 శాతం సాధిం చిందని తెలిపింది. కాగా పారిశ్రా మికోత్పత్తి (ఐఐపీ)లో ఈ ఎనిమిది కీలక రంగాల వాటా 40.27 శాతం. ఈ ఎనిమిది రంగాలు బొగ్గు, ముడిచమురు, సహజవా యువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువు లు, ఉక్కు, సిమెం ట్, విద్యుత్. మొ త్తం ఎనిమిది కీలక పరిశ్రమ లు జన వరి 2018 నాటికి 133.1 పాయింట్లు సాధించగా.. క్రితం ఏడాది జనవరితో పోల్చుకుంటే 6.7 శాతం వృ ద్ధి కనిపించింది. కాగా ఏప్రిల్ 2017 నుంచి జనవరి 2018 వరకు వృద్ధిరేటు చూస్తే 4.3 శాతంగా తేలింది. బొగ్గు ఉత్పత్తిజనవరిలో 3.0శాతం వృద్ధి ని సాధించింది. కాగా ముడి చమురు ఉత్పత్తి గత నెలలో 3.2 శాతం క్షీణించింది. సహజవాయువు విషయానికి వస్తే 1.0 శాతం తగ్గింది. రిఫైనరీ ఉత్పత్తుల విషయానికి వస్తే క్రితం ఏ డాది జనవరితో పోల్చుకుంటే 11.0 శాతం పెరి గింది. ఎరువుల వి షయానికి వస్తు వస్తే జనవరిలో 1.6 శా తం ఉత్పత్తి క్షీణించింది. ఉక్కు విషయానికి వస్తే జనవరిలో 3.7 శాతం పెరిగింది. సిమెంట్ విషయానికి వస్తే గత నెలలో 20.7 శాతం ఉత్పత్తి పెరిగింది. ఇక విద్యుత్ విషయానికి వస్తే జనవరిలో 8.2 శాతం పెరిగిందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.





జీడీపీ స్ట్రాంగ్!

• డిసెంబర్ త్రైమాసికంలో 7.2 శాతం • వృద్ధిరేటులో చైనాను మించిన భారత్

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా జోరందుకుంటోంది. డిసెంబర్‌తో ముగిసిన మూడవ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ 7.2 శాతానికి ఎగబాకింది. దీన్ని బట్టి చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.6 సాధిం చేందుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన గ ణాంకాలను బట్టి తెలుస్తోంది. తయారీరంగంతో పాటు, సేవల రంగం పుంజు కోవడం, పెట్టుబడులు పెరగడంతో పాటు వినియోగం కూడా జోరందుకుంది కా బట్టి ఆర్థిక వ్యవస్థ క్రమంగా మెరుగుపడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ విషయానికి వ స్తే పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టి) లాంటి అడ్డంకులనుంచి గట్టె క్కినట్లే. కాగా జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 6.3 శాతంగా నమోదైంది. తాజా పరిణామాలను బట్టి చూస్తే ప్రపంచంలో శరవేగంగా దూస ుకుపోతున్న ఆర్థిక వ్యవస్థ టైటిల్‌ను చైనా నుంచి భారత్ తిరిగి కైవసం చేసుకొనే అవకాశం కనిపి స్తోంది. కాగా అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో చైనా జీడీపీ 6.8 శాతం మా త్రమే.జీడీపీ పుంజుకోవడానికి కారణం: క్యూ3లో జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతం సాధించడానికి ప్రధాన కారణం.. కార్పొరేట్ల ఆదాయం పెరగడం, పారిశ్రా మికోత్పత్తి వృద్ధిరేటు పుంజుకోవడం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొంటే ప్రభు త్వం గత జనవరిలో వేసిన అంచనా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం 2017- 18లో వృద్ధిరేటు 6.5 శాతం సాధిస్తుందని చెప్పవచ్చు. ఆ స్థాయికి చేరుకోవడానికి అవకాశాలు మెరుగుపడ్డాయి. కాగా తాజా పరిణామాల ప్రకారం చూస్తే అక్టోబర్ నుంచి మార్చి వరకు జీడీపీ వృద్ధిరేటు 7 శాతానికి ఎగబాకే అవకాశాలున్నాయి. కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) బుధవారం నాడు మూడు త్రైమాసికాల వాస్తవ గణాంకాలను విడుదల చేసింది. దీని ప్రకారం చూస్తే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని తెలుతోంది. సీఎస్ఓ విడుదల చేసిన గణాంకాల ప్రకారం గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) ప్రకారం .... జీడీపీ మైనస్ నికరపన్నులు తీసేస్తే అక్టోబర్ త్రైమాసికంలో వృద్ధిరేటు 6.7 శాతానికి ఎగబాకిందని చెబుతోంది. అంత కుముందు త్రైమాసికంలో జీవీఏ 6.1 శాతంగా నమోదైంది. సీఎస్ఓ అంచనా ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీడీపీ 6.4 శాతంగా నమోదు కావచ్చునని అంచనా వేసింది. కాగా 2016-17లో 7.1 శాతంగా నమోదైంది. వా స్తవంగా చూస్తే.. జీడీపీ వృద్ధిరేటును జీవీఏ ప్రకారం కొలిస్తే ఖచ్చితమైన లెక్క తేలు తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో దేశంలోని జరిగే వస్తు సేవల ఉత్పత్తి విలువను ప్రాతిపదికగా తీసుకుంటారు. ఉత్పత్తులు ఖచ్చితంగా లెక్కిస్తేనే స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ ఎంతో తేలుతోంది. కాగా ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ 2.4 ట్రిలియన్ డాలర్లుగా చెబుతున్నారు. తయారీరంగం జోరు : ఈ ఆర్థిక సం వత్సరం మూడవ త్రైమాసికంలో తయారీరంగం ఏకంగా 8.1 శాతానికి చేరు కుంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 5.1 శాతంగా నమోదవుతుందని అంచనా.. క్రి తం ఏడాది ఇదే త్రైమాసికంలో 7.9 శాతంగా నమోదైంది. దీన్ని బట్టి చూస్తే ఫ్యాక్ట రీలు లేదా కర్మాగారాలు జీఎస్టి సవాళ్లనుంచి బయటపడినట్లు తెలుస్తోంది. గత ఏడాది జులై 1 నుంచి వస్తు సేవల పన్ను లేదా (జీఎస్టి) అమల్లోకి వచ్చింది. కంపెనీల నుంచి దుకాణదారుడి వరకు సరకు వదిలించుకోవడానికి ప్రయత్నించాయి. కంపె నీలు క ూడా జులై 1 నుంచి జీఎస్టి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో జూన్ నుంచి ఉత్ప త్తిని తగ్గించుకున్నాయి. జీఎస్టి తర్వాత ధరలు పెరుగుతాయా లేదా తగ్గుతాయనేది ఎవరికి అంతుపట్టలేదు. ప్రస్తుతం జీఎస్టిఅమల్లోకి వచ్చినందుకు వల్ల ధరలు సరా సరిగా పాతరేట్ల ప్రకారమే కొనసాగుతున్నాయి. తాజా పరిణామాలను బట్టి చూస్తే గత కొన్ని నెలల నుంచి అన్నీ సర్దుకున్నాయని తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది చివరి నాటికి వినియోగం పెరిగింది. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత త యారీరంగం పూర్తిగా గాడిలో పడింది. పారిశ్రామికోత్పత్తి పుంజుకుంది. ప్రధా నం గా క్యాపిటల్ గూడ్స్ రంగంలో ఉత్పత్తి పెరగిపోయింది. తాజా గణాంకాలను బట్టి చూస్తే డిసెంబర్ త్రైమాసికంలో కమాడిటీ ధరలు పెరగడంతో కార్పొరేట్ లాభా లు భారీగా పుంజుకున్నాయని తెలుతోంది. ప్రభుత్వం రెవెన్యూ వ్యయం (వాటిలో వడ్డీ చెల్లింపులు) తీసేస్తే .. సంవత్సరం ప్రాతిపదికన 24 శాతం పెరిగింది. ఏడాది క్రితం ఇది 12 శాతం మాత్రమే.. కాగా వ్యవసాయేతర రంగంలో గణనీయమైన వృ ద్ధి కనిపిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్, సర్వీస్ సెక్టార్ వాటిలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను కలు పుకొంటే, క్రెడిట్ గ్రోత్.. రుణాలకు డిమాండ్ పెరగడం తదితర అంశాలు అను కూలంగా ఉండటంతో దాని ప్రభావం వృద్ధిరేటుపై కనిపిస్తోంది.

పుంజుకున్న వ్యవసాయరంగం

అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో వ్యవసాయరంగం 4.1 శాతానికి పుంజుకోగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 1.7 శాతం మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18 మొత్తానికి చూస్తే వ్యవసాయరంగం వృద్ధిరే టు3 శాతానికి చేరుకోవచ్చు. కాగా గత ఆర్థిక సంవత్సరం 6.3 శాతంగా నమో దైంది. సీఎస్ఓ అంచనా ప్రకారం వ్యవసాయరంగం ఈ ఆర్థిక సంవత్సరం మందకొడిగా ఉంటుందని అంచనావేసింది. దీనికి ప్రధాన కారణం ఖరీఫ్ పంట ఉదాహరణకు నూనెగింజలు, పప్పులు, కాయధాన్యాలు, పత్తి దిగుబ డి తగ్గిందని వివరించింది.నిర్మాణరంగం: డిసెంబర్ త్రైమాసికంలో నిర్మాణ రంగంలో 6.8 శాతం వృద్ధి కనిపించింది. కాగా సెప్టెంబర్ త్రైమాసికంలో 2.6 శాతం మాత్రమే. నిర్మాణరంగం పుంజుకోవడానికి ప్రధాన కారణం సిమెంట్, ఉక్కు అమ్మకాలు జోరందుకోవడమే.

ఏప్రిల్-జనవరి ద్రవ్యలోటు 113.7 శాతం

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2017 నుంచి జనవరి 2018 వరకు ద్రవ్యలోటు లక్ష్యం రూ.6.77 లక్షలు దాటిపోయింది. ప్రస్తుతం ద్రవ్యలోటు ల క్ష్యం 113.7 శాతానికి చేరిపోయింది. వాస్తవానికి మార్చి నాటికి ఈ స్థాయికి చేరా ల్సింది జనవరి చివరి నాటికి చేరింది. కాగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల కాలంలో పన్ను వసూళ్లు రూ.9.7 లక్షల కోట్లుగా తేలిందని ప్రభుత్వం విడు దల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. కాగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018 -19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రసంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు లక్ష్యాన్ని 3.2 శాతం నుంచి 3.5 శాతానికి పెంచారు.

హార్లీ డేవిడ్‌సన్ బైక్ ధరలు తగ్గాయి



న్యూఢిల్లీ: విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే (కంప్లీట్ బిల్ట్ యూనిట్) మోడల్‌బైక్‌ధరలను హార్లీ డెవిడ్‌సన్ తగ్గించింది. కేంద్రంప్రభుత్వం ఇటీవల దిగుమతి చేసుకొనే పూర్తి స్థాయి బైక్‌పై ఎక్సైజ్‌సుంకాన్ని తగ్గించింది. తగ్గించిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయి. కాగా హార్లీ బుధ వారం నాడు సాఫ్ట్‌టెయిల్ డీలక్స్, సాఫ్ట్‌టెయిల్ లోరైడర్‌ను మార్కెట్లో విడుదల చేసింది. దేశీయ మార్కెట్లో కంపెనీ మొత్తం 16 మోటార్‌సైకిళ్లను విక్రయిస్తోంది. వాటిలో నాలుగు మా త్రమే సీబీయు. ఈ నాలుగు బైక్‌లు అమెరికా నుంచి నేరుగా భారత్‌కు దిగుమతి చేసుకుంటుంది. అయితే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే సీకెడీ రేంజికి చెందిన 10 మోటార్‌సైకిళ్ల ధరలను మాత్రం పెంచలేదు. కాగా ప్రభు త్వం వీటిపై కస్టమ్స్ సుంకం పెంచింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకు మోడీసర్కార్ దిగివచ్చి 800 సీసీ అంత కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన బైక్‌లపై దిగుమతి సుంకాన్ని 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించింది. అయినా ట్రంప్ మా త్రం సంతృప్తి చెందడంలేదు. సీకెడి బైక్‌లంటే విడిభాగాలు, ఇంజిన్, గేర్‌బాక్స్, ట్రాన్స్‌మిషన్ మెకానిజం వస్తుంది. వా టిని భారత్‌కు రప్పించి అసెం బ్లింగ్ చేస్తారు. వాటిపై ప్రభుత్వం పది నుంచి పదిహేను శా తం సుంకం పెం చింది. తగ్గించిన సుంకాన్ని లబ్దిని కంపెనీ వినియో గదారుడికి అంది స్తోంది. హార్లీ డేవి డ్‌సన్ సీబీయు మోటార్‌సై కిల్ ధరలు ఇలా ఉన్నా యి. హార్లీ డేవిడ్‌సన్ రోడ్ కింగ్ రూ.24.99 లక్షలు, హార్లీ డెవి డ్‌సన్ స్ట్రీట్ గ్లైడ్ స్పెషల్ రూ.29.99 లక్షలు, హార్లీ డెవిడ్‌సన్ రోడ్ గ్లైడ్ స్పెషల్ రూ.32.99 లక్షలు, హార్లీ డెవిడ్‌సన్ సీవీవో లిమిటెడ్ రూ.49.99 లక్షలు.

కార్తీ అరెస్టు

• లండన్ నుంచి తిరిగొచ్చిన చిదంబరం తనయుడు • చెన్నై ఎయిర్‌పోర్టులో కాపుకాసి మరీ అదుపులోకి.. • హుటా హుటీనా చిదంబరం తిరుగు ముఖం • మనీలాండరింగ్ కేసులో సీబీఐ విచారణ • ఐఎన్ఎక్స్ మీడియాకు అక్రమంగా విదేశీ పెట్టుబడులు • విచారణకు సహకరించనందునే అరెస్టు • ఒక రోజు పోలీసు కస్టడీకి పంపిన పటియాల కోర్టు



చెన్నై : కేంద్రమాజీ మంత్రి పి చిదంబరం కుమారుడు కార్తీ చి దంబరాన్ని సీబీఐ బుధవారం ఉదయం చెన్నై విమానాశ్రయంలో ఐఎన్ఎక్స్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి అరెస్టు చేసింది. అ రెస్టుకు ముందు కార్తీ కుటుంబసభ్యులకు సమాచారం అం దిం చా రని సీబీఐ అధికారులు చెప్పారు. సీబీఐ వర్గాల సమాచారం ప్రకా రం కార్తీ లండన్ నుంచి చెన్నై విమానాశ్రయంలో అడుగు పెట్టగానే అ రెస్టు చేసి రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లి విచారణ జరి పారు. విచా రణకు ఆయన సహకరించనందుకే ఆయనను అరెస్టు చేసి నట్లు చెబు తున్నారు. సీనియర్ సీబీఐ అధికారి సమాచారం మోసం కేసులో కార్తీ పాత్ర ఉందని.. దీనికి బలమైన ఆధారాలున్నాయని చెప్పారు.

దీ నికి మించి ఆయన వివరాలు అందించడానికి నిరాక రించారు. ఇటీ వలే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్టర్డ్ అకౌంటెంట్ ఎస్ భాస్క ర్‌రామన్‌ను అరెస్టు చేసిన తర్వాత సీబీఐ కార్తీ చిదం బరాన్ని అరెస్టు చేసింది. కాగా కార్తీ చిదంబరబ చార్టర్డ్ అకౌంటెంట్ భాస్కర రామన్‌ను ఢిల్లీలో ఫిబ్రవరి 16వ తేదీన ఐదునక్షత్రాల హోట ల్‌లో అరెస్టు చేసింది.కేసు విషయానికి వస్తే ..ఐఎన్ఎక్స్ మీడియా విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) నిబంధనలు ఉల్లం ఘిం చి మారిషస్ నుంచి 2007లో రూ.350 కోట్ల పెట్టుబడులు స్వీక రిం చింది. దీనికి సంబంధించి పన్ను ఎగ్గొట్టిన మోసం కింద సీబీఐ విచా రణను అడ్డుకొనేందుకు తన తండ్రి పి.చిదంబరం (యూపీఏలో అప్పుడు మంత్రి) పలుకుబడి ఉపయోగించాలని ఐఎన్ ఎక్స్ మీడి యా కార్తీ సహకారాన్ని కోరింది. కాగా కార్తీ ఈ సేవలందించినందుక ు రూ. 10 లక్షల వోచర్లు ఇచ్చింది. వాటిని కూడా స్వాధీనం చేసుకు న్నామని సీబీఐ పేర్కొంది. గత వారం కార్తీ సుప్రీంకోర్టును ఆశ్రయిం చి ఐఎ న్ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి ఈడీ సమన్లపై స్టే ఇవ్వా లని కోరారు. ఈడీ ముందు తాను 'అండర్‌ప్రోటెస్ట్' హాజర వుతానని చెప్పా రు.కాగా జనవరి 18వ తేదీన ఈడీ కార్తీని ప్రశ్నించంది. ఇదిలా ఉండగా ఈడీ ఫిబ్రవరి 2వ తేదీన తాజాగా సమ న్లు జారీ చేసింది. దీ నికి కార్తీ సమాధానం ఇస్తూ.. ఈ కేసుకు సంబం ధించి సుప్రీం కోర్టులో ఇంటర్‌లోక్యూటరీ దరఖాస్తు పెండింగ్ ఉందని స్పష్టం చేశా రు. ఇది లా ఉండగా సీబీఐ కార్తీతో పాటు ఇతరుల పై గత ఏడాది మే లో కేసు రిజిష్టర్ చేసింది. సీబీఐ కార్తీ చిదంబరం, ఎఎన్ఎక్స్ మీడి యా దాని డైరెక్టర్లు పీటర్, ఇంద్రాణి ముఖర్జీయాల ను నిందితులుగా పేర్కొంది. ఇదిలా ఉండగా సీబీఐతో పాటు ఈడీ కూడా ఇప్పటికి పలు మార్లు సీని యర్ చిదంబరంతో పాటు కార్తీ చిదం బరం ఇళ్లతో పాటు కార్యాల యాలపై దాడులు చేసింది. దీంతో పాటు కార్తీకి వ్యతిరేకంగా లుకౌట్ నోటీసు కూడా జారీ చేసింది. దీంతో కార్తి విదేశీ ప్రయాణాలు చేయ డానికి అవకాశం ఉండదు.

సీబీఐ చెప్పే దేమిటంటే ఈ ముసుగులో కార్తీ విదేశాలకు వెళ్లి లంచాల రూపంలో బ్యాంకులో దాచుకున్న వి దేశీ ఖాతాలను మూసివేసే అవకాశాలున్నా యని భావించింది. ఇది లా ఉండగా గత నవంబర్‌లో కార్తీ చిదం బరం తన కుమారెను కెం బ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేర్పించడానికి లండన్ వెళ్లడానికి అనుమ తించాలని సుప్రీంకోర్టును అభ్యరించారు. కోర్టు దీనికి సమ్మతిం చింది.సీబీఐ అంచనా ప్రకారం ఐఎన్ఎక్స్ మీడి యా తన రికార్డుల్లో రూ.10 లక్షలు అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సెల్టెంగ్ (పీ) లిమిటెడ్‌కు ఇచ్చి నట్లు చూపించింది. ఈ సంస్థ పరోక్షంగా కార్తీకి సంబంధించిన మేనే జ్‌మెంట్ కన్సెల్టెంట్ కంపెనీ. ఇదిలా ఉండగా కార్తీకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న కంపెనీల్లోకి సు మారు రూ.3.5 కోట్లు ఐఎన్ఎక్స్ గ్రూపునుంచి వచ్చినట్లు చెబుతు న్నారు. కాగా సీబీఐ ఎఫ్ ఐఆర్ కార్తీకి సంబంధించిన కంపెనీ చెస్ మే నేజ్‌మెంట్ సర్వీసెస్, ముఖర్జియాకు చెందిన ఐఎన్ఎక్స్ మీడి యా, అడ్వాంటేజ్ స్ట్రాటజీ కన్సెల్టింగ్ సర్వీసెస్ దాని డైరెక్టర్ పద్మా వి శ్వ నా థన్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వివిధ వర్గాల నుంచి సేక రిం చి న సమాచారం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ వివరించింది.

సీబీఐ విచారణకు సహకరించలేను

• నీరవ్‌మోడీ



న్యూఢిల్లీ: పీఎన్‌బీకి వేలాది కోట్ల రూపాయలు మోసం చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ సీబీఐ విచారణకు సహ కరించనని స్పష్టం చేశారు.విదేశాల్లో తనకు వ్యాపారులు ఉన్నాయని విచారణకు సహకరించలేనని మోడీ సీబీఐకి పంపిన లేఖలో తెలిపారు. బుధవారం మోడీకి పంపిన ఈ మెయిల్‌లో తక్షణమే ఏ దేశంలో ఉంటే ఆ దేశ రాయబార కా ర్యాలయాన్ని సంప్రదించాలని సీబీఐని కోరింది. అటు నుంచి భార త్‌కు తీసుకువస్తామని తెలిపింది. వచ్చే వారం జరిగే సీబీఐ విచారణకు తప్పకుండా హాజరుకావాల్సిందని సీబీఐ ఈ మెయిల్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుతం నీరవ్‌మోడీ ఎక్కడు న్నారో తెలియదని సీబీఐ పేర్కొంది. ఇదిలా ఉండగా మోడీ తో పాటు ఆయన మేనమామ మెహుల్ చోక్సీలు పంజాబ్ నే షనల్ బ్యాంకుకు 200 కోట్ల డాలర్లు మోసం చేశారని తెలిపింది.

క్యాన్సర్‌కు అవినీతికి పోలికా...

ఇదిలా ఉండగా పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎండీ, సీఈ వో సునీల్ మెహతా తన బ్యాంకులో జరిగిన మోసం గురించి ప్రస్తావిస్తూ.. అవినీతి అనేది క్యాన్సర్‌లా విస్తరిస్తోందని ప్రక టించారు. దీనికి క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ వి. శాంత తీవ్ర అభ్యంతరం తెలిపారు. అవినీతికి క్యాన్సర్‌కు పోలికఏమిటని ప్రశ్నించారు. చెన్నైలోని తమ ఆస్పత్రిలో ప్ర తి ఏడాది వేలాది మంది రోగులకు చికిత్స చేస్తుంటామని, వారంతా ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంతో సమాజానికి ఉప యోగపడుతున్నారని చెప్పారు. అవినీతిని క్యాన్సర్‌తో ము డిపెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. మీ ప్ర కటనను ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

కెనెరా బ్యాంకుకు దీదీ మిత్రుడు రూ.500 కోట్ల టోకరా!

కోలకతా చెందిన కంప్యూటర్ కంపెనీ ఆర్‌పీ ఇన్ఫో సిస్టమ్‌స లిమిటెడ్, దాని డైరెక్టర్లు కెనెరా బ్యాంకుకు రూ. 500 కోట్ల వరకు మోసం చేసినందుకు సీబీఐ కేసు నమోదు చె సింది. ఈ కంపెనీ నకిలీ స్టాకులతో పాటు తప్పుడు స్టేట్ మెంట్‌లు చూపించి బ్యాంకు నుంచి సేకరించిన రుణం మొ త్తాన్ని బదలీ చేయించుకుందని పేర్కొంది. కంపెనీ డైరెక్టర్ల లో ఒక రు శిబాజీ పాంజాను బ్యాంకు మోసం కేసులో గ తంలో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆయన పశ్చి మ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సన్ని హితుడని తేలింది. ఇది లా ఉండగా ఫిబ్రవరి 2015లో పం జాను నాట కీయంగా పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ఢాకా నుంచి మ మ తాబెనర్జీతో కలిసి వస్తుండగా పశ్చిమ బెంగాల్ పోలీసుటు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం లు కౌట్ నోటీసును దృష్టిలో ఉంచుకొని పశ్చి మ బెంగాల్ పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మమతా మూడు రోజుల పాటు అనధికార పర్యటనకు బం గ్లాదేశ్ వెళ్లారు. ఆ బృందంలో పాంజా ఉన్నారు. ఈ సం ఘ ట జరిగిన వెంటనే మమతా పంజాను దూరంగా ఉం చడం మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పంజాను పశ్చిమ బెంగా ల్లో పలు ఉ న్నతస్థాయి కమిటిలో నియమించారు. ఉ దాహరణకు ఫిల్మ్ అండ్ కల్చర్‌తో పాటు పారిశ్రామిక ప్రో త్సాహకబోర్డు సలహాదారుగా ఉన్నారు. దీంతో పాటు ఆయ న ఆర్‌పీ గ్రూపు వ్య వయస్థాపకుడు కూడా. తన కంప్యూటర్ వ్యాపారాన్ని 'చిరా గ్' బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసుకున్నా రు. సినిమా ప్రొడక్షన్ లో కూడా ఒక చేయ్యేశారు.సీబీఐ జూ న్ 2015లో పంజాకు చెందిన ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్‌తో పాటు దాని డైరెక్టర్లు ఐడి బీఐకి రూ.180 కోట్ల మోసం కేసులో కేసు నమోదు చేశారు. ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్ విషయానికి వస్తే సీబీఐ కౌస్తవ్‌రే, వినయ్ బాఫ్నా ఇద్దరు కంపెనీ డైరెక్టర్లు వైస్ ప్రెసి డెంట్ (ఫైనాన్స్) దె బ్‌నాథ్ పాల్‌తో పాటు కెనెరా బ్యాంకు అధికారులున్నారు. కెనెరా బ్యాంకు సీబీఐకి చేసిన ఫిర్యాదు లో ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్‌స కెనెరా బ్యాంకు నేతృత్వంలోని పది బ్యాం కుల కన్సా ర్షియంను రూ.515.15 కోట్లు మోసిం చేసిం దని పేర్కొంది. కంపెనీ నకిలీ స్టాక్. మోసం పూర్తి స్టేట్‌మెం ట్లను బ్యాంకుకు అప్పగించి రుణాలు తీసుకొందని, తీసుకు న్న రుణాన్ని ఇతర ఖాతాలకు బదలీ చేసిందని వివరించింది.

డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ

• గరిష్టంగా 0.75శాతం • బుధవారం నుంచి అమల్లోకి



ముంబై : ప్రభుత్వరంగానికి చెందిన అతి పెద్ద బ్యాం కు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రిటై ల్, బల్క్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 0.75 శాతం వరకు పెంచింది. సవరించిన వడ్డీరేట్లు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. రిటైల్ డిపాజిట్స్ విషయానికి వస్తే రూ.1 కోటి కంటే తక్కువ డిపాజిట్లపై 0.50 శా తం వరకు వడ్డీరేట్లు పెంచింది. అదే డిపాజిట్లు ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల లోపు అ యితే 0.15 శాతం నుంచి 6.40 శాతం వరకు పెం చింది. గతంలో వీటిపై 6.25శాతం వడ్డీ ఆఫర్ చె సింది. అలాగే రిటైల్ డిపాజిట్లపై రేట్లు రెండు సం వత్సరాల నుంచి పది సంవత్సరాల కాలపరిమితిపై 0.50 శాతం పెంచి 6.00 శాతం నుంచి 6.50 శాతా నికి సవరించింది. బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను వరుసగా గత కొన్ని నెలల నుంచి మూడుసార్లు పెం చింది. రూ.1 కోటి నుంచి రూ.10 కోట్ల బల్క్ డిపా జిట్ల విషయానికి వస్తే ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల లోపు మేచురిటీపై వడ్డీరేట్లను 0.50 శా తం పెంచి 6.25 శాతం నుంచి 6.75 శాతానికి సవ రించింది. అదే విధంగా డిపాజిట్లు రెండు సంవ త్సరాల నుంచి మూడు సంవత్సరాల లోపు అయితే వడ్డీరేట్లను 0.75 శాతం పెంచి 6.75 శాతానికి సవ రించింది. అదే రూ.10కోట్ల బల్క్ డిపాజిట్లు ఒక సం వత్సరం నుంచి రెండు సంవత్సరాల లోపు మేచు రిటపై వడ్డీరేట్లను 0.50 శాతం నుంచి 6.75 శాతానికి పెంచింది అదే బల్క్ డిపాజిట్లు రెండు నుంచి మూ డు సంవత్సరాల లోపు మేచురిటపై వడ్డీరేట్లను 0.75 శాతం పెంచి 6.75 శాతానికి సవరించింది.

ఎందుకు పెంచాల్సి వచ్చింది?

కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ రూ.500, రూ.1,000 నోట్లను ర ద్దు చేసిన తర్వాత బ్యాం కుల్లో డిపాజిట్లు వరదల్లా వచ్చి చేరాయి. అటు తర్వాత అంత వేగంగా డిపాజిట్లు కరిగిపోయా యి. ప్రస్తుతం బ్యాం కుల్లో నిల్వలు తగ్గాయి. డి పాజిట్లు పెరగడం లేదు.. రుణాలకు డిమాం డ్ క్ర మంగా పెరుగుతోంది. డిసెంబర్‌తో ముగిసిన త్రై మాసి కంలో బ్యాంకుల రుణాల డిమాండ్ రెం డంకెలకు ..15 నెలల గరిష్టానికి 10.7 శాతానికి ఎగబాకింది. ఇటీవల రేటింగ్ ఏజెన్సీ ఇక్రా కూడా బ్యాంకుల్లో డిపాజిట్ల కంటే రుణాలకు డిమాండ్ పెరిగిందని తాజా నివేదికలో వెల్ల డించింది. దీంతో బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీరేట్లు పెం చడానికి సిద్ధంగా ఉన్నాయి. బుధవారం ఎస్‌బీఐ ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు పెంచింది. త్వరలోనే మి గిలిన బ్యాంకులు కూడా పెంచడానికి క్యూ కడతాయి.

పెద్దనోట్ల రద్దు, జీఎస్టి నుంచి మోక్షం

మూడీసీ ఇన్వెస్టర్ సర్వీసెస్

న్యూఢిల్లీ : భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా పుంజుకుంటోందని మూ డీస్ ఇన్వెస్టర్‌సర్వీసెస్ పేర్కొంది. పె ద్దనోట్ల రద్దు, జీఎస్టిలను భారత్ గట్టె క్కిందని తెలిపింది. అయితే 2018 ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 7.6 శా తంలో ఎలాంటి మార్పులేదని స్ప ష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం గ్రా మీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కొన్ని దిద్దుబాటు చర్య లు తీసుకుందని తెలిపింది. గతంలో ప్రభుత్వం పెద్దనోట్లు రూ.500, రూ. 1,000 రద్దు చేయడం... దీన్ని వల్ల ఆ ర్థిక వ్యవస్థ కాస్తా నెమ్మదించిన నేప థ్యంలో దిద్దుబాటు చర్యలు తీసు కుందని మూడీస్ నివేదికలో పే ర్కొంది. ప్రస్తుతం పెద్ద నోట్ల రద్దు, జీ ఎస్టిల నుంచి క్రమంగా గాడినప డుతోందని తెలిపింది.

ఆల్టో అమ్మకాల్లో రికార్డు బద్దలు

• 35లక్షల యూనిట్ల విక్రయం

న్యూఢిల్లీ : మారుతి సుజుకి ఎంట్రీ లెవెల్ కారు ఆల్టో అమ్మకాల్లో రికార్డుబద్దలు కొట్టింది. ఫిబ్రవరిచివరి నాటికి 35 లక్షల యూనిట్లు విక్రయించింది. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఆల్టో అమ్మకాలు భారత్‌లోనే రికా ర్డుస్థాయికి చేరాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ ఎస్ కాల్సీ చెప్పారు.ప్రస్తుతం ఆల్టో రెండు రకా ల ఇంజి న్ ఆప్షన్లలో లభిస్తోం ది. వాటిలో ఒకటి 800 సీసీ, రెం డోది కె10 సీరీస్, దీం తో పాటు సీఎన్‌జీ ఫ్యూ యెల్ వారి యెంట్ లో ల భిస్తోంది. 2020 నాటికి ఆల్టోను బీఎస్ -6 ప్రమాణాల స్థాయికి తీసుకొస్తామని కాల్సీ చెప్పారు. కాగా ఆల్టోను 200 0 సంవత్సరంలో భారత్ మా ర్కెట్లో విడుదల చేశారు. ఎం ట్రీ లెవల్ సెగ్మెంట్‌లో గత 14 సం వత్సరాల నుంచి నెంబర్ వన్ స్థానం లో కొనసా గుతోంది. 2006 నుంచి ప్రతి ఏడాది ఐదు లక్షల యూనిట్లను విక్రయిస్తు న్నట్లు తెలి పారు. మా పో టీదారులు విక్రయించే మొత్తం కార్ల తో పోల్చు కుంటే ఆల్టో అమ్మకాలు అంత ఉంటాయని కాల్సి వివరించా రు. ఆల్టో కొను గోలుదార్లలో యువ కస్టమర్లు 30 ఏళ్లకంటే తక్కువ వయ సు వారు 25 శాతం మంది వర కు ఉ న్నారని చె ప్పారు.



మొదటిసారి కారు కొ నుగో లు చేయాల నుకునే వారు ఆల్టోకే అధిక ప్రాధాన్యం ఇస్తా రని ఆ యన తెలి పారు. ఎంఎస్ ఐ విక్ర యించే కార్లలో 55 శాతం వాటా ఆల్టోదేనని ఆయన అన్నారు.

రిజిస్ట్రేషన్లకు కొత్త చట్టం

● చట్టంలో మార్పులకు ముసాయిదా రెడీ ● అసెంబ్లీలో ఆమోదం దిశగా కసరత్తు ● సొంత చట్టం ఉంటేనే మేలంటున్న అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడుస్తున్నా నాటి చట్టాలు మారలేదు. బ్రిటీష్ కాలంలో రూపొందించిన భారత స్టాంపులు, ఇండియన్ రిజిస్ట్రేషన్ చట్టాలే ఇంకా మనుగడలో ఉన్నాయి. తాజాగా ఆర్ఓఆర్ చట్టంలో మార్పులు, భూ చట్టాల్లో సవరణలు, మ్యుటేషన్లల్లో కొత్త విధానం, రెవెన్యూ రికార్డులకు ప్రత్యేక వెబ్ సైట్ ఆరంభిస్తున్న తరుణంలో రిజిస్ట్రేషన్ చట్టాలపై జోరుగా చర్చ జరుగుతోంది. రోజుకో భూ కుంభకోణం, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో అధునాతన ఫీచర్లవంటి చర్యల నేపథ్యంలో కొత్త చట్టం అత్యంత ఆవశ్యకమైంది. అంతేకాకుండా మార్చి 11నుంచి విప్లవాత్మకంగా తహశీల్దార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ సేవలు ఆరంభం కానున్న సంగతి తెలిసిందే. 1899 నాటి ఇండియన్ స్టాంపుల చట్టం, 1908 నాటి రిజిస్ట్రేషన్ చట్టాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం ధృడంగా భావిస్తోంది. మార్చిలో ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నూతన రిజిస్ట్రేషన్ చట్టం ముసాయిదాపై చర్చ జరపాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

కొత్త చట్టం రాకతో ఐదారు దశాబ్దాల కిందటి రెవెన్యూ చట్టాల్లో లోపాలను చక్కబెట్టనున్నారు. కాగా నూతన ముసాయిదాలో అధికారులకున్న అనేక అధికారులకు కోత పెడుతున్నారు. అంతిమంగా ప్రజలకు మరింత మేలు జరిగేలా నూతన చట్టం ముసాయిదాలో ప్రాధాన్యతనిచ్చారు. సంక్లిష్టతకు తావులేకుండా సరళత్వమే ప్రధానాంశంగా తెలంగాణ స్టాంపుల యాక్టు ముసాయిదా సర్కార్‌కు చేరింది. 1899లో బ్రిటీష్ కాలంలో రూపొందించిన చట్టానికే ఇప్పటివరకు అనేక సవరణలు చేస్తూ కొనసాగిస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సొంత యాక్టును ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సొంత చట్టం లక్ష్యం వెనుక...

రిజిస్ట్రేషన్ యాక్టు మొత్తం కేంద్ర పరిధిలోని అంశం కావడంతో రాష్ట్రాలకు ఇబ్బందిగా మారింది. రాష్ట్రాలకు అవసరమైన సవరణలకు కేంద్రం అనుమతి కోరడం క్లిష్టంగా మారింది. అవసరమైన సందర్భంలో కేంద్రంనుంచి చట్ట సవరణ అనుమతిలో తీవ్ర జాప్యం ఎదురవుతోంది. ఈ సందిగ్ధతలను దృష్టిలో పెట్టుకున్న అనేక రాష్ట్రాలు ఇప్పటికే తమ సొంత చట్టాలను రూపొందించుకుని అమలు చేసుకుంటున్నాయి. పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లు సొంతంగా స్టాంపుల చట్టాలను రూపొందించుకున్నప్పటికీ ఇంకా కేంద్ర చట్టంపై ఆధారపడక తప్పడంలేదు. ఇందుకు కారణం స్టాంపుల చట్టాలను సొంతంగా ఏర్పాటు చేసుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చట్టాలను స్వంతంగా రూపొందించుకోకపోవడమే.

తాజా ముసాయిదాలో...

కొత్త స్టాంపుల చట్టంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలను జవాబుదారీ చేస్తూ నిబంధనలను రూపొందించారు. స్టాంపు డ్యూటీని సరిగా చెల్లిస్తున్నారా లేదా, ఆస్తుల మదింపు ఎలా చేశారు అనే విషయాలను పరిశీలన చేసేలా వెసులుబాటును చేర్చారు. విస్తృత అధికారాలు ఉన్న రిజిస్ట్రేషన్ సిబ్బంది పరిధిని పరిమితం చేయాలని ముసాయిదాలో చేర్చారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లోనే కాకుండా ప్రైవేటు కార్పొరేట్ కార్యాలయాల్లో కూడా తనిఖీలకు అవకాశం, అధికారం ఇవ్వనున్నారు. స్టాంపుల చట్టం సెక్షన్ 73 ప్రకారం అధికారులు కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. అయితే ఇకపై ఈ సమాచారాన్ని సబ్ రిజిస్ట్రార్‌లకు తెలపాలని నిబంధన విధించారు. కృత్రిమంగా పెంచిన మార్కెట్ విలువలపై విధించే స్టాంపు డ్యూటీ పెనాల్టీ రూ. 2కు తగ్గించారు. ఇందుకు జిల్లా రిజిస్ట్రార్‌కు ఉన్న అధికారాన్ని ఐజీ, కమిషనర్‌లకు కట్టబెట్టారు. స్టాక్ మార్కెట్‌లలో లావాదేవీలపై రుసుముల వసూలుకు పకడ్బందీ వ్యవస్థకు సూచనలు చేయడం కీలక అంశంగా చెప్పుకోవచ్చు. ఆడిటర్ జనరల్ నిబంధనల్లో ఉన్న అయోమయాన్ని తొలగించడం, ప్రతీ డాక్యుమెంట్‌కు నిర్దేశిత రుసుమును విధించడం కీలక పరిణామం. అయితే ఈ ముసాయిదాను సర్కార్ పరిశీలించి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. తర్వాత దీనిని కేంద్ర ఆమోదం పొందాల్సి ఉంటుంది. తర్వాతే రాష్ట్ర చట్టసభల్లో బిల్లు పెట్టి అమలులోకి రావాల్సి ఉంది. ఇందుకు ఈ దఫా అసెంబ్లీ సమావేశాలను వేదికగా చేసుకునే అవకాశం కనిపిస్తోంది.



ఏసీబీలో ఇద్దరు డీఎస్పీల బదలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)లో పని చేస్తున్న ఇద్దరు డిఎస్‌పిలు బదలీ అయ్యారు. హైదరాబాద్ రేంజ్ డిఎస్‌పిగా పని చేస్తున్న అశోక్‌కుమార్‌ను బంజారాహిల్స్‌లోని కేంద్ర కార్యాలయానికి పంపించారు. వరంగల్ రేంజ్ డిఎస్‌పిగా పని చేస్తున్న బి.వి. సత్యనారాయణను హైదరాబాద్ రేంజ్ డిఎస్‌పిగా నియమించారు.

అశోక్‌కుమార్ బదలీ ఎందుకు?

హైదరాబాద్ రేంజ్ డిఎస్‌పిగా పని చేస్తున్న అశోక్ కుమార్‌ను ఎకాఎకిన బదలీ చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన హెచ్ఎండిఎ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి కేసు దర్యాప్తును అశోక్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను అక్రమంగా కూడబెట్టిన పురుషో త్తంరెడ్డి మూలాలను వెలికి తీసేందుకు గడచిన నెల రోజులుగా అశోక్‌కుమార్ తీవ్ర ప్రయత్నాలను చేస్తున్నారు. ఇప్పటికే పురుషోత్తంరెడ్డికి చెందిన రూ. 300 కోట్ల విలువ చేసే ఆస్తులను వెలికి తీసిన డిఎస్‌పి మరిన్ని ఆస్తుల గురించి తెలుసుకునేం దుకు విచారణను ముమ్మరం చేశారు. తాజాగా పురుషోత్తంరెడ్డి బినామీలలో మరొకరిని కూడా అరెస్టు చేశారు. మరిన్ని ఆస్తులను వెలికి తీసేందుకు తనదైన శైలిలో విచారణను ముమ్మరం చేసిన నేపథ్యంలో డిఎస్‌పి బదలీపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బినామీల వత్తిడిపై అనుమానాలు

హెచ్ఎండిఎ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డికి రాజకీయంగా బాగా పలుకుబడి ఉందని మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఆయన యధేచ్ఛగా అవినీతికి పాల్పడటం వెనుక కూడా కారణం ఇదేనన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర మంత్రికి అత్యంత సమీప బంధువు కావడంతో పాటు అధికార టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక ఎంఎల్ఎ అండదండలతోనే ఆయన రెచ్చిపోయాడని, పట్టుబడ్డ ఆస్తులలో కొన్ని ఎంఎల్ఎకు చెందినవి కూడా ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. పురుషోత్తంరెడ్డిని మరింత లోతుగా విచారిస్తే బినామీల బాగోతం బహిర్గతమయ్యే అవకాశాలున్నాయన్న ఉద్దేశ్యంతోనే కేసును నీరుగార్చేందుకు డిఎస్‌పి అశోక్‌కుమార్‌ను హుటాహుటిన బదలీ చేసినట్లు ఎసిబి వర్గాలలోనే చర్చ మొదలైంది.

ఇరు వర్గాలతో చర్చిస్తా

● క్యాబ్ ధరల పెంపు ఆందోళనపై మంత్రి తలసాని ● సమస్య పరిష్కారానికి ఫిలిం ఛాంబర్ ప్రతినిధులకు భరోసా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చలన చిత్రాల ప్రదర్శనలో ఎగ్జిబిటర్లకు, క్యాబ్ ఆపరేటర్లకు మధ్య ఏర్పడిన వివాదాన్ని నివారించేందుకు ఇరు పక్షాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. క్యాబ్ ధరల పెంపును నిరసిస్తూ ఈ నెల 2నుంచి నిరవధికంగా దక్షిణాది రాష్ట్రాల్లో థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఫిల్మ్ ఛాంబర్, తెలుగు, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ల ప్రతినిధులు బుధవారం సచివాలయంలో మంత్రి తలసానిని కలిశారు. సినిమాలు ప్రదర్శించే క్యాబ్ ధరలను పెంచడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు, హిందీ సినిమాల పట్ల ఒక విధంగానూ, హాలీవుడ్ సినిమాల పట్ల మరో విధంగానూ క్యాబ్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ సినీ పరిశ్రమ పురోభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ ఈ విషయంలోనూ తగిన చర్యలు తీసుకుని పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. క్యాబ్ నిర్వాహకుల ఆగడాలను నియంత్రించాలన్నారు. వారి విజ్ఞప్తి పట్ల స్పందించిన మంత్రి తలసాని శ్రీనివాస్ సమస్య పరిష్కారానికి ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించేందుకు భరోసా ఇచ్చారు. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మురళీమోహన్, సౌత్ ఇండియా నిర్మాతల సంఘం కార్యదర్శి కళ్యాణ్, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు జెమిని కిరణ్, దామోదర్ ప్రసాద్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మార్చి 2 నుంచి థియేటర్ల మూసివేత...

డిజిటల్ ప్రొవైడర్‌ల అధిక ఛార్జీలకు వ్యతిరేకంగా థియేటర్‌లను నిరవధికంగా మూసివేయాలని దక్షిణ భారత చలన చిత్ర సంయుక్త కార్యాచరణ సంఘం నిర్ణయించింది. నిర్మాతలు, ప్రదర్శన, పంపిణీ, స్టూడియో విభాగాలన్నీ ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని ఐకాస సభ్యులు తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో దక్షిణ భారత చలన చిత్ర ఐకాస సంఘ సభ్యులు ముత్యాల రాందాస్, దాము ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వారివురూ మాట్లాడుతూ... ఛార్జీలు తగ్గించాలంటూ గత రెండు నెలలుగా మేము చేస్తున్న ప్రతిపాదనలకు డిజిటల్ ప్రొవైడర్‌లు స్పందించడం లేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమలు అన్నీ ఒక్కటై సంయుక్త కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఈ సంఘం ద్వారా డిజిటల్ ప్రొవైడర్‌లతో జనవరి 31న చెన్నైలో, ఫిబ్రవరి 16న కేరళలో, ఫిబ్రవరి 23న బెంగళూరులో మూడు సార్లు చర్చలు జరిపాం. వర్చువల్ ప్రింట్ ఫీజును ఇప్పుడున్న దానిలో పాతికశాతం తగ్గించాలని, సినిమా ప్రదర్శన సమయంలో మూడు ప్రకటనలు మాత్రమే వేయాలని, దాదాపు అరగంట ఉన్న ప్రకటనల సమయాన్ని 8 నిమిషాలకు తగ్గించాలని కోరాం. ఈ మూడు ప్రధాన కోర్కెలు తీర్చాలంటున్నాం. ఈ కోర్కెలకు డిజటల్ ప్రొవైడర్‌లు స్పందించడం లేదు. కేవలం పదిశాతం లోపు ఫీజు తగ్గిస్తామంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా దక్షిణాది చిత్ర పరిశ్రమలో సినిమాల ప్రదర్శన జరగకుండా థియేటర్‌ల మూసివేతకు నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయం వెనుక నిర్మాతలందరి అంగీకారం ఉంది అని అన్నారు.



హైదరాబాద్‌లోని ఒక సెంటర్‌లో పరీక్షలు రాస్తున్న ఇంటర్ విద్యార్థులు. పరీక్ష సమయం సమీపిస్తుండడంతో పరుగులు తీస్తూ వస్తున్న విద్యార్థినులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

● మొదటి రోజు ముగ్గురు డిబార్ ● నిముషం నిబంధనతో ఇబ్బందులు ● మేడ్చల్ జిల్లాలో హాల్ టిక్కెట్లు రాక 20 మంది పరీక్షలకు దూరం ● 95.6 శాతం హాజరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులను డిబార్ చేశారు. వికారాబాద్‌లో ఒకరు, కరీంనగర్‌లో ఒకరు, సూర్యాపేటలో ఒకరిని డిబార్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం పరీక్షలకు 95.68 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. నిమిషం నిబంధనతో కొందరు విద్యార్థులు ఇంటర్ పరీక్షకు దూరం కాగా... హాల్ టికెట్లు రాకపోవడంతో మరికొందరు విద్యార్థులు పరీక్షను రాయలేకపోయారు. ఇంటర్ మొదటిసంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాష అయిన తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్ధూ, అరబిక్, ఫ్రెంచ్, కన్నడ, మరాఠీ పేపర్-1 పరీక్ష జరిగింది. సెట్ బి ని ఎంపిక చేశారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 4,82,360 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 4,61,516 మంది హాజరయ్యారు. 20,844 మంది హాజరు కాలేదు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అయి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. పరీక్షల కోసం 31 జిల్లాల్లో 1294 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 527 ప్రభుత్వ కాలేజీల్లో సెంటర్లు ఉండగా, 767 ప్రైవేటు కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 25,395 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్షలకు సూర్యాపేట జిల్లాలోని కోదాడలో ఒక విద్యార్థిని పరీక్షా కేంద్రానికి 9 గంటలలోపే వచ్చి తనకు ఏ రూమ్‌లో ఉందో వెతుకులాటలో ఉండగా ఆలస్యం అయిందంటూ అధికారులు అమ్మాయిని పరీక్షకు అనుమతించలేదని విద్యార్థి సంఘాలు కాలేజీ ముందు ధర్నా చేపట్టాయి. అయినప్పటికీ అధికారులు అమ్మాయిని పరీక్షకు అనుమతించలేదు. మేడ్చల్ జిల్లా బొల్లారంలోని ఎల్ఆర్ఎం కాలేజీలో 9 మంది ప్రైవేటు విద్యార్థులకు హాల్‌టికెట్లు రాలేదు. ఎందుకని ఆరా తీయగా కాలేజీకి చెందిన రికార్డు అసిస్టెంట్ విద్యార్థులనుంచి వసూలు చేసిన ఫీజును ఇంటర్‌బోర్డుకు చెల్లించకపోవడంతో వారికి హాల్ టికెట్లను జారీ చేయలేదు. హాల్‌టికెట్ల గురించి అడుగగా ప్రిన్సిపాల్ చేతులు ఎత్తేయడంతో రికార్డు అసిస్టెంట్‌పై ఫీజు చెల్లించిన విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో 9 మంది విద్యార్థులు సోమవారం జరిగిన పరీక్షను రాయలేకపోయారు.

రేపు జరగాల్సిన పరీక్ష యథాతథం: బోర్డు కార్యదర్శి

శుక్రవారం జరగాల్సిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష యధాతథంగా జరుగుతుందని బోర్డు కార్యదర్శి అశోక్ బుధవారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ద్వితీయ భాష పేపర్-2 యధావిధిగా కొనసాగుతుందని, హోళీ పండుగ ఉన్నందున పరీక్ష జరగదనే ప్రచారాన్ని నమ్మవద్దని, విద్యార్థులు పరీక్షకు సిద్ధం కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు సీఐ సహాయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇంటర్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు రిపేర్ అవడంతో పోలీసులు తమ వాహనాల్లో విద్యార్థులను ఎగ్జామ్ సెంటర్‌లో డ్రాప్ చేశారు. నగరంలోని మహేంద్రహిల్స్ జూనియర్ కాలేజీ ఇంటర్మీడియేట్ విద్యార్థులు ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఈస్ట్ మారేడ్‌పల్లి చెక్ పోస్టు దగ్గర ఆ బస్సు ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు తమ ఎగ్జామ్ మిస్ అవుతామేమో అని ఆందోళన చెందారు. దీంతో విద్యార్థులతో పాటు ఉన్న వార్డెన్ ఎలాగైనా సమయానికి విద్యార్థులను ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకెళ్లాలని భావించాడు. దీంతో ఆటోలలో కొంతమందిని ఎగ్జామ్ సెంటర్‌కు పంపించినప్పటికీ 8 మంది మిగిలిపోయారు. ఇదంతా పక్కనే నిలబడి చూస్తున్న మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ పోలీస్ వాహనంలోనే ఆ విద్యార్థులను ఎగ్జామ్ సెంటర్‌లో కచ్చిత సమయానికి డ్రాప్ చేశారు. విద్యార్థులను పోలీసు వాహనంలో ఎక్కించుకునని తీసుకెళ్తున్న ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. వందల మంది విద్యార్థులు ఆయన తీసుకున్న నిర్ణయానికి అభినందనలు తెలుపుతున్నారు. ఆయనను పోలీసు అధికారులు, మీడియా రిపోర్టర్లు, విద్యార్థులు అభినందిస్తున్నారు. ఐపీఎస్ ఆఫీసర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ కూడా ఫేస్‌బుక్‌లో శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి: నిరుద్యోగ జేఏసీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. దీంతోపాటు కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని బుధవారం జరిగిన నిరుద్యోగ సభలో వక్తలు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సభకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సభకు జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రామలింగం, సి రాజేందర్, భూపేష్‌సాగర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ప్రభుత్వ ఆఫీసులు ఉద్యోగులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని, వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1200 గ్రూప్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటితోపాటు గ్రూప్-3, 4 పోస్టులు కూడా వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి తోడు ఇప్పుడు కొత్తగా ఏర్పడిన జిల్లాల మూలంగా మరికొన్ని పోస్టులు అదనంగా భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

రైతుల పరిస్థితి మారాలి



● మాతా అమృతానందమయి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అందరికీ అన్నం పెట్టే రైతన్నకు అవసరమైన అన్నివసతులు సమకూర్చడం సమాజం బాధ్యత అని, ఈ బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం నెరవేరుస్తుందని మాతా అమృతానందమయ దేవి ప్రశంసించారు. సముద్రం పాలవు తున్న నీటిని కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు తరలించడం మంచి ప్రయత్నమని అభినందించారు. అందరికీ అన్నం పెట్టే రైతులు ఆత్మహ త్యలు చేసుకునే పరిస్థితి పూర్తిగా మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భారతదేశ యాత్రలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్న అమ్మ బుధవారం సికింద్రాబాద్‌లోని అమ్మ ఆశ్రమంలో భక్తులకు దర్శనమిచ్చి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ మంత్రి హరీష్‌రావు మఠానికి వెళ్ళి అమ్మ ఆశీ ర్వాదంతీసుకున్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు త్వరగా పూర్తయి రైతులకు సాగు నీరు అందేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం, పాల మూరు ఎత్తిపోతల పథకాల గురించి, మిషన్ కాక తీయ గురించి, తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం సిఎం కెసిఆర్ తీసుకున్న చర్యలను హరీష్‌రావు వివరించారు.

బాసర ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రసిద్ధ బాసర సరస్వతీ ఆలయాభివృద్ధికి సిఎం కెసిఆర్ రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల దేవాదాయ శాఖ మంత్రి ఎన్. ఇంద్రకరణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే రెండవ సరస్వతీ ఆలయంగా విలసిల్లుతోన్న ఈ ఆలయానికి దేశ, విదేశాల నుంచి భక్తులు అక్షరాభ్యాసం కోసం తరలి వస్తున్న నేపథ్యంలో ఆలయాభివృద్ధికి నిధులను కేటాయిచడం పట్ల మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనులపై త్వరలోనే ఆగమ శాస్త్ర పండితులతో చర్చించి మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామని మంత్రి చెప్పారు.

సమస్యలు లేకుండా పరీక్షలు జరగాలి



● పరీక్షా కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి ● వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి కడియం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై మంత్రి బుధవారం సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారనే పేరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కడియం అధికారులను ఆదేశించారు. కేంద్రాల దగ్గర త్రాగు నీరు, మెడికల్ వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లడానికి పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉన్న జీరాక్స్ కేంద్రాలను మూసివేసేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్య కమిషనర్ కిషన్, ఐజీ శిఖా గోయల్ పాల్గొన్నారు.

రేపు భాషా పండితుల ఎస్‌జీటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో భాగంగా బుధవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు, ఉర్ధూ, మరాఠీ, కన్నడ, హిందీ మీడియంలో) పరీక్ష ఉదయం జరిగింది. పరీక్షకు 14151 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ (హిందీ, కన్నడ, తమిళ్, ఉర్ధూ సబ్జెక్టులు)కు 3741 మంది హాజరయ్యారని తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పరీక్ష లేదు. శుక్రవారం ఎస్‌జిటి (బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్ధూ, తమిళ్ మీడియం) వారికి ఉదయం, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం వారికి మధ్యాహ్నం పరీక్ష ఉంటుంది.

అశ్లీల వెబ్‌సైట్ నిర్వాహకుడి అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ సినీ నటుల ముఖాలను మార్ఫింగ్ చేసి వెబ్‌సైట్‌లలో అశ్లీల చిత్రాలను చెలామణి చేస్తున్న ఇంజనీరింగ్ చేసిన యువకుడిని సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. బోడుప్పల్‌లో నివసించే రుద్రవరపు రఘువరన్‌ను అరెస్టు చేశారు. బిటెక్ పూర్తి చేసిన రఘువరన్ తెకమపిశాచి డాట్ ప్లాగ్ స్పాట్ డాట్ ఇన్ పేరుతో వెబ్‌సైట్‌ను రూపొందించి అందులో మార్ఫింగ్ చేసిన అశ్లీల దృశ్యాలను ఉంచి సులభంగా డబ్బుసంపాదిస్తున్నాడని సిఐడి దర్యాప్తులో తేలింది.

విశాఖ వైద్యురాలి ఆత్మహత్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన ఓ వైద్యురాలు విషపు ఇంజక్షన్ తీసుకుని ప్రాణాలు తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన ఎం.నూకరాజు కుమార్తె డాక్టర్ ఎంవీవీ లక్ష్మి(42) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి సైనిక్‌పురిలోని హస్తినాపురిలో ఓ ప్లాట్‌లో ఒంటరిగా ఉంటున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, సివిల్ సర్జన్‌గా చేస్తున్న లక్ష్మి నెల రోజుల క్రితం పదోన్నతిపై సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అవివాహిత అయిన లక్ష్మి రెండు రోజులుగా విధులకు హాజరు కావడం లేదు. అపార్ట్‌మెంట్‌లో నూ ఆమె కనిపించకపోవడంతో ఊరెళ్లి ఉంటారని అందరూ భావించారు. అయితే మంగళవారం ఆమె ప్లాట్ నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్క ప్లాట్ వారు వాచ్‌మన్‌కు సమాచారం అందించారు. దీంతో అపార్ట్ మెంట్ అధ్యక్షుడు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలుగొట్టి చూడగా లక్ష్మి మృతదేహం కనిపించింది. ఆ పక్కనే రెండు ఇంజక్షన్ సీసాలు, సిరంజులు ఉండటంతో ఆమె వాటిని తీసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

ఇంజనీర్ పోస్టుల రిజర్వేషన్లపై నివేదిక

● బీసీ కమిషన్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సహాయక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పోస్టుల భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ల పాటింపుపై 15 రోజుల్లోగా సవివరమైన నివేదిక సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌సర్వీస్ కమిషన్‌ను రాష్ట్ర బీసీ కమిషన్ ఆదేశించింది.ఈ మేరకు పీఎస్సీ సభ్య కార్యదర్శికి బుధవారం కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎఈఈల నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్, జీఓ 124 కి మధ్య వ్యత్యాసం కనిపిస్తోందని తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె కుమారస్వామి ఫిర్యాదు మేరకు కమిషన్ ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే గెలుపు

● రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గెలుపు ఎప్పుడో ఖరారైందని, కాంగ్రెస్ నాయకులు ఎన్ని యాత్రలు చేసిన వారికి ఓటమి తప్పదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు రాష్ట్రంలో వినూత్న పథకాలను ప్రవేశపెట్టి ప్రశంసలు పొందుతున్నారని చెప్పారు. బుధవారం ఇక్కడ ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఇంటింటికి తాగునీరు అందించాలనే సంకల్పం కాంగ్రెస్ నాయకులకు కలలో కూడా రాని ఆలోచన అని, 60 ఏళ్లుగా వారు ఆ దిశలో ఆలోచించలేదని, కానీ, ప్రతి ఒక్కరు సురక్షిత నీరు తాగాలనే ఉద్దేశ్యంతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. నిర్దేశించిన గడువులోగానే ఈ పథకంద్వారా తాగునీరు అందిస్తామన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్‌లు, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, పంటలపెట్టుబడిగా రైతుకు రూ. 4 వేలు అందించడం, డబుల్ బెడ్ రూం తదితర పథకాలను జనం విశేషంగా ఆదరిస్తున్నారని, దీనికి బెంబేలెత్తిన కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్రలు కాదు ఇంకే యాత్రలు చేసిన ప్రయోజనం ఉండదని చెప్పారు. బస్సులో కూర్చున్న నాయకులలోని కలహాలే తమను విజయపథంలో నడిపిస్తాయని నిరంజన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బంద్‌కు విద్యార్థి సంఘాల మద్దతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను మార్చి 13న తలపెట్టిన 24 గంటల తెలంగాణ బంద్‌కు వివిధ విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. బంద్‌లో రాష్ట్ర వ్యాప్తంగా క్రియాశీలకంగా పని చేస్తామని విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటిలోని అతిధి గృహంలో వివిధ విద్యార్థి సంఘం నేతలతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సమావేశం అయ్యారు. 24 ఏళ్లుగా వర్గీకరణ సాధన కోసం జరుగుతున్న పోరాటంపై వివరించారు. ఎన్నో ఉద్యమాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటి వర్గీకరణ కోసం చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని విద్యార్థి సంఘాల నేతలు హాజరయ్యారు. బంద్ విజయవంతానికి విద్యార్థి సంఘాలతో మార్చి 7న సదస్సులు, 12న జిల్లా, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని తీర్మానించారు. 13న బంద్‌ను విజయవంతానికి అన్ని విద్యార్థి సంఘాలు జెండాలతో రోడ్లపైకి రావాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు నాయకులు కోట రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలు విదార్థి సంఘాల నాయకులు హాజరయ్యారు.

331 చెరువులు మంజూరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్‌కాకతీయ-4 పథకం కింద ఒకేరోజు 331చెరువులను మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వనపర్తి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సూర్యాపేట, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన మైనర్ ఇరిగేషన్ చెరువులు మంజూరుచేస్తూ బుధవారం 25జీవోలు జారీచేశారు.

ఎంసిహెచ్ఆర్డీలో ఈ -లెర్నింగ్ శిక్షణ

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు రెండో విడత ఈ లెర్నింగ్ శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బుధవారం ప్రారంభించారు. 12 మాడ్యూల్స్‌లో ఈ శిక్షణను ఉద్యోగులకు అందించి వారిని మరింత నిష్ణాతులను చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు ఏకె గోయల్ మాట్లాడుతూ అనేక అభివృద్ధి పథకాలు, పనులను జిల్లా, రాష్ట్ర, గ్రామ స్థాయికి చేర్చడంలో, అధికారులు ఈ పనుల్లో నిమగ్నం కావడంలో ఈ శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.
ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ సాంకేతికత కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.

రైతు సంక్షేమంపై చర్చిద్దాం

• కేసీఆర్‌కు బీజేపీ నేత లక్ష్మణ్ సవాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతు సంక్షేమం కోసం కేంద్రం తీసుకున్న చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సవాల్ విసిరారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావుతో కలిసి లక్ష్మణ్ మాట్లాడారు. నాలుగేళ్ళ పాలనలోని తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్ళించేందుకే సిఎం కెసిఆర్ తన హోదాను మరచి ప్రధాని పట్ల దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో అనేక హామీలిచ్చిన కెసిఆర్ వేటినీ అమలు చేయలేదని, ఇప్పుడు ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ఇప్పుడు రూ. 4 వేల పెట్టుబడి సాయం అంటూ రైతుల ఓట్లకు గాలం వెల్తున్నారని దుయ్యబట్టారు. నాలుగేళ్ళలో చేసిన దగా, మోసాలను ప్రశ్నించకుండా ఉండేందుకు, ప్రజల దృష్టిని మళ్ళించేందుకే చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం కోసం మోడీ ప్రభుత్వం ప్రధాని ఫసల్ భీమా యోజన, కిసాన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో వీటిని అమలు చేయడంలో కెసిఆర్ విఫలమయ్యారన్నారు.

అధికారంలోకి వస్తే నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని మాట తప్పింది ఎవరో ప్రజలకు కెసిఆర్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సాగుబడి లేక, దిగుబడి రాక పంట పెట్టుబడికి అప్పులు చేసిన రైతన్నలు చివరకు ఆత్మహత్యలకు పాల్పడినా కనులు తెరవని కెసిఆర్ కేంద్రంపై అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. పంట గిట్టుబాటు ధర అడిగిన రైతులకు బేడీలు వేయించిన ఘనతత కెసిఆర్‌దని దుయ్యబట్టారు. రాజకీయ ప్రచారం కోసం రైతు సమన్వయ సమితిలను వాడుకునేందుకు తెరలేపారన్నారు.

ఇప్పటి వరకు కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై అసెంబ్లీలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందుకు కెసిఆర్ సిద్ధం కావాలని సవాల్ విసిరారు. బిజెపి సిద్ధాంతకర్తలైన శ్యామాప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ లపై కెసిఆర్ అవగాహనారహితంగా మాట్లాడారన్నారు.

'ఇజ్తెమా' ఆదాయం రూ.70లక్షలు : రైల్వే జీఎం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఫిబ్రవరి 24నుంచి 26 వరకు ఔరంగాబాద్‌లో జరిగిన ఇజ్తెమాకు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే పరంగా విశేష సేవలందించినట్లు దక్షిణమధ్యరైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం రైల్ నిలయంలో ఇజ్తెమాకు అందించిన సేవలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు ఇజ్తెమా జరిగినప్పటికీ 22 నుంచే భక్తుల తాకిడి ఉందని పేర్కొన్నారు. ఆరురోజుల్లో రైల్వేకు రూ. 70 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. భక్తుల కోసం ఔరంగాబాద్ స్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, 30 మంది టికెట్ చెకింగ్ స్టాఫ్, 21 మంది బుకింగ్ క్లర్కులు , 75 మంది ఆర్‌పీఎఫ్ ఇన్స్‌పెక్టర్లు, కానిస్టేబుళ్లు, 45 మంది జీ ఆర్‌పీ ఇన్స్‌పెక్టర్లు, కానిస్టేబుళ్లు సేవలందించారని తెలియజేశారు. ఔరంగాబాద్ స్టేషన్‌లో వైద్య సేవలందించేందుకు డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బందిని నియమించామని, అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంచామని వినోద్‌కుమార్ వివరించారు. సేవలందించిన సిబ్బందిని ఆయన అభినందించారు. నాందేడ్ డివిజన్ పరిధిలో సిబ్బంది చేసిన సేవలను ఇజ్తెమా కార్యనిర్వాహక కమిటీ కూడా అభినందించినట్లు జీఎం తెలిపారు.

ఒలింపియాడ్స్‌లో నారాయణ హవా

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇండియాన్ నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్ రెండో దశ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు తమ హవా చాటుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి స్కూల్ స్థాయిలో ఒకే ఒక విద్యార్థి ఎంపిక కాగా అతను నారాయణ సంస్థలకు చెందిన వివి సాయి కీర్తన కావడం గర్వంగా ఉందని సంస్థల ఎండీ డాక్టర్ సింధూర నారాయణ తెలిపారు. దీంతోపాటు ఇండియాన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ రెండవ దశ ఫలితాల్లో సి యశ్వంత్‌రెడ్డి, జి సింధుజ, సిహెచ్ తనూజ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టాప్ మార్కులు సాధించారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లోనూ వి సాయి తేజ, ఎం ఆదర్శ్‌రెడ్డి మంచి మార్కులు సాధించారని తెలిపారు. వీరందరూ ముంబైలో జరిగే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌కు హాజరవుతారని తెలిపారు.

గ్రూప్-2 అవకతవకలపై న్యాయాధికారుల కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన గ్రూపు-2 ఉద్యోగాల నియామక ప్రక్రియలో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకలను పరిశీలించేందుకు హైకోర్టు ముగ్గురు న్యాయవాదులతో న్యాయాధికారుల కమిటీ నియమించింది. గ్రూపు2 సర్వీసు (సాధారణ పరీక్ష - 2017) పరీక్షకు హాజరైన మొదటి ఐదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను శని, ఆదివారాల్లో పరిశీలించాలని ఆ కమిటీని హైకోర్టు ఆదేశించింది. ఈ న్యాయాధికారుల కమిటీలో సీనియర్ న్యాయవాదులైన ఎస్.నిరంజన్ రెడ్డి, ఆర్.రఘునందన్ రావు, పి.శ్రీరఘురామ్‌ను సభ్యులుగా నియమిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్ రావు బుధవారం ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించారు. తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా వేశారు. ఈ మధ్యంతర ఉత్తర్వుల్లోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. గ్రూపు2 ఉద్యోగాల నియామక ప్రక్రియలో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకలను కనిపెట్టేందుకు పరీక్షకు హాజరైన మొదటి 5000 మంది అభ్యర్థుల ఓఎమ్మార్ షీట్లను కమిటీ పరిశీలిస్తుంది. ఓఎమ్మార్ షీట్లలో రెండు సార్లు/రాంగ్ డబ్లింగ్/వైట్నర్ వాడకం వంటి అంశాలను పరిశీలిస్తుంది. అలాగే ఎంపిక జాబితాలో వారి పేర్లను కూడా పరిశీలిస్తుంది. నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు, అక్రమాలను పరిశీలించే ప్రక్రియను న్యాయాధికారుల కమిటీ శీఘ్రగతిన పూర్తి చేయాలి. ప్రస్తుతం జెఎన్‌టీయూలో ఉన్న మొదటి ఐదువేల ఓఎమ్మార్ షీట్లను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి న్యాయాధికారుల కమిటీకి అందజేస్తారు. అలాగే న్యాయాధికారుల కమిటీ అడిగిన రికార్డులు/నివేదికలు/ఫైళ్లను అందజేస్తారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి న్యాయాధికారుల కమిటీకి అన్ని విధాలుగా సహకరిస్తారు.

ఉద్యమ ఆకాంక్షలు నేరవేరడంలేదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు అమలు కావడం లేదని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో పర్యటించిన ఆయన తెలుగు ఎన్నారైలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో కోదండరామ్ హాజరై మాట్లాడారు. ఎంతో కష్టపడి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంటే కొంత మంది స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగపడుతోందని ఆయన విమర్శించారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరకుండా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించలేదన్నారు.

ప్రతినెల 15వరకు రేషన్ పంపిణి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : జంట నగరాలలోని చౌక ధరల దుకాణాలు ప్రతి నెలా 1 వ తారీఖు నుంచి 15 వరకు ప్రజలకు అందుబాటులో ఉంచాలని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ (సీఆర్‌ఓ) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు మార్చి 1 నుంచి అమలులోకి వస్తాయి. శుక్రవారాలలో కూడా దుకాణాలు తెరచి ఉంచుతారని,సఆర్‌ఓ ఒక ప్రకటనలో తెలియజేశారు.

కోఠిలో భారీగా నగదు పట్టివేత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రాఫిక్ పోలీసుల తనిఖీలలో కోఠి మెడికల్ కాలేజీ సమీపంలో ఆటోలో పెద్ద మొత్తంలో తరలిస్తున్న డబ్బు సంచులను గుర్తించారు. నగదు తరలిస్తున్న ఆటో డ్రైవర్ ప్రకాశ్‌ను సుల్తాన్ బజార్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మొత్తం ఆరు సంచుల్లో రూ.12 లక్షల విలువచేసే కొత్త రూ.10 నోట్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నింబోలి అడ్డలో ఓ ఏజెంట్ నుంచి కమిషన్‌పై తీసుకుని వ్యాపారస్తులకు అధిక కమిషన్‌కు అందజేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో సదరు ఆటో డ్రైవర్ తెలిపాడు.

ఆర్‌బీ చౌదరి ఇంట్లో అనుమానాస్పద మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి ఇంట్లో పనిమనిషి కుమారుడు ఆత్మహత్య సంచలనం కలిగించింది. ఆయన ఇంట్లో పనిమనిషిగా చేస్తున్న ఆనంద్‌కుమార్ తనయుడు, చౌదరి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనంద్‌కుమార్ కొన్నేళ్లుగా ఆర్‌బీ చౌదరి ఇంట్లో పనిమనిషిగా చెస్తున్నాడు. ఆయనతో పాటు తన కుమారుడు కూడా అక్కడే ఉంటున్నాడు. అయితే బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటగదిలో ఆనంద్‌కుమార్ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపు అనంతరం వంటగదిలోకి వెళ్లిన కుటుంబసభ్యులు ఆత్మహత్య దృశ్యాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

మంటల్లో బెంజ్.. ఓఆర్ఆర్‌పై ప్రమాదం

మంటలు అంటుకుని భీమవరం వ్యక్తి మృతి

ఘట్‌కేసర్, ప్రభన్యూస్ : అతివేగంగా ప్రయాణిస్తున్న ఓ బెంజి కారు డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందాడు. అనంతరం కారుకు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం పట్టణానికి చెందిన వెగశ్న శ్రీరామరాజు(31) తన బెంజ్ కారులో వేగంగా ప్రయాణిస్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో కారు మూడు పల్టీలు కొట్టడంతో కారుకు నిప్పంటుకుంది. అది గమనించిన ఇతర వాహనదారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రగాయాలకు గురైన శ్రీరామరాజును చికిత్స నిమిత్తం నగరంలోని తులసీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. నిప్పంటుకున్న బెంజీ కారును ఫైరింజన్‌ను రప్పించి మంటలు అర్పించారు. కారు అప్పటికే పూర్తిగా ధ్వంసం అయినట్లు చెప్పారు. మృతుడు నగరంలో ఉన్న అతని సోదరుని కలసి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు భీమవరంలో వ్యాపారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రణవీర్‌రెడ్డి తెలిపారు.

హాల్‌టికెట్ ఇవ్వలేదని విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హాల్ టికెట్ ఇవ్వలేదని ఓ ఇంటర్ విద్యార్థి బలవన్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా నర్వ మండలం రాయికోడ్ గ్రామానికి చెందిన నవీన్ జిల్లాలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ దువుతున్నాడు. హాస్టల్ గదిలోనే ఉంటూ పరీక్షలకు సిద్ధమయ్యాడు. తన ప్రతిభను నిరూపించుకోవాలని ఎంతో ఆశగా ఇంటర్ పరీక్ష కోసం ఎదురుచూశాడు. తను అనుకుట్టుగానే ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తీరా పరీక్షలు రాసేందుకు రెడీ అయిన నవీన్‌కు కాలేజీ యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదు. హాల్ టికెట్ కోసం నవీన్ ఎంతో ప్రయత్నం చేశాడు. కానీ అది ఫలించలేదు. దీంతో మనస్తాపం చెందిన నవీన్ బలవన్మరణం చెందాడు. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు కారణం ఫీజుల భారమేనని, సదరు కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నవీన్ తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాప ఖరీదు రూ.15వేలు

కుల్కచర్ల, ప్రభ న్యూస్ : కన్న తండ్రే పసిపాప పాలిట శాపంగా మారిపోయాడు. ఆడపిల్ల పుట్టిందని అంగట్లో సరుకును చేసి, కేవలం రూ.15వేలకు విక్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. కులకచర్ల మండలానికి చెందిన గుడ్డిరుక్యా తండాకు చెందిన హస్లిబాయి రెండేళ్ల కింద రంగారెడ్డి జిల్లాకు చెందిన ఫరూఖ్‌నగర్ మండలం మొక్కగుట్ట తండాకు చెందిన కుమార్‌తో ప్రేమ వివాహం చేసుకుంది. పెళ్లైన ఏడాదికి మొదటిసంతానంగా ఆడపిల్ల పుట్టింది. మూడు నెలల కింద రెండో సంతానంగా మళ్లీ ఆడపిల్ల పుట్టింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తానని కుమార్ సొంత గ్రామానికి తీసుకువెళ్లాడు. స్థానిక ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించాడు. నాలుగు రోజుల తరువాత ఒక మార్వాడీని ఇంటికి పిలిచి తన మూడు నెలల పసికందును, రూ.15వేలకు అమ్మకానికి పెట్టాడు.ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు.

కొడంగల్‌లో మళ్లీ టెన్షన్

మహబూబ్‌నగర్ బ్యూరో, ప్రభన్యూస్ : కొడంగల్‌లో నెలకొన్న చిన్న వివాదం పెద్ద దుమారమే రేపుతోంది.. కాంగ్రెస్, పోలీసు వర్గాల మధ్య తోపులాటకు దారి తీసింది.. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణుల అరెస్టుకు దారి తీసింది. కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలంలో ఉన్న నందిగామ గ్రామంలో బీటీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఉదయం 9.30 గంటలకు జరగాల్సి ఉంది. దీనికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం నరేందర్‌రెడ్డి హాజరు కావాల్సి ఉంది. వారితో పాటు స్థానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా పాల్గొనాల్సి ఉంది. అయితే ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఉన్నందున తొమ్మిదిన్నరకే రేవంత్ తన అనుచరగణంతో అక్కడికి చేరుకున్నారు. ఉదయం పదకొండున్నర వరకు కూడా మంత్రులు రాలేదు. అయితే మంత్రులు వస్తారా .. లేదా తామే కార్యక్రమం ప్రారంభించాలా అని రేవంత్ పోలీసులను అడిగారు. దీంతో మరో పది నిమిషాల్లో మంత్రులు చేరుకుంటారని పోలీసులు సమాధానమిచ్చారు. అయితే పది నిమిషాల్లో కూడా మంత్రులు రాలేదు. దీంతో బీటీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమాన్ని సర్పంచ్, ఎంపీటీసీల చేత రేవంత్ ప్రారంభించారు.

చంచల్‌గూడకు పురుషోత్తంరెడ్డి

• ముగిసిన కస్టడీ • రిజిస్ట్రార్లకు ఏసీబీ లేఖలు • ఆరు రోజుల దర్యాప్తుపై అధ్యయనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్‌ఎండిఎ ప్రణాళికా విభాగం డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులపై దర్యాప్తును ఎసిబి మరింత వేగవంతం చేశారు. ఆరు రోజుల పాటు కస్టడీకి తీసుకున్న అధికారులు విచారణలో వెల్లడైన అంశాలను క్రోడీకరించుకునే పనిలో నిమగ్నమయ్యారు. కస్టడీ గడువు ముగియడంతోఆయనను బుధవారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆయనకు చంచల్‌గూడ జైలుకు తరలిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.మరో పక్క పురుషోత్తంరెడ్డికి మరిన్నిఆస్తులున్నాయన్న సమాచారంతో ఆయన పేరిట ఉన్న ఆస్తుల వివరాలను తెలియజేయాలంటూ రిజిస్ట్రార్లకు అధికారులు లేఖలు రాశారు. నగర శివార్లలో వందల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను కూడబెట్టిన పురుషోత్తంరెడ్డి అత్యంత పకడ్బంధీగా వాటిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎసిబి అనుమానిస్తోంది. దొరికింది స్వల్పమేనని, మరిన్ని ఆస్తులు ఉంటాయన్న నిర్ధారణకు వచ్చిన అధికారులు సమాచారం కోసం బాధితులు వచ్చి కలవచ్చని ప్రకటించారు. దీంతో సుమారు 15 మంది ఎసిబిని కలిసి పురుషోత్తంరెడ్డి వేధింపులు, ఫలితంగా కలిగిన నష్టం, ఎందుకు ఇబ్బందులను గురి చేశారనే అంశాలను తెలియజేశారు.మరోపక్క ఆరు రోజుల విచారణలో పురుషోత్తంరెడ్డి నుంచి రాబట్టిన సమాచారాన్ని ఎసిబి అధికారులు క్రోడీకరించుకునే పనిలో నిమగ్నమయ్యారు. విచారణలో తాజాగా మరో బినామీ వెలుగులోకి రావడంతో ఆయన కోసం గాలింపును తీవ్రం చేశారు. పురుషోత్తంరెడ్డి చెప్పిన అంశాలు ఎంత వరకు నిజమనే విషయాన్ని ద్రువీకరించుకునే పనిలో అధికారులున్నారు. అదే విధంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో పాటు గ్రామ పంచాయతీలు, కొన్ని నగర పాలికలకు కూడా లే అవుట్లు, రిజిస్ట్రేషన్లు, అనుమతులు, బిల్డర్ల అక్రమాలు, స్థానికుల ఫిర్యాదులపై సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

మరిన్ని సోదాలకు సన్నాహాలు

పురుషోత్తంరెడ్డి నుంచి రాబట్టిన సమాచారం, బాధితులు ఇచ్చిన ఫిర్యాదులలోని అంశాలు, ఫలితంగా వస్తున్న సమాచారం మేరకు త్వరలోనే మరిన్ని చోట్ల దాడులకు ఎసిబి సమాయాత్తమవుతోంది. ఇప్పటికే పట్టుబడ్డ బినామీలకు తోడుగా మరికొంత మంది కూడా ఉండి ఉంటారని ఎసిబి అనుమానాలను వ్యక్తం చేస్తోంది. మరికొంత సమాచారాన్ని రాబట్టిన అనంతరం దాడులను నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణ యూనిక్ చట్టంలోని... సెక్షన్ 4 అమానుషం

• కౌంటర్ దాఖలు చేయండి
• హోంశాఖకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం సవరించిన యూనిక్స్ చట్టంలోని సెక్షన్ 1(ఏ), సెక్షన్ 2, సెక్షన్ 4, సెక్షన్ 5 అత్యంత అమానుషమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆ చట్టంలోని సెక్షన్లను తాము కొట్టేయకముందే మీరు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ హోంశాఖ, సాంఘిక సంక్షేమ శాఖలను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. తెలంగాణ యూనిక్స్ చట్టం 1329ఎఫ్ అమలును నిలిపివేయాలని అభ్యర్థిస్తూ ట్రాన్స్ జెండర్ల(కొజ్జాల) సమాజ సంక్షేమం కోసం పనిచేస్తున్న సామాజిక కార్యకర్తలు వి.వసంత మొగ్లి, మరో ఇరువురు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సంగీతానికి నృత్యం చేసిన కొజ్జాలను ఎలాంటి వారంట్ లేకుండా అరెస్ట్ చేసి, రెండేళ్ల జైలు విధించే వెసులుబాటును సెక్షన్ 4 వల్ల లభిస్తుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన యూనక్ చట్టం పూర్తిగా ట్రాన్స్‌జెండర్లను అవమానించేలా, హక్కులను ఉల్లంఘించేలా ఉందన్నారు. అందువల్ల యూనక్స్ చట్టం అమలును నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. యూనక్స్ చట్టంలోని సెక్షన్4 ను ఎలా కొనసాగిస్తారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్ కుమార్‌ను ప్రశ్నించింది. సెక్షన్ 4 ను చదువడానికే అమానుషంగా ఉందని వ్యాఖ్యానించింది. ఆ సెక్షన్లను తాము కొట్టేయకముందే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ హోంశాఖ, సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

● ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిజాయితీ, నిబద్ధత, నిష్పాక్షికతతో విధులు నిర్వర్తిస్తూ మహిళల సమస్యల పరిష్కారంలో చొరవ కనబరుస్తూ శాంతి భద్రతలను పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ లో రెండవ బ్యాచ్‌లో తొమ్మిది నెలల పాటు కఠోర శిక్షణ పూర్తి చేసుకున్న 224 మంది మహిళా పోలీసు కానిస్టేబుల్స్ (సివిల్-144, ఏఆర్-80) పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళా పోలీసు కానిస్టేబుల్స్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇండోర్, అవుట్‌డోర్‌లో విభిన్న రీతిలో వారికి శిక్షణను ఇచ్చిన తీరును ఆయన ప్రస్తుతించారు. పోలీస్ శాఖ ఉద్యోగాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. తద్వారా పోలీసు శాఖలో మహిళల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న కాలంలో పోలీసు శాఖలో మరిన్ని పోస్టులు వచ్చే అవకాశం ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బలోపేతం, స్మార్ట్ అండ్ కమ్యూనిటీ పోలీసింగ్ దిశగా వారు అడుగులు వేసే విధంగా ఇండోర్, అవుట్‌డోర్‌లో శిక్షణనివ్వడం జరిగిందని అకాడమి డైరెక్టర్ జితేందర్ అన్నారు. ప్రస్తుత మహిళా కానిస్టేబుల్స్‌లో బీటెక్, ఎంటెక్ విద్యార్హత కలిగిన వారు కూడా ఉన్నారన్నారు. పరేడ్ అనంతరం బయటకు వచ్చిన మహిళా కానిస్టేబుల్స్ మీడియాతో ముచ్చటిస్తూ.. ఇందుకు తమ తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. మొదట్లో కొంత భయపడిన మాట వాస్తవమేనని, అలాంటి భయాందోళనలకు తావు లేకుండా ఈ తొమ్మిది నెలల కాలంలో తమ సార్‌లు తమకు శిక్షణనివ్వడమే కాకుండా తమలో ధైర్యాన్ని పాదుకొల్పారన్నారు.

ప్రభుత్వంపై విషం కక్కేందుకే బస్సు యాత్ర



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బస్సు యాత్ర తుస్సుమందని, ప్రజాస్పం దన లేదని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై విషం కక్కేందుకే ఈ యాత్ర ఏర్పాటుచేశారన్నారు. అవమానపడి అలిగిన ఆ పార్టీ ఇన్‌ఛార్జి కుంతియాను అడిగినా, పిలవని పేరంటానికి ఎలా వెళ్తానని చెప్పిన డికె అరుణను అడిగినా బస్సుయాత్ర భాగోతం చెబుతారన్నారు. గత ఎన్నికల్లో రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పినా ప్రజలు నమ్మలేదన్నారు. తెలంగాణలో ఆ రెండు పార్టీలకు స్థానం లేదని, ప్రజలంతా టిఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. బిజెపి నాయకులు కల్లుతాగిన కోతుల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రౌడీ రాజకీయాలు కాంగ్రెస్‌కు అలవాటేనని, అందుకే రైతు సమన్వయసమితులు రౌడీ సమితులుగా కనిపిస్తున్నాయన్నారు.

ఉత్తమ్‌వి ఉత్త ప్రగల్భాలు: టిఆర్ఎస్ ధ్వజం

సిఎం కెసిఆర్‌పై సంస్కారహీనంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు రైతులు తగిన సమయంలో గుణపాఠం నేర్పుతారని టిఆర్ఎస్ ఎమ్మెల్సీలు అన్నారు. టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డితో పాటు విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, భూపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రజలు ఛీ కొట్టినా కాంగ్రెస్‌నాయకులకు బుద్ధిరాలే దన్నారు. రైతులను రౌడీలని కించపరిచిన కాంగ్రెస్ నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి భూకబ్జాకోరు అని, అవినీతి కాంగ్రెస్ పాలనలో మంత్రులు.. అధికా రులు జైలుకెళ్ళారన్నారు.

ఈ సారి మాదే అధికారం
లేదంటే తప్పుకుంటా



- రాష్ట్రంలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు
- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

జహీరాబాద్/నారాయణఖేడ్, ప్రభ న్యూస్ : 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో ప్రధాని రాహుల్ కావడం ఖాయమని, ఇలా జరగని పక్షంలో రాజకీయాల నుంచి తప్పుకుంటానని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రతో కేసీఆర్ గుండెల్లో గుబులు పుట్టుకొచ్చిందన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలో జెజె గార్డెన్ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే గీతారెడ్డి అధ్యక్షతన ప్రజా చైతన్య యాత్ర సభ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అజారుద్దీన్, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, సీనియర్ నాయకులు వీహెచ్ హనుమంతరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, షబ్బీర్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నాగేందర్, అంజన్‌కుమార్ యాదవ్, తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం నారాయణఖేడ్‌లో కూడా ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని, ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదని అన్నారు.

రాష్ట్రం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు గడిచిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటలను నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇది ప్రజలు గుర్తించాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానన్న కేసీఆర్ రైతు ఆత్మహత్యల రాష్ట్రంగా మార్చారన్నారు. తెలంగాణలో రోజు రోజుకు రైతుల ఆత్మహత్యలను పెరుగుతున్నాయన్నారు. అయినా కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం వారి ప్రయోజనాల కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. కేసీఆర్ తన మాటల గారడీతో ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ ప్రగల్భాలను నమ్మే స్థితిలో లేరన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియమ్మ ఇస్తే ఇక్కడ కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకు తింటుందోన్నారు. రాష్ట్రంలో పాలన నాలుగు స్తంభాల ఆటల నలుగురి చేతిలోనే ఉందన్నారు. కుటుంబ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారన్నారు. తాను ముఖ్యమంత్రినైనా మూడు నెలల్లో మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ మూడున్నర ఏళ్ల పాలన గడిచిన మైనార్టీలకు రిజర్వే షన్లు కల్పించలేదన్నారు. ఇండ్లు లేని నిరుపేదలందరికి రెండు పడకల ఇంటిని నిర్మించి ఇస్తామన్న కేసీఆర్ ఇప్పటి వరకు ఎన్ని ఇండ్లు కట్టించి ఇచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడం, పెద్ద పెద్ద మాటలు చెప్పడమే తప్ప చేతల్లో మాత్రం చూపించడం లేదన్నారు. జహీరాబాద్ ప్రాంతం కాంగ్రెస్ పార్టీతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అందుకే జహీరాబాద్ నియోజకవర్గం ఎల్లప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో దివంగత నేత భాగారెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు.

గజ్వేల్ నుండి జహీరాబాద్ నియోజకవర్గానికి వచ్చిన గీతారెడ్డి జహీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచారన్నారు. తాను మొదటి సారిగా ఎన్నికైనప్పుడే జహీరాబాద్ నియోజకవర్గంలో హోటల్ మేనేజ్‌మెంట్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, నిమ్జ్ వంటి అనేక ప్రాజెక్టులు ఆమె తీసుకొచ్చారన్నారు. అదే కాకుండా మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ కూడ ఆమె కృషినేనన్నారు. ఎప్పటిలాగే 2019 సంవత్సరంలో కూడ జహీరాబాద్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారన్నారు. 2019 సంవత్సరంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మంకాల్ సుభాష్, పట్టణ, ఝరాసంఘం, జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్ మండలాల పార్టీ అధ్యక్షులు కండెం నర్సింహులు, హనుమంతరావు పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచలింగారెడ్డి, బసంత్‌పూర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు తాహెరాబేగం, సుజాత, జహంగీర్, శేఖర్, నారాయణరెడ్డి, లక్ష్మి, పుణ్యమ్మ, నాయకులు శీల రమేష్, జాఫర్, శ్రీకాంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొత్తులు ఉంటాయ్



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. కార్యకర్తల కేరింతల మధ్య దాదాపు గంటకుపైగా ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో పొత్తుకు రెండు పార్టీలు ఉన్నాయని, ఇందులో ఒకటి విభజన చేసిందనీ, మరొకటి విభజన కోసం పోరాడిందని ఆయన గుర్తుచేశారు. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్న దానిపై పార్టీ నేతలతో చర్చించి సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఏ రాజకీయ పార్టీతో విభేదించవద్దని, పార్టీ అధిష్టానమే పొత్తుల విషయంలో తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టంచేశారు. పార్టీ బల సమీకరణతోనే పోటీ ఉంటుందని, కార్యకర్తలను కాపాడుకుంటూ బలమైన శక్తిగా తయారు చేస్తామని ఆయన అన్నారు. కార్యకర్తలకు న్యాయం జరిగే రీతిలోనే నిర్ణయం తీసుకుంటామని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో ఉంటూ పార్టీని పటిష్టపరచాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రెండు ప్రాంతాల్లో పార్టీని కాపాడుతూ కార్యకర్తలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఇకనుంచి నెలకోసారి వచ్చి కార్యకర్తలను కలుస్తానని, పార్టీలో మీ పనితీరును కూడా సమీక్షిస్తానని ఆయన అన్నారు. కొత్త రాష్ట్రంలో పని ఒత్తిడితో రాలేకపోతున్నానని, భవిష్యత్తులో మీకోసం తగిన సమయం ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కొందరు నాయకులు పార్టీని వీడిపోయినా కార్య కర్తలు క్రమశిక్షణ, అంకితభావంతో జెండా మోస్తున్నారని, అలాంటి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ప్రజల కోసం పోరాడినా, తప్పుడు కేసులు పెట్టినా వాటిని ఎదుర్కొంటూ ఉద్యమిస్తే ప్రజలు మనతోనే ఉంటారని ధైర్యం నూరిపోశారు. పార్టీ ఇస్తున్న కార్యక్రమాలను కార్యకర్తలు సమర్థంగా అమలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో కార్యకర్తల సమర్థత, పనితీరు సమీక్షించి వారికి తగిన విధంగా గుర్తింపు ఇస్తామని చంద్రబాబు అన్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతోందని, ఇంకా శక్తిని పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీనుంచి బయటకు వెళ్ళిన వారు మళ్ళీ వెనక్కి వస్తే స్వాగతిస్తామని ఆయన స్పష్టంచేశారు.

ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని పార్టీలు రోడ్లపైకి వచ్చాయని, పార్టీ కార్యకర్తలు కూడా క్రియాశీలకం కావాలని చంద్రబాబు సూచించారు. రాజకీయాల్లో ఉద్వేగాలు పనిచేయవని, వాస్తవిక దృక్పథంతో ఆలోచించి నందునే తనకు 40 ఏళ్ళుగా రాజకీయాల్లో గౌరవం దక్కిందని అన్నారు. పార్టీని విలీనం చేయాలన్న వాదనను ఒక కార్యకర్త ప్రస్తావించగా, పార్టీని విలీనం చేస్తామని మాట్లాడే అధికారం, స్వేచ్ఛ ఎవరికీ లేదని అన్నారు. పార్టీ శాశ్వతంగా ఉంటుందని, ఒకరిద్దరు కుప్పిగంతులు వేసినంత మాత్రాన నష్టమేమీ జరగదని అన్నారు. గత ఎన్నికల్లో పార్టీకి 22 శాతం ఓటు బ్యాంకు ఉన్నట్లు తేలిందని, నిగూఢంగా ఉన్న ఆ బలాన్ని వచ్చే ఎన్నికల నాటికి పెంచుకోవాలని చెప్పారు. పార్టీకి బలమైన నియోకవర్గాలు ఉన్నాయని, ప్రజా మద్దతు ఎప్పటికీ ఉంటుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

రాజకీయాల్లో వ్యూహాలు ఉంటాయని, ఎన్నికల ముందు నిర్దిష్టమైన ఆలోచనలతో అడుగులు వేస్తామని చంద్రబాబు చెప్పారు. తెలంగాణ పార్టీలోకి బ్రాహ్మణి, బాలకృష్ణ, జూనియర్ ఎన్‌టిఆర్‌ను తీసుకురావాలని ఒక కార్యకర్త చేసిన డిమాండ్‌కు స్పందిస్తూ, మా కుటుంబం నుంచేనాయకులు రావాలా అని ప్రశ్నించారు. 35 ఏళ్ళుగా జెండాను మోస్తున్న మీరు నాయకులు కాదా, పార్టీని నడిపించలేరా అని అన్నారు. రాజకీయాల్లో నాయకత్వం ముఖ్యమనీ, అందుకు తగ్గట్టుగా వ్యూహం ఉంటుందని అన్నారు. దేనికైనా నాయకుడు కావాలని, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలను త్వరలో నియమిస్తామని చెప్పారు. పార్టీలో కదలిక వచ్చిందని, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. వచ్చే ఎన్నికల్లో ఎన్నికల వ్యూహాలు, పొత్తులను దృష్టిలో ఉంచుకుని ఏ పార్టీతో విభేదాలు పెట్టుకోవద్దని చంద్రబాబు కార్యకర్తలకు సూచించారు.



కేంద్రమంత్రి సుజనా చౌదరి కుమార్తె నిశ్చితార్థానికి హాజరైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ హోంమంత్రి నాయిని తదితరులు

ఎన్టీఆర్ భవన్‌లో కోలాహలం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశంపార్టీ తెలంగాణ విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన కార్యకర్తలతో ఎన్‌టిఆర్ భవన్‌లో పండుగ వాతావరణం సంతరించుకుంది. గత రెండేళ్ళుగా స్తబ్దుగా ఉన్న ఎన్‌టిఆర్ భవన్ బుధవారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి పెద్దఎత్తున తరలిరావడం తో కోలాహలంగా మారింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈ సమావేశంలో పాల్గొంటున్నారని తెలియగానే కార్యకర్తలు స్వచ్ఛం దంగా తరలివచ్చారు. కార్యకర్తలను ఉద్దేశించి చంద్ర బాబు ప్రసంగిస్తుండగా, కొందరు అడ్డుతగిలి ప్రశ్నలు సంధించారు. వారిని సముదాయించేందుకు చంద్ర బాబు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారిని మాట్లాడేందుకు అనుమతించారు. తెలంగాణలో పార్టీని నడిపించేందుకు నాయకులు కరవయ్యారని, ఈ నేపథ్యంలో బ్రాహ్మణి, బాలకృష్ణ, జూనియర్ ఎన్‌టిఆర్‌లలో ఒకరిని తమ నాయకుడిగా పంపించాలని కొడంగల్‌కు చెందిన అచ్యుత్‌రెడ్డి కోరారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ, మా కుటుంబం నుంచే మీకు నాయకులు రావాలా, మీలో నాయకత్వ లక్షణాలు లేవా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర పార్టీ నాయకులు తమను పట్టించుకోవడం లేదని, జిల్లాలకు ఎవరూ రావడం లేదంటూ హుజురాబాద్‌కు చెందిన తిరుపతిరెడ్డి ఆరోపించారు. జిల్లాల్లో పర్యటించాలని నాయకులకు మొర పెట్టుకున్నా వారి నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని, ఈ పరిస్థితుల్లో పార్టీని బలోపేతం చేయడం కష్టంగా మారుతోందని తిరుపతిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ, త్వరలోనే జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను నియమిస్తామని చెప్పారు.

టిఎస్ఎన్‌వికి చెందిన సుభాషిణి మాట్లాడుతూ, ఎన్నికల్లో తెరాసతో పొత్తు వద్దని డిమాండ్ చేశారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ, ఏ పార్టీతో విభేదాలు పెట్టుకోవద్దని సూచించారు. పార్టీని విలీనం చేస్తామంటూ ప్రకటన చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్మూరుకు చెందిన పోల సుధాకర్ డిమాండ్ చేశారు. పార్టీని విలీనం చేస్తామనే అధికారం ఎవరికీ లేదని, అలా మాట్లాడడం పార్టీకి వ్యతిరేకమని చంద్రబాబు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక పార్టీతో పొత్తు ఉంటుందని స్పష్టంచేసిన చంద్రబాబు కార్యకర్తలకు భవిష్యత్తుపై భరోసా ఇచ్చారు. అయితే బలీనమైన శక్తిగా పార్టీ ఎదిగితే కార్యకర్తల భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని, అందుకు తగ్గట్టుగా ప్రజలతో మమేకమై ఉండాలని కార్యకర్తలకు ఆయన సూచించారు.

లక్ష మందితో మహానాడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టి రామారావు జయంతి రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా జరుపుకునే మహానాడును లక్ష మంది ప్రతినిధులతో బహిరంగ సభ తరహాలోనే ఘనంగా నిర్వహించాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ నిర్ణయించింది. వచ్చే శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉత్తర, దక్షిణ తెలంగాణలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అధ్యక్షతన పొలిట్‌బ్యూరో, జాతీయ పార్టీ కమిటీ తెలంగాణ సభ్యు లతో బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోకవర్గ ఇన్‌ఛార్జిలను ఎంపికచేయాలని చంద్రబాబు తెదేపా తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణకు సూచించారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను సమీక్షిస్తూ కార్యకర్తలను భాగస్వాములను చేయాలని చెప్పారు.

తెదేపాలో మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

మహబూబాబాద్ నియోజకవర్గానికి సిపిఐ శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన బండి పుల్లయ్య తన అనుచరులతో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు జనగాంకు చెందిన కప్పుల నాగిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు గజ్జెల ఆనంద్ కూడా తెదేపాలో చేరారు. తెలుగుదేశం కండువాలు కప్పి చంద్రబాబు వీరిని పార్టీలోకి ఆహ్వానించారు.

బంగారు తెలంగాణకు బాటలు వేయాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషనర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బాధ్యత స్వీకరణ సభలో మంత్రులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఎస్సీ, ఎస్టీలకు చేరేలా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చూడాలని మంత్రులు కోరారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు బీసీ, మైనారిటీ వర్గాలకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రులు తెలిపారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ రవీంద్రభారతిలో బాధ్యతలు చేపట్టారు. ఈ సభలో ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి, హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి టి హరీష్ రావు, విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయసులోనే ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు పెద్ద బాధ్యతను ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అప్పగించారని కడియం శ్రీహరి అన్నారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు జ్యుషిడియల్ అధికారాలు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సంక్షేమంపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఏమి చేస్తే బాగుంటుందో అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచించాలన్నారు. కమిషన్ చైర్మన్‌గా ఉన్న బాధ్యతలను బాగా నిర్వర్తించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి ఉద్యమంలో దశాబ్ద కాలం పాటు ఎర్రోళ్ల శ్రీనివాస్ పనిచేశారని మంత్రి హరీష్‌రావు గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. సీఎం ఆశయాలను కొనసాగిస్తూ బంగారు తెలంగాణ సాధన దిశలో బాటలు వేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 85 శాతంకు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉంటారని వారి కళ్లల్లో చిరునవ్వు చూడాలని ఉద్యమ సమయంలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు చెప్పారని మంత్రి జగదీష్‌రెడ్డి తెలిపారు. దానిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిజం చేయాలని ఆభిలషించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే స్పందిస్తానని తెలిపారు. సమస్య ఉంటే తమకు సమాచారం అందించాలని 2, 3 గంటల్లోనే స్పందిస్తామని భరోసా ఇచ్చారు. కష్టపడి పనిచేసి సీఎం కేసీఆర్‌కు మంచిపేరు తెస్తామన్నారు.





చీమకుర్తిలో ఆవిష్కరించిన స్థూపం

జగన్ పాదయాత్రకు 100 రోజులు

ఒంగోలు, ప్రభన్యూస్‌బ్యూరో: జగన్ పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా చీమకుర్తిలో బుధవారం స్థూపం ఆవిష్కరించారు. 2వ తేదీ నుంచి ప్రకాశం జిల్లాలోని దర్శి, అద్దంకి, చీరాల, పర్చూరు నియోజకవర్గాలలో జగన్ పాదయాత్ర చేయనున్నారు. జిల్లాలో గిద్దలూరు, యర్రగొండపాలెం, ఒంగోలు నియోజకవర్గాల మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలలో జగన్ పాదయాత్ర నిర్వహించినట్లు అవుతుంది. మొత్తం మీద ప్రకాశం జిల్లాలో తన ప్రజా సంకల్ప యాత్ర 100వ రోజు పూర్తి చేసుకున్న జగన్ మరో 15 రోజులు ఇక్కడే ఉండే అవకాశం కనిపిస్తుంది.

అభివృద్ధి అంటే ఇదేనా..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తిరోగమనానికి, పురోగమనానికి తేడా తెలియడం లేదన్నారు. నాలుగేళ్ల పాలనలో రైతులు ముందడుగు వేశారో లేక అప్పుల పాలయ్యారో సూటిగా చెప్పాలన్నారు. మహిళలకు భద్రత ఉందా అని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు దొరక్క ప్రక్క రాష్ట్రాలకు వలస పోతున్నది నిజం కాదా సమాధానం చెప్పాలన్నారు. రాజధానిలో ఇష్టారీతిన భూములు లాక్కొని ఇష్టం వచ్చిన విధంగా నచ్చిన వ్యక్తులకు పంపిణీ చేసిన చంద్రబాబు పేదలకు ఒక్క ఎకరా అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. విదేశాలలో జగన్ గురించి మాట్లాడటం లేదని, ప్రపంచ చరిత్రలో నల్లధనంతో దొరికిన ఏకైక ముఖ్యమంత్రిగా చంద్రబాబు గురించి అసహ్యంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. నీ వీపు నీకు కనపడటం లేదా బాబూ అని ప్రశ్నించారు.

పది నెలల్లో ప్రభుత్వ ఆదాయం
రూ.66 వేల కోట్లు

- జనవరి నెల వరకు రూ.87వేల కోట్లను ఖర్చు చేసిన సర్కార్
- పన్నుల ద్వారా ఆదాయం రూ. 56,348కోట్లు
- ప్రభుత్వ గ్రాంట్లు రూ.6,486 కోట్లు
- ఎక్సైజ్ ద్వారా సాధించిన ఆదాయం రూ.2,918 కోట్లు
- ఆదాయ వ్యయాలపై కాగ్ నివేదిక విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.87వేల కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2017 - 18 ఆర్థిక సంవత్సరానికిగానూ జనవరి నెల వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, ఖర్చులకు సంబంధించిన వివరాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఏజీ) విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పది నెలల కాలానికిగానూ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.66,116 కోట్ల ఆదాయం వచ్చినట్టు ఆ నివేదికలో పేర్కొంది. ఇందులో పన్నుల రూపేణా వచ్చిన ఆదాయం రూ.56,348 కోట్లు కాగా, పన్నేతర ఆదాయం ద్వారా రూ.3,281 కోట్లు వచ్చినట్టు ఈ నివేదిక చెబుతోంది. గ్రాంట్ల రూపంలో ప్రభుత్వానికి రూ.6,486 కోట్లు వచ్చాయి. పన్నుల ఆదాయంలో అమ్మకం పన్ను ద్వారా రూ.20,882 కోట్లు రాగా, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.3,331 కోట్లు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.7,918 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. మొత్తం రూ.66,116 కోట్ల ఆదాయంతో పాటు 24,214 కోట్ల రూపాయల అప్పులు కలుపుకుని జనవరి నెలాఖరు వరకు రూ.90,330 కోట్లు సమకూరినట్టు కాగ్ నివేదిక స్పష్టంచేసింది. ఇందులో రూ.87,565 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసినట్టు తెలిపింది. ఇందులో రూ.69,759 కోట్లు రెవెన్యూ వ్యయం కాగా, మూలధన వ్యయం రూ.17,805 కోట్లుగా కాగ్ తేల్చింది.

మొత్తంగా రాష్ట్రప్రభుత్వానికి ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి మాసాంతం వరకు పది మాసాల కాలంలో రూ.66వేల కోట్ల ఆదాయం వచ్చినట్లయింది. జనవరి నెల వరకు రూ.87వేల కోట్లను ప్రభుత్వం వివిధ పనుల నిమిత్తం ఖర్చుపెట్టింది.



ఆరాధ్య దేవతకు అశ్రునివాళి..

అభిమానుల ఆరాధ్య దేవత.. అతిలోక సుందరి..శ్రీదేవి.. అశ్రునయనాల మధ్య తిరిగిరాని లోకాలకు తరలిపోయింది. మానవా ఇక సెలవ్ అంటూ దేవకన్యలా ముస్తాబై వెళ్లిపోయింది... అశేష జనవాహినిని అర్ధశతాబ్దం పాటు అలరించి, ఎన్నెన్నో మరుపురాని పాత్రల్లో జీవించి మెప్పించిన లెజెండరీ యాక్టర్ శ్రీదేవి మానవలోకానికి సెలవంటూ దివికేగింది.ముంబయ్‌లోని శ్రీదేవి నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభం కావడానికి ముందు శ్రీదేవి పార్థివదేహంపై జాతీయ జెండాను ఉంచి, ప్రభుత్వ లాంఛనా లతో సత్కరించారు. శ్రీదేవికి ఎంతో ఇష్టమైన ఎరుపు రంగు చీరలో అలంకరించి ఇదే 'శ్రీదేవి చివరి సంతకం'గా సంబోధి స్తూ ఫోటోను విడుదల చేశారు.

● జనసంద్రమైన ముంబయ్ ● శ్రీదేవి కడచూపుకు తరలివచ్చిన తారాలోకం
● ఎరుపు చీర'శ్రీదేవి చివరి సంతకం' ● ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ముంబయ్ : శ్రీదేవిని కడసారి వీక్షించేందుకు భారతీయ చిత్రపరిశ్రమ ముంబయ్‌కి క్యూకట్టింది. అంతిమ వీడ్కోలు పలికేందుకు అశేష జనవాహిని అశ్రునయనాలతో శ్రీదేవి పార్థివదేహం వెంటే కదిలింది. అమ్మ రాజీనామా సినిమా కోసం సిరివెన్నెల సీతారామ శాస్త్రి రాసిన పాట పల్లవిలోని 'దేవతా తరలిపో... వదలలేక వదలలేక గుండె రాయి చేసుకుని' అన్నట్లుగా అభిమానులు, చిత్ర పరిశ్రమ కలిసి ఆమెను సాగనంపలేక అతి కష్టమ్మీద వీడ్కోలు పలికారు. అంతిమ యాత్రకు ముందు శ్రీదేవి పార్థివదేహాన్ని బుధవారం ఉదయం 9.30 సమయం లో అభిమానుల సందర్శనార్థం శ్రీదేవి ఇంటికి సమీపంలోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఉంచారు. మధ్యాహ్నం 12.30 వరక ు అభిమానులను అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ నుంచి ముంబయ్‌లోని విల్లేపార్లే హిందూ శ్మశానవాటిక వరకు మొత్తం 7 కిలోమీటర్ల మేరకు అతిలోకసుందరి అంతిమయాత్ర సాగింది. అంతిమయాత్ర వాహనంలో బోనీకపూర్, బోనీ తొలి భార్య మోనా కపూర్ కుమారుడు అర్జున్ కపూర్, మేనల్లుడు మోహిత్ మార్వా తదితరులు ఉన్నారు.భర్త బోనీ కపూర్.. శ్రీదేవి చితికి నిప్పు అంటించారు. అంత్యక్రియల సమయంలో శ్రీదేవి కూతుళ్లు జాహ్నవీ, కుషీలు అక్కడే ఉన్నారు. అంతిమయాత్రకు ఉపయోగించే వాహనం మొత్తం మల్లెపూలు, లిల్లీపూలతో అలంకరించారు. అంతిమయాత్రకు ముందు ఆమెకు ఎంతో ఇష్టమైన ఎరుపు రంగు కంచిపట్టు చీర, ఏడువారాల నగలతో నిండు ముత్తైదువులాగా అలంకరించారు. శ్రీదేవిని చివరిసారిగా చూసేందుకు అశేష జనం తరలిరావడంతో శ్మశానవాటిక వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు విలే పార్లే సేవా సమాజ్ పవన్ హాన్స్ హిందూ స్మశానవాటిక వద్దకు చేరింది. హిందూ ఆచారాలతో అనిల్ కపూర్, అర్జున్‌కపూర్, ఇతర కుటుంబసభ్యులు శ్రీదేవి భౌతిక కాయాన్ని శ్మశానవాటికలోకి తరలించారు. శ్మశాన వాటికలో శ్రీదేవిని కడసారి చూసేందుకు అభిమానులు ప్రయత్నించారు. అయితే శ్మశానవాటికలోకి సాధారణ జనాన్ని లోనికి అనుమతించలేదు. కేవలం ప్రము ఖులను మాత్రమే లోనికి పంపించారు. మహారాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి.



తరలివచ్చిన తారాలోకం


శ్రీదేవిని కడసారి చూసేందుకు బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ సినీ ప్రముఖులు తరలివచ్చారు. మెగాస్టార్ చిరంజీవి, హీరో వెంకటేష్‌లతో పాటు మరికొంత మంది సినీ ప్రముఖులు శ్రీదేవికి తుదివీడ్కోలు పలికారు. అతిలోక సుందరి శ్రీదేవికి బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, శాండిల్‌వుడ్ ప్రముఖులంతా కన్నీటి నివాళులర్పిం చారు. రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, ఐశ్వర్యారాయ్, సుస్మితాసేన్, మాధురీదీక్షిత్, కాజోల్, టబు, జయప్రద, హేమమాలిని, ఇషాడియోల్, ప్రభు, ఫరాఖాన్, సోనా ల్ చౌహాన్, అనూ కపూర్, అక్షయ్‌ఖన్నా, అజయ్‌దేవగన్, సంజయ్ లీలా బన్సాలీ, సారా అలీఖాన్, జాక్వలైన్ ఫెర్నాండెజ్, రితేష్ దేశ్‌ముఖ్, అర్బాజ్‌ఖాన్, కరణ్ జోహార్, సుభాష్‌ఘాయ్‌లతో పాటు రాజకీయ, పారిశ్రామికరంగాలకు చెందిన ప్రముఖులు శ్రీదేవి ఇంటికి వచ్చి ఆమెకు అశ్రునివాళి అర్పించారు.



కంటతడి పెట్టించిన వర్మ ట్వీట్



అంతిమయాత్ర జరుగుతుండగానే శ్రీదేవి గురించి దర్శకుడు రాంగోపాల్‌వర్మ కంటతడి పెట్టించేలా ట్వీట్ చేశారు. థియేటర్స్‌లో శ్రీదేవి అద్భుతమైన ఎనర్జీతో చేసే డ్యాన్స్‌ను, యాక్టింగ్‌ను చూసేందుకు జనం అలా కూర్చుండిపోయేవారు. అలాగే ఇప్పుడు కూడా ఆమె చుట్టూ జనం ఉన్నారు. కానీ కన్నీళ్లతో పగిలిన హృద యాలతో అంటూ వర్మ ట్వీట్‌లో పేర్కొన్నారు.



శ్రీదేవిని కడసారి చూడలేకపోతున్నందుకు బాధగా ఉంది : ప్రీతి జింటా

సినీ నటి శ్రీదేవిని కడసారి చూసేందుకు రాలేకపోతున్నందుకు తాను చాలా బాధపడుతున్నానని ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. తాను రాలేకపోవడానికి గల కారణాన్ని ఈ పోస్ట్‌లో చెప్పింది. నా చిన్ననాటి జీవితంలో భాగమైన, మై ఐకాన్ శ్రీదేవి వెళ్లిపోతోంది.. కాలి బూడిదకాబోతోంది. కళ్లు మూసుకుంటే.. హహహవాయి నన్ను చూసి చిరునవ్వులు చిందిస్తోంది. ఆమె ఎప్పటికీ నా మనసులో ఉంటుంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా.. ఆమెకు గుడ్‌బై చెప్పలేకపోతున్నందుకు చాలా బాధపడుతున్నాను. శ్రీదేవి మరణంపై మీడియా చేస్తున్న సర్కస్ చూసి.. ఇంతలా దిగజారిపోతున్న వారిని చూసి కోపం, బాధ తన్నుకువస్తోంది. శ్రీదేవి ఎప్పటికీ ధ్రువతారే.. ఆమె ఎప్పటికీ నా హహహవాయినే.. ఐ లవ్ యూ శ్రీదేవి అని ప్రీతిజింటా ఆవేదన వ్యక్తం చేసింది.

మానాన్న తర్వాత నన్నంత బాధించింది శ్రీదేవి మరణమే : రాణి ముఖర్జీ



శ్రీదేవికి కన్నీడ వీడ్కోలు తెలిపే క్రమంలో సినీ తారలు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. శ్రీదేవికి మృతి పై బాలీవుడ్ నటి రాణి ముఖర్జీ నివాళులర్పిస్తూ.. ''మా నాన్న మరణం తర్వాత నన్నంతగా బాధించింది శ్రీదేవి మరణమే. ఈ వార్త విన్నప్పటి నుంచి ఆమె ముఖమే పదేపదే నాకు గుర్తొస్తోంది. తను నన్నెంతో ప్రేమగా చూసేది. నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన వ్యక్తిత్వం ఆమెది. నేను తనను చిన్నమ్మ (మౌసీ)లా భావిస్తాను''అని కన్నీళ్ల పర్యంతమైంది.

సొమ్మసిల్లి పడిపోయిన శ్రీదేవి పిన్ని

అందాల నటి శ్రీదేవి అకాల మరణాన్ని ఆమె కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. శ్రీదేవిని చిన్నప్పటి నుంచి తన చేతిలో ఎత్తుకుని పెంచిన ఆమె పిన్ని అనసూయమ్మకు ఏడుపు ఆగలేదు. రెండురోజులుగా పచ్చి మంచినీరు కూడా ముట్టకుండా బోరున విలపిస్తూనే ఇంట్లో కూర్చుండి పోయింది. కుటుంబ సభ్యులు ఆమెను ఎంత ఓదార్చినా ఏడుపు అపుకోవడం ఆమెవల్ల కావడం లేదు. అలా ఏడ్చిఏడ్చి నీరసించిపోయి చివరకు సొమ్మసిల్లి పడిపోయింది.

బోనీతో పెళ్లికి శ్రీదేవి తల్లి ఒప్పుకోలేదు : వేణుగోపాల్

శ్రీదేవి హఠాత్మరణంతో ఆమె వ్యక్తిగత విషయాలను కూడా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. శ్రీదేవి పెళ్లి గురించి ఆమె చిన్నాన్న వేణుగోపాల్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. బోనికపూర్ తో శ్రీదేవి పెళ్లికి శ్రీదేవి తల్లి ఒప్పుకోలేదట.! కానీ ముందే వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారని ఒత్తిడి చేయడంతో అనివార్య పరిస్థితుల్లో ఒప్పుకున్నారని వేణుగోపాల్ తెలిపారు.

హేమమాలిని భావోద్వేగం



శ్రీదేవి హఠాత్మరణ వార్త విని బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని భావోద్వేగానికి లోనయ్యారు. 'మరణంలోనూ నిర్మలంగా ఎరుపు చీరలో చాలా అం దంగా కనిపిస్తూ శ్రీదేవి పవళిస్తోంది. అది ఆమెకు ఉన్న తేజస్సు.. ఆమె నటించిన చిత్రా ల మ్యాజిక్.. గుడ్‌బై మై డియర్ ఫ్రెండ్' అని హేమమాలిని ట్వీట్ చేశారు.



శ్రీదేవి కూతుర్ల బాధ్యత నాదే: సోనమ్ కపూర్

శ్రీదేవి హఠాత్మరణంతో ఆమె ఇద్దరు కూతుళ్లు జాహ్నవి, ఖుషిల బాధ్యతలను అనిల్ కపూర్ కుమార్తె సోనమ్ కపూర్ తన భుజాలపైన వేసుకుంది. తల్లిని కోల్పోయి బాధలో ఉన్న జాన్వీ, ఖుషిలకు నేను అండగా ఉంటానని సోనమ్ కపూర్ పేర్కొంది. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపింది.

హోలీకి దూరం

శ్రీదేవి మరణంతో ఆమె నివాసముంటున్న గ్రీన్ ఎకర్స్ సొసైటీ ప్రాంగణంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. శ్రీదేవి మృతి తీవ్రంగా కలచి వేసిందంటూ అక్కడి ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారు. తాజాగా ఆమె పార్థీవ దేహానికి గౌరవ సూచకంగా తామంతా రాబోయే హోలీ వేడుకలను రద్దు చేసుకుంటున్నామని గ్రీన్ ఎకర్స్ సొసైటీ సభ్యులు ప్రకటించారు. మార్చి 2న వస్తున్న హోలీ పండుగను జరుపుకోమని, ఆ రోజు రంగుల జోరు, రెయిన్ డాన్స్, మ్యూజిక్‌తో పాటు ప్రతీ ఏడాది నిర్వహించే కమ్యూనిటీ లంచ్ కూడా రద్దు చేస్తున్నామని తెలుపుతూ ప్రకటన ఇచ్చారు.

చరిత్ర ఎప్పటికీ గుడ్ బై చెప్పలేదు: ప్రియా వారియర్..



అందాల తార శ్రీదేవి ఇకలేరన్న వార్త యావత్ దేశాన్ని శోక సంద్రంలోకి నెట్టేసింది. అయితే ఊహించని రీతిలో ఓవర్ నైట్ లోనే స్టార్ అయిపోయిన ప్రియా వారియర్ కూడా శ్రీదేవికి వీరాభిమాని. కొంచెం కొత్తగా శ్రీదేవికి నివాళి అర్పించిన ఈమె ట్విట్టర్ వేదికగా 'చరిత్ర ఎప్పటికీ గుడ్ బై చెప్పలేదు' అంటూ ట్వీట్ చేసింది.'నా అభిమాన తార శ్రీదేవి మరణ వార్త విని ఆశ్చర్యపోయా. అది నిజమని తెలిసి నా గుండె పగిలిపోయిం ది. ఆమె మన హృదయాల్లో ఎప్పటికీ నివసిస్తూనే ఉంటుంది. అని ప్రియా ట్వీట్ చేసింది.



నా పిల్లల్ని శ్రీదేవి చదివించింది : పూర్వపు వాచ్‌మన్

శ్రీదేవి చెన్నై నుంచి ముంబైకి మారినా.. ఆమె స్థిరాస్తులు ఇప్పటికీ చెన్నైలో ఉన్నా యి. చెన్నై, వీసీఆర్ రోడ్డులో అధునా తనమైన భవనంతో కూడిన ఐదెకరాల స్థలం ఉంది. ఇది షూటిం గ్ స్పాట్‌గా కొనసాగుతోంది. స్థానిక ఆల్వార్‌పేట, సీఐటీ కాలనీ లో భవనం ఉంది. వీటి నిర్వహణ బాధ్యతను వెంకటపతి అనే ఆయనకు శ్రీదేవి అప్పగించారు. శ్రీదేవి ఇంటికి వాచ్‌మన్‌గా ఏడేళ్లు పనిచేసిన మాలైరాజు శ్రీదేవి తమతో చాలా బాగా మాట్లా డేవారని, ఆమెది చాలా మంచి మనసు అని అన్నాడు. తమ పిల్లల్ని ఆమె చదివించారని, శ్రీదేవి సహాయంతోనే తన పెద్ద కొడుకు ఇప్పుడు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడని చెప్పాడు.



అష్రఫ్ ఔదార్యం

● శ్రీదేవి భౌతికకాయం భారత్‌కు చేర్చడంలో తోడ్పాటు

ముంబాయ్: కోట్లాది మంది హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నటి శ్రీదేవి మరణించారన్న వార్త విని అభిమానులెవరూ తట్టుకోలేకపోయారు. ఆమెను కడసారి చూసుకోవాలని ఎదురుచూశారు. కానీ ఆమె మరణించిన దుబాయ్‌లో పార్థివదేహాన్ని తిరిగి స్వదేశానికి పంప డానికి ఎన్నో నిబంధనలు, చట్టాలు. ఇలాంటి పరిస్థితుల్లో లాంఛనాలన్నీ వేగంగా జరిగేలా తోడ్పడి.. శ్రీదేవి పార్థివ దేహం త్వరగా ముంబైకి చేరుకోవడానికి సహకరించింది అక్కడి ఓ భారతీయుడు. 44 ఏళ్ల వయసున్న ఓ మెకానిక్. అధికారిక పత్రాల్లో ఆయన పేరు అష్రఫ్. పూర్తిపేరు అష్రఫ్ షెర్రీ థమరారసెరీ. స్వస్థలం కేరళలోని థమరాసెరి. ఇబ్బందుల్లోఉన్నవారికి సాయం చేయాలన్న మానవతా దృక్పథం నిండుగా ఉన్న మనిషి అష్రఫ్. పొట్ట కూటికోసం దుబాయ్‌కు వలసవచ్చి.. సహజంగానో, ప్రమాదవశాత్తూనో ప్రాణాలు వదిలిన విదేశీయుల దేహాలను తిరిగి వారి స్వదేశాల కు పంపేందుకు తోడ్పడుతూ ఉంటారు. దీంతో దుబాయ్‌లో ఎవరైనా విదేశీయులు మరణిస్తే.. అధికారులు, స్థానికులు ఆయనకు సమాచారం ఇస్తుంటారు. నటి శ్రీదేవి మరణించిన రోజున కూడా ఆయనకు సమాచారం వచ్చింది. వెంటనే తన మెకానిక్ షాపు నుంచి శ్రీదేవి మరణించిన హోటల్ వద్దకు వచ్చారు. పోలీసులు, స్థానిక అధికారులతో మాట్లాడి.. లాంఛనాలన్నీ వేగంగా జరిగేలా చూశారు. మార్చురీ వద్ద, ఇతర అధికార కార్యాలయాల్లో ఏమేం వివరాలు ఇవ్వాలి, భౌతిక కాయాన్ని తిరిగి స్వదేశానికి తరలించేందుకు ఏం చేయాలన్న పేపర్ వర్క్ అంతా స్వయంగా చూసుకున్నారు. చివరిగా ఆసుపత్రి మార్చురీ నుంచి శ్రీదేవి పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో విమానాశ్రయానికి పంపేవరకు అక్కడే ఉన్నారు. శ్రీదేవి మృతి చెందినప్పటి నుంచి తనకు వందలాది మంది జర్నలిస్టులు, అధికారులు ఫోన్లు చేసి వివరాలు అడిగారని.. భారతీయ అధికారులు ఫోన్ చేసి అవసరమైన వివరాలు అందజేశారని అష్రఫ్ థమరాసెరీ చెప్పారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో అక్కడ ఉన్న కొందరు తెలుగువారు తనతో మాట్లాడారని, శ్రీదేవి అంటే ఎంత అభిమానమో చెప్పారని వెల్లడించారు. సేవాభావానికి ప్రతీకగా నిలిచిన అష్రఫ్ ఇప్పటివరకు 38 దేశాలకు చెందిన 4,700 మృత దేహాలను స్వదేశాలకు తిరిగి పంపేందుకు అవసరమైన సహాయాన్ని అందజేశారు. అంతెందుకు నటి శ్రీదేవి మరణం నుంచి తిరిగి ముంబైకి పంపే మధ్య సమయంలోనే ఆయన మరో ముగ్గురికి సంబంధించి కూడా రీపాట్రియేట్ (మరణించి న వారి దేహాలను తిరిగి స్వదేశానికి పంపడం) ప్రక్రియకు సహకరించడం గమనార్హం. ఆష్రఫ్ చేసిన సేవలకు ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి. ప్రధాని మోదీ చేతుల మీదుగా కూడా సత్కారం పొందారు. విదేశాలకు వచ్చిన వారికి ఇక్కడ ఏదైనా అయితే.. ఏం చేయాలి, ఎవరిని సంప్రదించాలన్నది తెలియదు. వారి బంధువులు, తెలిసినవారు కూడా బాధలో ఉంటారు. అలాంటి వారికి తోడుగా నిలవాలన్నదే నా ఉద్దేశం అని అష్రఫ్ తెలిపారు.

'షారూక్ పరుగులు'



ముంబాయ్ : ఆమె చివరి చూపుల కోసం పరుగెత్తు కు రావడం అందర్నీ ఆశ్చర్యా నికి ముంచెత్తింది. సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఆమెకు నివాళులు అర్పించలేకపోయిన షారూక్.. నేరుగా విలేపార్లేలోని పవన్‌హాన్స్ శ్మశానవాటికకే వచ్చారు. అక్కడ కారు దిగిన ఆయన.. పరుగు పరుగున శ్మశానవాటిక లోపలికి వెళ్లారు. ఇక్కడ కూడా మిస్ అవుతామోనన్న ఆందోళన ఆయనలో కనపడింది. షారూక్ అలా ఉరుకులు పరుగులు పెడుతూ రావడం.. లేడీ సూపర్‌స్టార్ షారూక్‌కు ఉన్న ప్రేమకు, అభిమానానికి, గౌరవానికి నిదర్శనమని అంటున్నారు.

రూ.100 కోట్ల ఇన్సూరెన్స్ ఎవరికి?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శ్రీదేవి హఠాత్తుగా చనిపోయినప్పటి నుంచి చాలా ఊహాగానాలు జరుగుతున్నాయి. వాటిలో ఒకటి ఆమె పేరు మీద రూ.100 కోట్ల జీవిత బీమా ఉందని అంటున్నారు. సాధారణంగా టాప్ ఫిల్మ్ సెలబ్రిటీలు వందల కోట్ల రూపాయలు బీమా కవర్ను ఇష్టపడతారు. శ్రీదేవి సాధించిన విజయాన్ని పరిగణనలోనికి తీసుకుంటే రూ.100 కోట్లు పెద్దగా కనిపించవు. దీని గురించి మనం పెద్దగా ఆలోచించనవసరం లేద ు. జీవిత బీమా కొనుగోలు అత్యంత ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలలో ఒకటి, మీరు నమ్మండి నమ్మకపోండి 10 శాతం భారతీయులు మాత్రమే బీమా కలిగి ఉన్నారు. కానీ జీవిత బీమా ఎందుకు అలా ముఖ్యం అంటే, మీరు ఎంత సంపాదిస్తారో, భవిష్యత్తులో ఏది ఎవరూ తెలియదు. చాలా మంది ప్రజలు అనారోగ్యం లేదా ప్రమాదం నుండి ప్రతి సంవత్సరం చనిపోతున్నారు. మీ ప్రియమైన వారికి వినాశకరమైన పర్యవసానాలు ఉండవచ్చు, గృహ ఖర్చులు, రుణాలు చెల్లించే సామర్థ్యం మరియు వారి జీవన ప్రమాణంను కొనసాగించడానికి చాల ఉపయోగపడుతుంది. శ్రీదేవి, బోనీకపూర్‌లు ముంబైలోని అంధేరిలో ఒక అందమైన బంగళాలో నివసిస్తున్నారు. ఇది 35 మిలియన్ డాలర్ల విలువైనది. శ్రీదేవి, బోనీ కపూర్ దంపతులకు పోర్స్చే, కయేన్ వంటి కొన్ని ఫాన్సీ కార్లు, ఆడి మరియు పోర్డ్ కార్స్ ఉన్నాయి. శ్రీదేవి సంవత్సరానికి 2 మిలియన్ డాలర్లు సంపాదించారు. శ్రీదేవి వార్షిక ఆదాయం రూ.13 కోట్లు. ఆమె చిత్రానికి రూ.3.4 నుంచి 4.5 కోట్లు వసూలు చేస్తారు. ఆసక్తికరంగా గత కొన్ని సంవత్సరాలుగా ఆమె నికర విలువ ఇంగ్లీషు వింగ్లీష్‌తో తిరిగి వచ్చిన తరువాత 24 శాతం పెరిగాయి. చిత్రాలకు తిరిగి వచ్చిన తర్వాత ఆమె వార్షిక ఆదాయం 13 కోట్లు. 2018లో శ్రీదేవి నికర విలువ 247 కోట్ల రూపాయలు. శ్రీదేవి మరణం ప్రమాదవశాత్తూ మునిగిపోయింది అని పేర్కొంది. కుటుంబానికి ప్రయోజనకరమైన బీమాను తిరిగి పొందడానికి ఆత్మహత్యకు ప్రయత్నించింది అని కొంతమంది అనుకుంటున్నారు. ఇది పరిగణనలోకి తీసుకునే చెల్లుబాటు అయ్యే పాయింట్ కావచ్చని. కానీ అన్ని నివేదికలు ముగిసినంత వరకు మేము దీనిని నిజమని చెప్ప లేం. ఇది కేవలం ఊహాగానాలే అన్న వాదనలు వినిపిస్తున్నాయి.








శ్రీదేవి చివరి చూపుకోసం తరలివచ్చిన టాలీవుడ్, బాలీవుడ్ నటులు చిరంజీవి, వెంకటేశ్, జయప్రద, ఐశ్వర్య, జయాబచ్చన్, టబు, అజయ్ దేవ్‌గన్, కాజోల్, మాధురీదీక్షిత్

ఎంపీల అలవెన్స్‌ల పెంపు

● మనుషుల రవాణా నిరోధక బిల్లుకు క్యాబినెట్ పచ్చజెండా ● మహిళలు, చిన్నారుల రవాణా చేస్తే జీవితఖైదే.. ● ఎన్ఐఎకు యాంటీ ట్రాఫికింగ్ బ్యూరో బాధ్యతలు

● పప్పుధాన్యాల మద్దతు ధరకు రూ.19వేల కోట్లు ● కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పార్లమెంటు సభ్యుల హౌసింగ్, టెలిఫోన్ సౌకర్యం నిబంధనలు, నియోజకవర్గాల భత్యాల నిబంధనలు, కార్యాలయ ఖర్చుల భత్యాల నిబంధనల మార్పులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఫర్నీచర్ కొనుగోలుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న సీలింగ్ 75వేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పెంచింది. బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కూడా రెగ్యులరైజ్ చేస్తూ సవరణచేశారు. వైఫై నెలవారీ టారిఫ్‌ను 2200కు పెంచాలని నిర్ణయించారు. నియోజకవర్గ భత్యాన్ని 45వేల నుంచి 70వేలకు పెంచారు. ఎంపీల కార్యాలయం ఖర్చుల భత్యాలను 45వేల రూపాయల నుంచి 60వేల రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంపు జనవరి 2018 నుంచి అమల్లోకి రానుంది. ప్రతి అయిదేళ్ల కోసారి ద్రవ్యోల్బణాన్ని అనుసరించి ఈ భత్యాలు పెరగనున్నాయి. ప్రస్తుత పెంపుదలతో 39కోట్ల 22లక్షల రూపాయలు అదనపు భారం కేంద్రంపై పడనుంది. మనుషుల రవాణా నిరోధం, రక్షణ, పునరావస బిల్లుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్ష తన జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో పలు కీలకనిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. మనుషుల రవాణా నిరోధం, రక్షణ, పునరావస బిల్లు 2018ను పార్లమెంటు ప్రవేశపెట్టేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. దీంతో రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టేందుకు లైన్‌క్లియరైంది. ఈ బిల్లులో పలు కీలక అంశాలను ప్రతిపాదించారు. బలవంతంగా కూలీలుగా, బిచ్చగాళ్లుగా మార్చడం, లైంగికదాడులకు పాల్పడడం, పెళ్లిపేరుతో మహిళలు, చిన్నారుల రవాణా చేయడం తదితర అంశాలన్నీ ఈ బిల్లు పరిధిలోకి రానున్నాయి. ఈ నేరాలకు పాల్పడే వ్యక్తులకు పదేళ్ల నుంచి జీవిత ఖైదు విధించనున్నారు. లక్షరూపాయల జరిమానా విధించాలని ప్రతిపాదించారు. మనుషుల రవాణాలో బయటపడిన బాధితుల పేర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ వెల్లడించకుండా, వారికి రక్షణ, పునరావాసం కల్పించనున్నారు. ఇందు కోసం ప్రత్యేక నిధిని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ చట్టం కింద నమోదైన కేసుల పరిష్కారానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక యంత్రాగాన్నిఏర్పాటు చేయనున్నారు. జాతీయ స్థాయిలో ఎన్ఐఎ యాంటీ ట్రాఫికింగ్ బ్యూరో వ్యవహారాలను నిర్వహించనుంది. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే గ్యాంగ్‌లకు సంస్థలకు కళ్లెం వేసేందుకు వారి ఆస్తులను అటాచ్ చేయనున్నారు. తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరిగేమనుషుల రవాణాకు సంబంధించిన నేరాల నిరోధానికి ఇంతవరకు ప్రత్యేకమైన చట్టాలు లేవు. దక్షిణాసియాలో భారత్ తొలుత ఈ అంశంపై బిల్లును తయారు చేసింది. పప్పు ధాన్యాల సేకరణకు మద్దతు ధర అందిచేందుకు గాను ఇప్పుడున్న 9,500 కోట్ల నిధిని రెండింతలు చేస్తూ 19వేల కోట్ల నిధికి పెంచుతూ కేంద్ర మంత్రివర్గంనిర్ణయం తీసుకుంది. దీంతో నాఫెడ్ మార్కెట్ ద్వారా పప్పుధాన్యాలను మద్దతు ధరతో సేకరించే అవకాశం కలగనుంది.

రాహుల్‌తో మర్రి శశిధర్‌రెడ్డి భేటీ

● తెలంగాణలో పార్టీ వ్యవహారాలపై చర్చ

● మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలకు ఆహ్వానం




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, దివంగత మర్రి చెన్నారెడ్డి శత జయంతి వేడుకలకు హాజరు కావాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని తెలంగాణా కాంగ్రెస్ నేత, మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ మర్రి శశిధర్ రెడ్డి ఆహ్వానించారు. బుధవారం ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఆయన తెలంగాణాలో పార్టీ వ్యవహారాలతో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ ఏడాది జనవరి 13 నుంచి వచ్చే ఏడాది జనవరి 13 వరకు తెలంగాణాలో మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తు న్నారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ శత జయంతి వేడుకల కమిటీలో అన్ని పార్టీలకు చెందిన 53 మంది రాజకీయ నాయకులు సభ్యులుగా ఉన్నారు. తెలంగాణా పర్యటనకు వచ్చినప్పుడు తప్పకుండా ఈ వేడుకలకు హాజరు కావాలని మర్రి శశిధర్ రెడ్డి రాహుల్ గాంధీని కోరారు.

లంకేష్‌పై చిత్రాన్ని ఎన్నికల లోపు విడుదల చేస్తాం



బెంగళూరు: గత ఏడాది సెప్టెంబర్‌లో హత్యకు గురైన సీనియర్ జర్నలిస్టు గౌరీ లంకేష్‌పై చిత్రాన్ని కర్నాటక శాసనసభ ఎన్నికల లోగా విడుదల చేస్తామ నీ,అయితే, ఆమెకు సంబంధించిన సమాచారం ఇంకా సేకరించాల్సింది చాలా ఉందని డైరక్టర్ కెపి ప్రదీప్ అన్నారు.ఆమె ఉన్నపళంగా హత్యకు గురి కావడంతో అందరితో పాటు తానూ తీవ్ర మనస్తాపా న్ని చెందాననీ, ఒక దశలో డాక్యుమెంటరీ చిత్ర నిర్మా ణాన్ని ఆపేద్దామని అనుకు న్నాననీ, కానీ, ఆమె మరణం పట్ల ప్రజల్లోవెల్లువెత్తిన నిరసనలు చూసిన తర్వాత నిర్ణయం మార్చుకున్నానని ఆయన విలేకరుతో అన్నారు.గౌరీ లంకేష్ ధైర్య సాహ సాలు అసమానమైన వనీ,ఆమెతోపోల్చగల జర్నలిస్టులు ఎవరూ లేరని అన్నారు. ఆమెకు సంబంధించి ఇంకా సమాచారాన్ని సేకరించాల్సి ఉందని అన్నారు.

ఉగ్రవాదంపై పాక్ చర్యలు చాలవు



వాషింగ్టన్: ఆఫ్ఘనిస్థాన్‌లో హింసకు పాల్పడు తున్న తాలిబన్లు, హఖానీ గ్రూపు ఉగ్ర వాదులంతా పాక్‌లోనే తలదాచు కుంటు న్నారనీ, వారిపై పాక్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చాలవనీ, నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని అమెరి కా సైనిక దళాల సెంట్రల్ కమాండ్ కమాండర్ జోసెఫ్ వోటెల్ అన్నారు.సెనేట్ సైనిక దళాల కమిటీ సభ్యుల ఎదుట తాజా పరిస్థితి గురించి వివరిస్తూ, పాకిస్తాన్‌తో సంబంధాలు కొనసాగాలనే అమెరికా కోరుకుంటోందనీ, అయితే,పాక్ నుంచి సానుకూల స్పందన రావడం లేదని అన్నారు. హఖానీ గ్రూపు,తాలిబన్ ఉగ్రవాదులపై ఉక్కు పాదాన్ని మోపడంలో పాక్ తగిన రీతిలో చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. పాక్‌కి సహాయం నిలిపివేతను ఆయన సమర్థించారు. పాక్ వైఖరిలో మార్పు వచ్చేవరకూ సహాయం స్తంభన కొనసాగుతుందని ఆయన అన్నారు.

కందులు ఇంకా కొనండి

● కిసాన్ భవన్‌లకు నిధులు కేటాయించండి

● కేంద్రానికి మంత్రి పోచారం శ్రీనివాస్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణా వ్యాప్తం గా అధికంగా దిగుబడి అయిన కందులను కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి రాధా మోహన్ సింగ్ అధ్యక్షతన జరిగిన భారత వ్యవసాయ పరిశోధన మండలి 89వ వార్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖా మంత్రులు, అధికారులు హాజరయ్యారు. తెలంగాణా రాష్ట్ర తరఫున సమావేశంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస రెడ్డి పలు సూచనలు చేశారు. రైతుల ఆదా యం రెట్టింపు చేయాలంటే ప్రణాళికలు సరిపోవని, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. నేలలను బట్టి పంటల ను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పండించిన పంటకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు అమ్ముకునే అవకాశం కల్పిస్తే రైతుల ఆదాయం రెట్టింపవుతుందని అన్నారు. సమావేశం అనంతరం రాధామోహన్ సింగ్‌తో భేటీ అయిన పోచారం శ్రీనివాసరెడ్డి నాలుగు వినతి పత్రా లు సమర్పించారు. ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది బడ్జెట్‌లో వంద కోట్ల రూపాయలు కేటాయించాలని, కొత్త జిల్లాల్లో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణాలో ఈ ఏడాది అధికంగా పండిన కందులు మరికొన్ని క్వింటాల్లను కొనుగోలు చేయాలని పోచారం కేంద్ర మంత్రిని కోరారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ భేటీలో రాధామోహన్ సింగ్ అభినందించారు. దేశంలోనే తొలిసారిగా రైతుకు పంట పెట్టుబడి ఇవ్వడంపై సీఎం కేసీఆర్, తెలంగాణా ప్రభుత్వం చేపడుతున్న చర్యలనూ ఆయన ప్రశంసించారు.

సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్

● బీజేపీ సీఎంల సమావేశంలో ప్రధాని మోదీ పిలుపు


●13మంది సీఎంలు హాజరు

● ఒకేసారి ఎన్నికలు, కేంద్ర పథకాల అమలు తీరుపై సమీక్ష



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో అన్ని వర్గాలకు చేరువకావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ ముఖ్య మంత్రులకు దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల నిర్వహించడం వల్ల సమయం ఆదా కావడం తోపాటు, అభివృద్ధి వేగం పెరుగుతుందని బీజేపీ సీఎంల సమావేశంలో అన్నారు. బుధవారం న్యూఢిల్లీ లో బిజెపి నూతన కార్యాలయంలో బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా సమావేశమ య్యారు. ఈ సమావేశంలో 13 మంది ముఖ్య మంత్రులు, ఆరుగురు ఉపముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్ల గోవా సీఎం మనోహర్ పారికర్ హాజరు కాలేదు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరు, పేదల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉండడంతో ప్రధానంగా పేదలు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాల అమలుపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు చేరుతు న్నాయా? లేదా..?, ఆశించిన లక్ష్యాలు నెరవేరు తున్నాయా..? అనే అంశాలపై సమీక్షించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలైన దళితులు, గిరిజనులు, బీసీలు, మహిళలకు అందిస్తున్న పథకాల అమలుపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు, వాటి ప్రభావం లాంటి అంశాలను ప్రధానమంత్రి అడిగి తెలుసుకు న్నారు. ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు సంబంధించిన కార్యాచరణ తదితర అంశాలపై ముఖ్యమంత్రులతో చర్చించినట్లు తెలిసింది. అలాగే అన్ని వర్గాలను కలుపుకునిపోయి సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ నినాదంతో పనిచేయాలని కోరారు. వివిధ పథకాలపై సమీక్షతో పాటు భవిష్యత్ కార్యాచరణను కూడా నిర్దేశించారు. ప్రధానంగా గ్రామాల అభివృద్ధి, పేదలు, రైతులు, దళితులు, బీసీలు, ఆదివాసీలు, యువకులు, మహిళల అభివృద్ధి, సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. అంత్యోదయ లక్ష్యంలో భాగంగా చివరి వ్యక్తి అభివృద్ధి కోసం బహుముఖ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కేంద్ర పార్టీకి, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మధ్య మరింత మెరుగైన సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అన్ని రాష్ట్రాలలోనూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని అధ్యక్షుడు అమిత్‌షా ముఖ్యమంత్రులను విజ్ఞప్తి చేశారు.

భారత్, పాక్‌లు చర్చించుకోవాలి



వాషింగ్టన్ : వాషింగ్టన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతను తగ్గించడం కోసం భారత్,పాక్‌లు కలిసి కూర్చుని చర్చించుకోవాలని అమెరికా సూచించింది.ఈ విషయంలో తమ దేశం జోక్యం చేసుకోబోదని అమెరికా విదేశాంగ శాఖప్రతినిధి హెదర్ నౌరెట్ అన్నారు.ఈ విషయమై విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, సరిహద్దుల్లో ఉద్రిక్తత అనేది ఆ రెండు దేశాలకు సంబంధించిన విషయం, ఇతరుల జోక్యం సమంజసం కాదు,భారత్,పాక్‌లు ఎన్నిసార్లయినా చర్చించుకోవచ్చు, చర్చల ద్వారా పరిష్కారం కాని సమస్యలుండవు,ఉద్రిక్తతలను పెంచుకోవడం వల్ల ఇరువైపులా ప్రాణ నష్టం తప్ప ఎవరికీ ఉపయోగం ఉండదు.ఇప్పటికైనా ఈ రెండు దేశాలూ చర్చించుకుని సమస్యను పరిష్కరించుకుంటాయని ఆశిస్తున్నాం అని ఆమె అన్నారు. ఉగ్రవాదం నిర్మూలన విషయంలో పాక్ ఇంకా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్న సైనికదళాల సెంట్రల్ కమాండ్ కమాండర్ జోసెఫ్ వోటెల్ తమ ప్రభుత్వ వాదాన్నే వినిపించారని ఆమె అన్నారు.

సేవా దృక్పథంతో మెలగండి




●ఎన్‌పిఎలో సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన ఉప రాష్ట్రపతి

● ట్రైనీ ఐపిఎస్‌లకు దశ దిశ నిర్దేశించిన వెంకయ్యనాయుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు బుధవారం నగర శివార్లలోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్‌విపిఎన్‌పిఎ)ను సందర్శించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐపిఎస్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ, సమగ్రత, వృత్తిపరమైన నిబద్ధత, సేవా దృక్పదంతో ప్రజలకు సేవలను అందించినపుడే వృత్తికి న్యాయం చేసినవారవుతారన్నారు. సర్ధార్ వల్లభభాయ్ పటేల్ దేశ సమగ్రత, సార్వభౌమత్వం కాపాడటం కోసం చూపిన పరిణతిని అలవర్చుకోవాలన్నారు. దేశంలోని అత్యున్నతమైన శిక్షణా సంస్థ ఎన్‌పిఎ అని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. ఇక్కడ కేవలం శిక్షణ ఇవ్వడం కాదు, ప్రజా జీవితంలో ఏ రకంగా ప్రవర్తిస్తే ప్రత్యేక గుర్తింపు వస్తుంది, ప్రజలతో ఎలా మెసలుకోవాలన్న అంశాలపై కూడా పూర్తి స్థాయిలో అవగాహన కలిపిస్తారన్నారు. సమాజంలో మహిళలపైనా, పిల్లలపైనా జరుగుతున్న నేరాలను అరి కట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవ్యకతను వివరించారు. ప్రజలకు దగ్గరై వారిలో ఒకరిగా మెదిలినపుడే వారికి నమ్మకం కలిగించినట్లవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఉగ్రవాదం, జాతి వ్యతిరేక శక్తులకు యువకులు ఆకర్షితులవకుండా చూడాలన్నారు. దేశం అంతర్గతంగా, బహిర్గతంగా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటుందని, వాటన్నింటిపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, వాటికి పరిష్కారం కూడా చూపించేంత సామర్థ్యాన్ని సంపాదించుకోవాలన్నారు. ఉప రాష్ట్రపతి వెంట తెలంగాణ రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు, ఎన్‌పిఎ సంచాలకులు డిఆర్ డోలే బర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ డ్రాఫ్టింగ్ కమిటీలో పొన్నం, పల్లం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ ప్లీనరీ డ్రాఫ్ట్ కమిటిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు చోటు కల్పించారు. కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజుకు అవకాశం ఇచ్చారు. కాగా ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టాక ప్లీనరీ సమావేశాల్లో చర్చించేఅంశాలపైన డ్రాఫ్టింగ్ కమిటిని గతంలోనే నియమించారు. ఈ కమిటికి ఛైర్మన్‌గా మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, కన్వీనర్‌గా కేంద్ర మాజీ మంత్రి ముఖుల్‌వాస్నిక్ ఉన్నారు. ఈ కమిటిలో సభ్యులుగా పార్టీ సీనియర్లు ఆంటోని, చిదంబరం, గులాంనబీ ఆజాద్, ఆహ్మద్‌పటేల్, మీరాకుమార్, అశోక్‌గెహ్లాట్, జనార్ధన్ ద్వివేది, జైరాం రమేష్, తో పాటు 44 మంది సీనియర్లు ఉన్నారు.రాష్ట్రం నుంచి పొన్నం ప్రభాకర్‌కు అవకాశం కల్పించ డంతో పలువురు పార్టీ నేతలు అభినందనలు తెలిపారు.



దివ్యాంగుల పరీక్షలకు ల్యాప్‌టాప్‌లు

న్యూఢిల్లీ: దివ్యాంగ చిన్నారులు కంప్యూటర్, ల్యాప్‌టాప్‌పై పది, 12 బోర్డు పరీక్షలు రాసేందుకు సీబీఎస్ఈ అనుమతించింది. సీబీఎస్ఈ పరీక్షల కమిటీ సూచనమేరకు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే దీని కోసం వారు సంబంధిత వైద్య అధికారి ధృవీకరించిన పత్రంతో కేంద్ర సూపరింటెండెంట్‌కు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దివ్యాంగ విద్యార్థులు కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను ఫార్మాట్ చేసి తమ వెంట తీసుకురావాల్సి ఉంటుంది. ఎలాంటి ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉండకూడదు. ప్రశ్నాపత్రాలను పెద్దగా వీక్షించడం, ప్రశ్నల ఆడియోను వినడం, రాయడానికి మాత్రమే వీటిని వినియోగించాల్సి ఉంటుంది. సమాధానాల ప్రింటవుట్‌పై ఇన్విజిలేటర్ సంతకం చేస్తారు. అలాగే దివ్యాంగ విద్యార్థుల తరుఫున మరోవ్యక్తి పరీక్ష రాయడం ఇష్టం లేకపోతే ప్రశ్నాపత్రం చది వేందుకు మరొకరి సహాయం తీసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. అలాగే స్కూల్లో హాజరు 50 శాతం లేకపోయినా బోర్డు పరీక్షలకు అనుమతిం చాలని సీబీ ఎస్ఈ నిర్ణయించింది. సంబంధిత అధికారులకు ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

అత్యాచారం కేసులో 5గురు అరెస్ట్

పాల్గఢ్: మహారాష్ట్రలోని పాల్గఢ్ జిల్లాలోని శివారు ప్రాంతంలో 13 ఏళ్ళ బాలికపై సామూహిక అత్యాచారం కేసుకు సంబంధించి ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు మేజర్లు కాగా ముగ్గురు మైనర్ బాలురు. జవహర్ నియోజకవర్గం జాంబ్లా గ్రామంలో ఈ నెల 24న ఈ ఘటన జరిగింది. బాలిక స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా కొందరు అడ్డుకుని సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసునకు సంబంధించి అక్షయ్, దేవిదాస్‌తోపాటు 16, 17 ఏళ్లున్న ముగ్గురు బాలురను కస్టడీలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

మత ఘర్షణలో 13మంది మృతి

లాగోస్: నైజీరియాలో జరిగిన మత ఘర్షణలో 13 మంది మృతి చెందినట్లు ఆ దేశ పోలీస్ అధికారులు వెల్లడించారు. కదునా జిల్లాలో సోమవారం కసువాన్ మాగాణి కమ్యూనిటీలో క్రిస్టియన్లు, ముస్లిం యువకుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. ఇందులో 13 మంది చనిపోగా పలు ఇల్లులు, షాపులను ఆందోళనకారులు దగ్ధం చేసినట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. మృతుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. క్రిస్టియన్ మతానికి చెందిన కొందరు యువతులు ముస్లిం యువకులతో స్నేహంగా ఉండటాన్ని సహించలేక ఈ ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది.

కాల్పుల్లో పోలీస్ అధికారుల మృతి

కాందహార్: ఆఫ్ఘనిస్తాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. బుధవారం జరిగిన రెండు వేర్వేరు సంఘటనల్లో ఆరుగురు పోలీస్ అధికారులు మృతి చెందగా 30 మంది కిడ్నాప్ అయ్యారు. పోలీస్ చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు అధికారులు చనిపోగా మరో ఐదుగురు గాయపడినట్లు కాందహార్ పోలీస్ అధికారి అబ్దుల్ రజిక్ తెలిపారు. మరో ఘటనలో ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ముష్కరులు ఓ బస్సును అడ్డుకుని అందులోని 30 మందిని కిడ్నాప్ చేశారని, వీరిలో 19 మంది పోలీసులు ఉన్నట్లు పోలీస్ అధికారి అబ్దుల్ రజిక్ వివరించారు. అయితే ఈ రెండు ఘటనలకు తామే కారణమని ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించలేదు. అయితే తాలిబాన్ల పనేనని అనుమానిస్తున్నారు.

గద్వాల్‌లో కంచిపీఠం

క్షయ, నేత్రవ్యాధుల ఆస్పత్రి!

శివైక్యం చెందిన కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మానవ సేవే మాధవ సేవ అనే సూక్తిని నర సేవ-నారాయణ సేవ సులభశైలిలో ప్రజలకు అందించిన ద్వంద్వ పదం. 1994లో కంచి పీఠాధిపత్యాన్ని అధిష్టించిన జయేంద్ర సరస్వతి అన్ని జన్మల్లో మానవ జన్మ పరమోత్కృష్టమైనదనీ, దానిని సద్వినియోగం చేసుకోవడం ప్రతి మనిషి కనీసకర్తవ్యమని ప్రబోధించడమే కాదు ఆచరించారు. అన్ని జీవుల కన్నా వివేకాన్ని భగవంతుడు అందించినందుకు జీవిత పరమార్థాన్ని తెలుసుకుని మసు లుకోవడమే మనిషి ధర్మమని ఆయన ప్రవచించేవారు. నరుడూ,నారా యణుడూ ఒక్కడేనన్నది అద్వైత సిద్ధాంతం పరమ లక్ష్యం. అహం బ్రహ్మాస్మిని సాధించాలంటే ప్రతి మనిషి విధిగా సాటి మానవుని పట్ల కారుణ్య దృక్పథాన్ని, సేవా నురక్తిని కలిగి ఉండాలని స్వామిజీ ప్రబోధించారు.పరోపకారార్థం మిదం శరీరం అనే సూక్తిని అక్షరాల పాటించిన మహనీయుడు ఆయన.ఈ పరమ లక్ష్యాన్ని సాధించడం కోసం హిమాలయాల్లోని గద్వాల్ ప్రాంతంలో ఆయన 32 ఏళ్ళ క్రితం రుద్ర ప్రయాగ వద్ద గల రథుర గ్రామాన్ని సందర్శించారు.రుషీకేశ్‌కి 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు ఎక్కువ మంది ఉండేవారు. స్వామీజీ ఆ గ్రామానికి వెళ్ళగానే క్షయ వ్యాధి పీడజితులకు సరైన వైద్య సౌకర్యాలు లేవనీ, ఎంతో మంది క్షయవ్యాధి గ్రస్తులు అకాల మరణాలకు గురి అవుతున్నారని మొరపెట్టుకున్నారు. దాంతో స్వామీజీ అలక్‌నందా నదీ తీరాన కొండ ప్రాంతంలో రథురలో స్థానికులు విరాళంగా ఇచ్చిన స్థలంలో కామకోటి పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ఒక ఆస్పత్రి నిర్మాణానికి తోడ్పాటును అందించారు.ఈ ఆస్పత్రి ద్వారా చుట్టు పక్కల 30గ్రామాల్లో క్షయరోగపీడితులకు వైద్య సేవలు అందే ఏర్పాటుచేశారు.మందులు ఉచితంగా పంపిణీ చేయించారు. కుల,మత,ప్రాంత,భాషా భేదాలు లేకుండా అందరికీ వైద్య సదుపాయం అందేట్టు చేశారు.దాంతో ఈ ప్రాంతానికి సిద్ధ స్థల్ అని పేరొచ్చింది. తర్వాత గడ్వాల్ ప్రాంతంలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు బహుళార్థ ఆస్పత్రిని శంకర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్మించేట్టు చేశారు.ఈ ఆస్పత్రి సముదాయానికి ఉత్తర కంచి అని నామకరణం చేశారు. ఆ తర్వాత ఆ సముదాయంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణమైంది.ఎక్స్‌రే యూనిట్,ఇంకా అధునాతన వైద్య పరీక్షల విభాగాలు ఏర్పాటైనాయి. శంకర్ నేత్రాలయ ఏర్పాటుకు ప్రేరణ ఇదే. 1997లో మొదటి దశ ఆస్పత్రి 20 పడకలతో సిద్ధమైంది.దానికి కామకోటి శంకర ఆస్పత్రిగా నామకరణం చేశారు. ఆనాటి గడ్వాల్ కమిషనర్ సుభాష్ కు మార్ దీనిని ప్రారంభించారు.ఈ ఆస్పత్రిలో డాక్టర్ ఆర్ వి రమణి నేతృత్వంలో నేత్ర వైద్యులు శస్త్ర చికిత్సలు నిర్వహించారు.ఇందుకు అవసరమై న ధన సహాయాన్ని వదాన్యులు జివి ఈశ్వర్ ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో నేత్ర మార్పిడి చికిత్సలు కూడా నిర్వహించారు. భారత్ విజన్ ప్రోగ్రామ్ విజయవంతం కావడానికి కోయంబత్తూరుకు చెందిన వైద్యుల బృందం అసమానమైన ఈ బృందం సేవలు నేపాల్ రాజధాని ఖాట్మండూకీ, బీహార్‌లోని మధుబని జిల్లాకీ విస్తరించాయి. గడ్వాల్ ఆస్పత్రి రెండవ దశ నిర్మాణాన్ని కూడా ఇదే ఉత్సాహంతో చేపట్టా రు.అంబులన్స్‌లు, పేథాలజీ విభాగం,శస్త్ర చికిత్సల విభాగం,ఆధునిక పరికరాలు సమకూర్చడం జరిగింది.



విజయ గణపతి ఆలయం

ఉత్తర కంచిలో విజయగణపతి ఆలయాన్ని దక్షిణాదికి చెందిన స్తపతులను పిలిపించి నిర్మిం పజేశా రు.కేదార్‌నాథ్,బదరీనాథ్ సందర్శించే యాత్రికులంతా ఈ ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకుంటారు. విజయ గణపతిఆలయం కుంభాభిషేకం 1996 జూన్‌లో జరిగింది. ఈ సముదాయంలో కామాక్షి,దక్షిణామూర్తి, మహా విష్ణు విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు.

శంకర్ బాల విద్యాలయ

శంకర్ బాల విద్యాభవన్‌ని స్థానిక ఉప సంఘం నిర్వహిస్తోంది.ఈ పాఠశాలలో కంప్యూటర్,టైప్ రైటింగ్ వంటి ఆధునిక శిక్షణా సౌకర్యాలను కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సంప్రదాయ సిద్ధమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు కూడా కృషిజరుగుతోంది. కామాక్షి యాత్రీ నివాస్: ఆస్పత్రి కోసం కొత్త భవనాన్ని నిర్మించడంతో పాత భవనాన్ని యాత్రి నివాస్‌గా మార్చి కామాక్షి యాత్రీ నివాస్ అని పేరు పెట్టారు. బదిరీనాథ్ యాత్రీకులు ఇక్కడ మజిలీ చేసేందుకు చక్కనిఏర్పాట్లు చేశారు.

దేవభూ మిలో సేవలు: హిమాలయాల్లో దేవ్ భూమిగా పేరొందిన గడ్వాల్ పర్వత ప్రాంతాల్లో సేవలను విస్తరింప జేసిన ఘనత జయేంద్ర సరస్వతి స్వామిదే. ఆయన ఆదేశాల మేరకే ఇక్కడ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శంకర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలతోపాటు విద్యావ్యాప్తి కూడా సాగుతోందని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ కెఎస్ శంకర్ తెలియజేశారు.ఈ సేవాకార్యక్రమాలకు వదాన్యుల నుంచి ప్రోత్సాహాన్ని ఆయన కోరుతున్నారు.



క్రీడాప్రభ

2020 ఒలింపిక్స్ మస్కట్ ఎంపిక పూర్తి



టోక్యో: ఒలింపిక్స్-2020కి ఆతిథ్యమిస్తున్న జపాన్ బుధవారం క్రీడల మస్కట్ ఎంపిక పూర్తయింది. అయితే దీనికి ఇంకా పేరు పెట్టలేదు. జపాన్ రాజధాని టోక్యోలో జరుగనున్న ఈ క్రీడల మస్కట్‌కోసం ఆ దేశంలోని పాఠశాల విద్యార్థుల నుంచి అభిప్రాయాలను కోరింది. డిజైనర్ రియోతానిగుచి రూపొందించిన సమ్మర్ ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్‌కు సంబంధించి మూడు జతల క్యారెక్టర్ల నుంచి నచ్చిన మస్కట్ల జతను ఎంపిక చేయాలని ఒలింపిక్స్ నిర్వాహకులు విద్యార్థులను కోరారు. ఎక్కువ శాతం విద్యార్థులు ఎ ఆప్షన్‌కే టిక్ పెట్టారు. ఈ క్యారెక్టర్ ఆకారం ఆకర్షణీయంగా ఉంటుంది. సాంప్రదాయకతతో పాటు, ఆధునికతను చాటుతూ.. శరీరంపై నీలం రంగు చారలతో కూడి, అమాయకత్వాన్ని ప్రతిబింబించే వ్యక్తిత్వాన్ని కలిగిన క్యారెక్టర్‌ను ఎంపిక చేశారు. దీనికి చెవులు సూదిమొనవలెఉంటాయి. అంతేకాక ఈ క్యారెక్టర్‌కున్న విలక్షణ ఏమిటంటే.. ప్రత్యేక శక్తులు, అద్భుత విచక్షణతో పోటీ పడే తత్త్వం దీని సొంతం. అది ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడైకైనా సరే క్షణాల్లో చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. కాగా ఇక్కడ జరిగే పారా ఒలింపిక్స్ క్రీడలకోసం పింక్ చారలతో కూడిన డిజైన్‌ను జపాన్‌కే ప్రత్యేకమైన చెర్రీ బ్లస్సూమ్(పూల చెట్టు)నుంచి ఎంపిక చేశారు. ఈ క్యారెక్టర్ అవసరమైనప్పుడు అది అత్యంత శక్తిని పొందుతుందని నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా ఇది మౌనంగా ప్రశాంతంగా ఉంటుంది. అది రాళ్లతో, గాలితో మాట్లాడే శక్తిని కలిగివుండి... తన చూపుతో వస్తువులను కదిపే శక్తి దీని సొంతం. ఈ రెండు డిజైన్లకు లక్షా పదివేల ఓట్లు వచ్చాయి. మొత్తం 16,000 పాఠశాలల్లోని 2 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారు. మస్కట్లు రూపొందించడంలో జపాన్ ప్రఖ్యాతి పొందింది. ది ల్యాండ్ ఆఫ్ హెల్లో కిట్టి, పోకిమాన్‌లతోపాటు వేలకొద్దీ చిన్నా చితక క్యారెక్టర్లు సృష్టించడంలో అక్కడి డిజైనర్లు సుప్రసిద్ధులు. స్థానికంగా పేరుగాంచిన యురు- క్యారా లేదా లెయిడ్ బ్యాక్ క్యారెక్టర్స్ ఆదాయాన్ని భారీగా సృష్టించాయి. 2010లో సృష్టించిన కుమామొన్ అనే పేరున్న కుండవలే నడుమున్న ఎర్రచెంపల ఎలుగుబంటి క్యారెక్టర్ బొమ్మ దాని నమూనాలు, తదితర ఉత్పత్తుల విక్రయం ద్వారా గత ఏడాది వ్యాపారులకు 8.8 మిలియన్ డాలర్లను సముపార్జించి పెట్టింది.

మెక్సికో ఓపెన్ నుంచి నాదల్ విరమణ



అకాపుల్కో, మెక్సికో: తిరగబెట్టిన గాయంతో స్పెయిన్‌కు చెందిన టెన్నిస్ దిగ్గజం వరల్డ్ నెంబర్ 2 ఆటగాడు రఫెల్ నాదల్ మెక్సికో ఓపెన్ నుంచి విరమించాడు. ఈ టోర్నీలో ఆడాలని ఎప్పటి నుంచో అనుకుంటున్న నాదల్ గాయం కారణంగా విరమించుకోవలసి వచ్చిందని నాదెల్ బుధవారం విలేకరులతో అన్నాడు. 'ఈ టోర్నీలో ఆడడమే ధ్యేయంగా భావించాను. మంగళవారం నా ట్రైనింగ్‌సెషన్‌లో అనుకోకుండా నా కుడి కాలి తొడలో నొప్పి తీవ్రంగా తిరగబెట్టింది' అని ఏటీపీ టూర్ ఈవెంట్ ప్రారంభ మ్యాచ్‌కు కొన్ని గంటలముందు 31ఏళ్ల నాదెల్ చెప్పారు. నాదల్ ఈ టోర్నీ ఛాంపియన్‌షిప్‌ను గతంలో 2005, 2013 గెలుచుకున్నాడు. డబుల్స్‌లో స్పెయిన్‌కు చెందిన తన సహచరుడు ఫెలిసియాన్ లోపెజ్‌తో ఆడాల్సి ఉంది. ఇక్కడ ఆడేందుకు తాను ముందస్తుగా సిద్ధమయ్యాయని నాదల్ చెపుతూ.. ఇక్కడ వాతావరణానికి అలవాటు పడటానికి తొలుత కొజుమెల్‌కు వెళ్లానన్నాడు. జనవరి 23న ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఆడుతున్న సమయంలో ఇదే నొప్పి వచ్చిందని నాదల్ తెలిపాడు. ఆ టోర్నీలో నాదల్ సెమీస్‌కు చేరి ఆట నుంచి విరమించుకున్నాడు. అప్పటివరకు వరల్డ్ నెంబర్ 1గా ఉన్న నాదల్ జనవరి 23 నుంచి తన ర్యాంకును రోజర్ ఫెదరర్‌కు కోల్పోయి రెండో స్థానంలో కొనుసాగుతున్నాడు. నాదల్ తన టెన్నిస్ కెరియర్లో ఇప్పటివరకు ఆస్ట్రేలియా ఓపెన్, బ్రిస్బేన్, లండన్, పారిస్, బాసెల్, అకాపుల్కో టోర్నీల నుంచి విరమించాడు.

రెండో వన్డేలో ఇంగ్లండ్ గెలుపు

మౌంట్ మౌంగ్యాన్యూ(న్యూజిలాండ్): ఇంగ్లండ్ జట్టులోకి తిరిగి వచ్చిన బెన్‌స్టోక్స్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ ఆశించిన మేరకు రాణిస్తున్నాడు. బుధవారం జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ గెలుపులో బెన్ కీలక పాత్ర పోషించాడు. బెన్ 63 పరుగులు చేసి (నాటౌట్) జట్టుకు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి పెట్టాడు. కెప్టెన్ మోర్గాన్ బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లు చెరొకటి గెలిచి 1-1తో సమానంగా ఉన్నాయి. మోర్గాన్ 62 పరుగులు చేసి ఔటవగా, బెన్ 63 పరుగులు చేసి నాటౌట్ నిలిచాడు. అంతకు ముందు టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ చేయాలని నిర్ణయించుకుంది. న్యూజిలాండ్ 49.4 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌట్ అయింది. బెన్ మొయినలీ, వోక్స్ తలా రెండు వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ 37.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 225 పరుగులు సాధించి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బెన్ స్టోక్స్‌కు దక్కింది.

జిమ్నాస్ట్ అరుణకు 3న సన్మానం



హైదరాబాద్: ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ కప్ జిమ్నాస్టిక్ ఈవెంట్లో భారత్‌కు తొలి పతకం అందించిన హైదరాబాద్ జిమ్నాస్ట్ బుద్దా అరుణా రెడ్డికి, ఆమె కోచ్ ఎన్ బ్రిజ్ కిషోర్‌ను మార్చి 3న సన్మానించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) చైర్మన్ ఎ. వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి టి.పద్మారావు గౌడ్, శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, క్రీడా మంత్రిత్వ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, స్పోర్ట్స్ ఎండి దినకర్ బాబు, తెలంగాణ జిమ్నాస్టిక్స్ ఆసోయేషన్ కార్యదర్శి మహేశ్వర్ తదితర సంస్థల అధికారులు పాల్గొననున్నారు.

వచ్చే ఏడాదిలో రిటైర్మెంట్!

- 2019 పర్యంతం ఆడతాను
- ఐపీఎల్‌లో సత్తా చూపిస్తా



మొనాకో: జాతీయ క్రికెట్ జట్టుకు దూరమైన ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తన భవిష్యత్ కెరియర్‌పై వ్యాఖ్యానిస్తూ.. 2019 పూర్తి వరకు తాను క్రికెట్ ఆడతానని అన్నాడు. బుధవారం మొనాకోలో జరిగిన 18వ లారెస్ ప్రపంచ క్రీడా అవార్డుల సమారోహంలో భారత తరపున ప్రతినిధిగా పాల్గొన్న 36 ఏళ్ల యువరాజ్ అనంతరం మీడియాతో ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. తన రిటైర్మెంట్‌పై అడిగిన ఒక ప్రశ్నకు బదులిస్తూ.. తాను 2019 పర్యంతం క్రికెట్‌ను ఆడతానని చెప్పాడు. యువరాజ్ భారత తరపున తన చివరి అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌ను 2017 జూన్‌లో ఆడాడు. వచ్చే ఐపీఎల్ తనకు కీలకమని.. టీ20 ఈవెంట్‌లో సత్తాను చాటి 2019లో జరిగే ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు. 'ఐపీఎల్ నాకు అత్యంత ముఖ్యమైన టోర్నీ. ఇందులో 2019 పర్యంతం నేను క్రికెట్‌లో కొనసాగడానికి ఇది మార్గం కల్పిస్తుంది. 2019 పర్యంతం నేను క్రికెట్ ఆడాలనుకుంటున్నాను. అనంతరం నా ఆటను కొనసాగాలా వద్దా అన్నది ఆలోచిస్తా ' అని యువరాజ్ స్పందించాడు. 2011 ప్రపంచ కప్ వరకు జట్టులో నిలకడగా ఉన్న యువరాజ్ క్యాన్సర్ చికిత్సకోసం ఆటకు దూరం అయ్యాడు. భారత టెస్టు జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోకపోవడంపై యువీ విచారాన్ని వ్యక్తం చేశాడు. 'క్రికెట్ కెరియర్ ప్రారంభంలో తొలి 6-7 తంతంత ఏళ్లలో నేను అత్యున్నత స్థాయిలో రాణిస్తున్నప్పుడు ఎక్కువ అవకాశాలు రాలేదు. ఎందుకంటే అప్పట్లో టెస్టు జట్టులో గొప్ప ఆటగాళ్లు ఉన్నారు. క్యాన్సర్ ఉందని తేలిన సమయంలోనే నాకు అవకాశం వచ్చింది. అప్పటికి పరిస్థితులు నా నియంత్రణలో లేవు. అప్పటినుంచి క్రికెట్లో నేను కోరుకున్న స్థాయిని చేరుకునేందుకు ఎదురు చూస్తున్నాను' అని యువీ అవేదన వ్యక్తం చేశాడు.

కోహ్లీ సేనఅద్భుతంచేసింది

ఇటీవల దక్షిణాఫ్రికాలో విరాట్ కోహ్లీ సారథ్యంలోని భారత జట్టు పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో బాగా రాణించిందని అన్నాడు. టెస్ట్ సిరీస్‌ను కోల్పోయినప్పటికి గట్టి పోటీనిచ్చిందన్నాడు. వన్డే, టీ20ల్లో సిరీస్‌లను గెలుచుకుని ఈ ఫార్మాట్లలో తిరుగులేదని చాటిందన్నాడు. కోహ్లీ బ్యాటింగ్ లో స్వయంగా రాణించి జట్టు సభ్యులకు ప్రేరణనిచ్చాడని తెలిపాడు. స్పిన్నర్లు ముఖ్యంగా చాహల్, యాదవ్‌లు అద్భుతంగా రాణించి సఫారీలను ఇబ్బంది పెట్టారని చెప్పాడు. విదేశాల్లో మూడు సిరీస్‌లు ఆడి రెండు సిరీస్‌లను గెలిచి భారత్ తన ఆధిక్యతను ప్రదర్శించిందన్నాడు. త్వరలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా దేశాల్లో భారత్ పర్యటించనున్న నేపథ్యంలో ఆటగాళ్లు నిలకడగా రాణిస్తే ఆ దేశాల్లో కూడా భారత్‌దే విజయమని యువీ చెప్పాడు. 'ప్రస్తుతం ప్రపంచాన్ని జయించాలన్న లక్ష్యంతో జట్టును తయారు చేయవలసి ఉంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌లు జరుగుతాయి. ఈ పర్యటనలో నిలకడగా రాణిస్తే ఆటగాళ్లలో స్థైర్యం పెరుగుతుంది' అని యువరాజ్ వ్యాఖ్యానించాడు.

యువ ఆటగాళ్లు డబ్బుకోసం పరితపించొద్దు

అండర్ 19 క్రికెట్ ఆటగాళ్లు పృథ్వీ షా, శుభ్‌మాన్ గిల్ వంటి వర్ధమాన క్రికెటర్లు ఐపీఎల్ టోర్నీల్లో పాల్గొంటూ భారీ ఆదాయాన్ని పొందుతున్నారని.. డబ్బుకోసం వెంపర్లాడకుండా సీనియర్ల జట్టులోకి రావడానికి ప్రయత్నించాలన్నారు. 'పృథ్వీ, శుభ్‌మాన్, అభిషేక్ శర్మలలో గొప్ప ప్రతిభ దాగివుంది. రానున్న సంవత్సరాల్లో వారు భారత సీనియర్ జట్టులోకి వస్తారు. ఐపీఎల్ టోర్నీ ఇందుకు చక్కని వేదిక. ఇక్కడ అంతర్జాతీయ క్రికెటర్లతో సాహచర్యం లభించడమేకాక, క్రికెట్‌లో మరిన్ని మెళుకువలు నేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తుంది' అని యువరాజ్ అన్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.